- లెబనాన్ సరిహద్దులో యుద్ధట్యాంకులు
- స్కూళ్ల సమీపంలో జంక్‌ఫుడ్‌పై నిషేధం
- 'ఐవీఎఫ్' పిల్లలకు గుండె సమస్యలు
- మధుమేహానికి చెక్‌పెట్టే వరి వంగడం
- నీట మునిగిన చైనా అణు జలాంతర్గామి!

..లోపలి పేజీల్లో

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

శనివారం SATURDAY 28.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 14 || సంచిక (Issue): 114 || వెల (Price) రూ.6.50 | ఏకాదశి

శనివారం, సూర్యోదయం: 6-06, సూర్యాస్తమయం: 6-07. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: ఏకాదశి పగలు 2-49 వరకు. నక్షత్రం: ఆశ్లేష రాత్రి 3-38 వరకు. వర్జ్యం: పగలు 3-22 నుంచి సాయంత్రం 5-08 వరకు. రాహుకాలం: ఉదయం 9-06 నుంచి ఉదయం 10-36 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 6-06 నుంచి ఉదయం 7-42 వరకు. అమృతకాలం: రాత్రి 1-52 నుంచి రాత్రి 3-37 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD


www.ntnews.com /ntdailyonline

తీవ్ర ఆర్థిక నేరాల్లో పొంగులేటి కుటుంబం!

రూ.600-800 కోట్ల అక్రమాల గుర్తింపు?

మంత్రి పొంగులేటిపై ఈడీ రెయిడ్

నివాసాలు, ఆఫీసులపై ఏకకాలంలో దాడులు



పొద్దున లేస్తే నీతులు వల్లించే కాంగ్రెస్ సర్కార్‌లోని కీలక మంత్రి అడ్డంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి దొరికిపోయారు. గత కొంతకాలంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాపార సామ్రాజ్యంపై వరుస ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈడీ శుక్రవారం దాడులు జరిపింది. హైదరాబాద్‌లోని పొంగులేటి, ఆయన కుమారుడు హర్షారెడ్డి నివాసాలు, కార్యాలయాలపై ఏకకాలంలో ఈ దాడులు జరపడం సంచలనం సృష్టించింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన సోదాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. శనివారం కూడా ఈ సోదాలు కొనసాగే అవకాశం ఉన్నదని అధికార వర్గాలు చెప్తున్నాయి.

రాష్ట్రంలోని రాజకీయ ప్రముఖుడిపై ఇటీవలికాలంలో ఈ స్థాయిలో దాడులు జరగడం ఇదే తొలిసారి. సోదాలకు సంబంధించి ఈడీ వర్గాల నుంచి అధికారిక ప్రకటన ఏదీ వెలువడనప్పటికీ.. పెద్దఎత్తున అక్రమాలను గుర్తించినట్టు ప్రాథమికంగా తెలిసింది. సోదాల సందర్భంగా మూడుసార్లు కరెన్సీ లెక్కింపు యంత్రాలను పొంగులేటి నివాసంలోకి ఈడీ సిబ్బంది తీసుకెళ్లడాన్ని బట్టి పెద్దఎత్తున కరెన్సీని కూడా కనుగొని ఉంటారని భావిస్తున్నారు. బోగస్ కంపెనీలతో విదేశాలకు హవాలా మార్గాల ద్వారా పెద్దఎత్తున నగదును తరలించినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ దాడులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. టీడీఎస్ అక్రమాలు సహా పలు అంశాలపై ఈడీ అధికారులు విచారణ జరుపుతున్నారు. రూ.600 నుంచి 800 కోట్ల మేర అక్రమ లావాదేవీలను అధికారులు కనుగొన్నట్టు వార్తలు వెలువడుతున్నాయి.

పొంగులేటి వ్యవహారాలకు సంబంధించిన కీలక పత్రాలు ఈ సోదాల్లో ఈడీకి హస్తగతమైనట్టు విశ్వసనీయ సమాచారం. తెలంగాణలో విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలను ఇటీవల కాంగ్రెస్‌లో చేర్చుకోవడం వెనుక మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఈ ఫిరాయింపుల వెనుక పెద్దఎత్తున కోట్లు చేతులు మారినట్టు విమర్శలు కూడా వచ్చాయి. ఈ పరిణామాలకు సంబంధించి కొన్ని ఆధారాలను ఈడీ స్వాధీనం చేసుకున్నట్టు, వీటి ఆధారంగా ఫిరాయింపు ఎమ్మెల్యేల మీద కూడా త్వరలో దృష్టి సారించనున్నట్టు చెప్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఢిల్లీలోని హైకమాండ్‌కు రాష్ట్రం నుంచి అందిన భారీ మొత్తాలకు సంబంధించిన ఆధారాలు కూడా ఈడీకి చేజిక్కినట్టు అనుమానిస్తున్నారు.



జూబ్లీహిల్స్‌లో రోడ్ నం 17లోని పొంగులేటి నివాసంలో సోదాల సమయంలో నోట్ల లెక్కింపు మిషన్‌ను తీసుకువెళ్తున్న ఈడీ సిబ్బంది



బంజారాహిల్స్‌లో రోడ్ నం 10లోని రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఆఫీసు నుంచి డబ్బు ఉన్నట్టుగా భావిస్తున్న సంచిని తీసుకువెళ్తున్న కంపెనీ సిబ్బంది

- అర్ధరాత్రి దాకా 16 గంటలు ఈడీ సోదాలు
- సీఆర్పీఎఫ్ భద్రత నడుమ బృందాల తనిఖీలు
- పొంగులేటి కుమారుడు హర్షపై ప్రశ్నల వర్షం
- ఆడిటర్‌ను పిలిపించి నిలదీసిన అధికారులు
- భారీ ఎత్తున నగదు, కీలక పత్రాల స్వాధీనం!
- పొంగులేటి నివాసంలో భారీగా నగదు?
- సోదాల నడుమే 3 కౌంటింగ్ మిషన్ల రాక
- ఒకదాని తర్వాత మరొకటి తెప్పించిన వైనం
- రాఘవ ఆఫీసు నుంచి కీలక ఫైళ్లు మాయం
- ముందే రహస్య ప్రాంతాలకు తరలింపు
- హార్డ్‌డిస్కులు, సీపీయూలు బయటకు..
- పొద్దున్నే ఇంటి నుంచి వెళ్లిన పొంగులేటి
- ఈడీ అధికారులు రాకముందే బయటకు
- మంత్రుల క్వార్టర్స్‌లోని ఆఫీసులో మకాం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి వర్గంలో కీలకంగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆయన కుటుంబానికి చెందిన రాఘవ ఇన్‌ఫ్రా, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌లతోపాటు పలు కంపెనీలపై అనేక ఆరోపణలున్న విషయం తెల్సిందే. ఇప్పటికే ఐటీ, కస్టమ్స్ వంటి దర్యాప్తు సంస్థలు గతంలో సోదాలు నిర్వహించగా తాజాగా ఈడీ రంగ ప్రవేశం చేయడం కలకలం రేపుతున్నది. ఈ దాడులకు సంబంధించి శుక్రవారం ఉదయాన్నే మంత్రి పొంగులేటికి సమాచారం అందిందని, ఆ మేరకు ఆయన తన కార్యాలయాలను అప్రమత్తం చేశారని ప్రచారం జరుగుతున్నది. శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం హిమాయత్‌సాగర్ బఫర్‌జోన్‌లోని తన ఇంట్లో ఉంటున్నారు. కొడుకు > 2వ పేజీలో

ఈడీ సోదాల కంటే ముందు..?



పొంగులేటి కుటుంబానికి చెందిన నివాసాలు, ఆఫీసులపై ఈడీ శుక్రవారం ఉదయం సోదాలు జరుపడానికి ముందు పెద్ద కసరత్తు జరిగినట్టు ఢిల్లీలోని ఉన్నత స్థాయి వర్గాలు పేర్కొన్నాయి. ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్‌ఐయూ)కి చెందిన రెండు బృందాలు పొంగులేటి కంపెనీలు, ఆస్తులపై వివరాలను సేకరించినట్టు సమాచారం.

స్టెప్ - 1

కలెక్షన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ — పొంగులేటి కంపెనీలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎఫ్‌ఐయూ సేకరించింది.

- క్యాష్ ట్రాన్సాక్షన్ రిపోర్ట్స్ (సీటీఆర్స్)
- క్రాస్ బోర్డర్ వైర్ ట్రాన్స్‌ఫర్ రిపోర్ట్స్ (సీబీడబ్ల్యూటీఆర్స్)
- రిపోర్ట్స్ ఆన్ పర్చేస్ ఆర్ సేల్ ఆఫ్ ఇమ్మూవబుల్ ప్రాపర్టీ (ఐపీఆర్స్)
- సస్పీషియస్ (అనుమానాస్పద) ట్రాన్సాక్షన్ రిపోర్ట్స్ (ఎస్టీఆర్స్)

స్టెప్ - 2

ఎనాలిసిస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ — పొంగులేటి కంపెనీలు మనీలాండరింగ్, ఇతరత్రా తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడ్డాయా? లేదా? అనే వివరాలను ఎఫ్‌ఐయూ పూర్తిగా విశ్లేషించింది.

స్టెప్ - 3

షేరింగ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ - పొంగులేటి కంపెనీలకు సంబంధించిన ఆర్థిక నేరాల ఆరోపణల చిట్టాను ఎఫ్‌ఐయూ ఈడీ అధికారులకు చేరవేసింది.

స్టెప్ - 4

ఎఫ్‌ఐయూ నుంచి కచ్చితమైన సమాచారం అందుకున్న ఈడీ అధికారులు శుక్రవారం ఉదయం పొంగులేటి కుటుంబం నివాసాలు, ఆఫీసుల్లో సోదాలు నిర్వహించారు.



హైడ్రా గోబ్యాక్.. సీఎం డౌన్ డౌన్!

నినాదాల హోరు.. కన్నీటితో నిండుతున్న మూసీ నది.. సర్వనాశనమైపోతవ్ రేవంత్ అని శాపనార్థాలు



- **రాధమ్మ వేదన**

ఈమె పేరు రాధ. ఉండేది హైదరాబాద్ చైతన్యపురిలోని కొత్తపేటలో. ఈమె ఇల్లు మూసీ నది పరివాహక ప్రాంతంలో ఉందంటూ అధికారులు శుక్రవారం ఎర్రగుర్తు పెట్టారు. ఇంటిని కూల్చేస్తామని నోటీసులిచ్చారు. ఈమెకు ముగ్గురు ఆడ పిల్లలు. 'నేను వాళ్ల పెళ్లి చేయాల్సి ఉంది. దయచేసి నన్ను, నా ఇంటిని వదిలేయండి. మీ కాళ్లు పట్టుకుంటా, దండం పెడతా' అని ఆమె కన్నీరుమున్నీరవుతున్నది. ఆమె గోడు వినేవారెవరు!



శుక్రవారం హైదరాబాద్ చైతన్యపురి కొత్తపేటలో హైడ్రా మార్కింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు దిగిన స్థానికులు

- హైదరాబాద్ మూసీ తీరంలో తీవ్ర ఉద్రిక్తత
- సర్వేలను అడ్డుకుని స్థానికుల ఆందోళనలు
- రోడ్లపై బైఠాయింపు.. భారీగా ట్రాఫిక్‌జామ్
- ఆపితే లోపలేస్తమంటూ పోలీసుల బెదిరింపు
- మీ అన్న తిరుపతిరెడ్డి ఇల్లు కూలగొట్టవా?
- ఇండ్ల జోలికివస్తే ఊరుకోమని హెచ్చరికలు
- నేడు, రేపు కూల్చివేతలకు రంగం సిద్ధం
- బుల్డోజర్ బృందాలకు అర్ధరాత్రి సందేశాలు?

'రేవంత్.. మా ఇల్లేమైనా నీ అయ్యజాగీరా.. అవ్వజాగీరా.. ఒక్కసారి పబ్లిక్‌లోకి వచ్చి చూడు.. చెప్పతీసుకుని కొడ్తం.. ఐదేండ్లు ఉండి పోయేటోనివి.. మాజోలికెందుకొస్తున్నవ్..!' ఇది సీఎం రేవంత్‌పై వెల్లువెత్తిన ప్రజాగ్రహం.

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): హైడ్రా గోబ్యాక్.. గోబ్యాక్..! సీఎం డౌన్ డౌన్..! సర్వనాశనమైపోతవ్ రేవంత్‌రెడ్డి.. ! ఇవి మూసీ పరివాహక ప్రాంతంలో హోరెత్తిన నినాదాలు. మూసీ పరివాహక కాలనీలలో ఉద్రిక్త పరిస్థితులు > 6వ పేజీలో

అర్ధరాత్రి బస్తీల్లో గస్తీ

- వెంటాడుతున్న కూల్చివేతల భయం
- రాత్రుళ్లు కాపలా ఉంటున్న స్థానికులు
- శత్రుదేశంపై దాడుల్లా సీఎం కక్ష: బాధితులు

> 7



మీకు అంత దూకుడెందుకు?

రంగనాథ్.. కోర్టుకు రండి

- అంత హడావుడిగా కూల్చేయడం ఏమిటి?
- శనివారం నోటీసిచ్చి తెల్లారే కూలుస్తరా?
- బాధితులకు మీరు గడువు ఎందుకివ్వరు?
- హైకోర్టు ఉత్తర్వులున్నా లెక్కచేయరా?
- అసలు హైడ్రాకు చట్టబద్ధత ఏముంది?
- అది కేవలం ఒక ప్రభుత్వ ఏజెన్సీనే కదా?
- మా ప్రశ్నలకు స్వయంగా వివరణివ్వండి
- హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు
- తదుపరి విచారణ 30వ తేదీకి వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): హైడ్రా తీరుపై హైకోర్టు మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమ నిర్మాణాల పేరుతో హడావుడిగా ఎందుకు కూల్చివేత చర్యలు చేపడుతున్నారని, కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించింది. 'ఈ రోజు > 7వ పేజీలో

- 'హైడ్రా' చేసిన హత్య



బుల్డోజర్ హెచ్చరిక బుచ్చమ్మ లేదిక!

- ఇల్లు ఎఫ్టీఎల్‌లో ఉన్నదని హైడ్రా వార్నింగ్
- ఆ ఇల్లు ముగ్గురు కూతుళ్లకు ఇచ్చిన కట్నం
- దాన్ని కూల్చేస్తారనే భయంతో ఉరేసుకున్న మహిళ
- కూకట్‌పల్లి నల్ల చెరువు పరిధిలో పెను విషాదం
- రేవంత్ వల్లే మా అమ్మ ప్రాణం పోయింది: బిడ్డలు

మూసాపేట, సెప్టెంబర్27: హైదరాబాద్‌లో దూకుడుతో ఉన్న హైడ్రా ఓ మహిళ నిండు ప్రాణాన్ని బలితీసుకున్నది. తన కూతుళ్లకు వరకట్నంగా ఇచ్చిన ఇల్లు చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నదన్న అధికారుల హెచ్చరికలు ఆమెను భయాందోళనకు గురిచేశాయి. తమ కూతుళ్ల కుటుంబాలకు ఆధారం పోతుందన్న బెంగతో ఉరేసుకొని ప్రాణమే తీసుకున్నది. హైడ్రా చర్యలతో కట్టుబట్టలతో బజారున పడుతూ దుఃఖసాగరంలో ఎన్నో బాధిత కుటుంబాలు మునిగిపోతుండగా, ఏకంగా ఓ మహిళ > 6వ పేజీలో

ముడా స్కామ్‌లో ఏ-1గా సీఎం సిద్ధరామయ్య

- ఏ2గా ఆయన భార్య పార్వతి
- లోకాయుక్త పోలీసుల ఎఫ్‌ఐఆర్

> 11

మరో 2 వేల కోట్ల అప్పుకు బాండ్లు

- అక్టోబర్ నెల అప్పుతో ప్రారంభం!
- ఈ నెలలో ఇప్పటికే రూ.4,500 కోట్లు
- తొమ్మిది నెలల్లో రూ.71,495 కోట్ల అప్పు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): అధికారానికి వచ్చిన నాటి నుంచి అప్పులతోనే పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా మరో రూ.2,000 కోట్ల రుణం తీసుకోవడానికి సిద్ధమవుతున్నది. వచ్చే నెల ఒకటో తేదీన మరో రూ.2,000 కోట్ల అప్పు సమీకరించుకొనేందుకు కసరత్తు ప్రారంభించింది. రూ.1,500 కోట్ల విలువైన బాండ్‌ను 15 ఏండ్ల కాలానికి, రూ.500 కోట్ల విలువైన బాండ్‌ను 18 ఏండ్ల కాలానికి రాష్ట్ర ఆర్థికశాఖ రిజర్వు బ్యాంకుకు జారీచేసింది. ఈ బాండ్‌ను అక్టోబర్ ఒకటిన ఆర్బీఐ వేలం వేయనున్నది. అనంతరం ఆ మొత్తం రాష్ట్ర ఖజానాకు > 8వ పేజీలో



ఆటోడ్రైవర్ ఆత్మహత్య

- గిరాకీ లేక, ఈఎంఐ కట్టలేక ప్రాణం బలి
- మేడ్చల్ జిల్లా మల్లాపూర్‌లో ఘటన


> 8

గురుకుల విద్యార్థి కన్నుమూత

ములుగు జిల్లాలో దారుణం > 10

డిప్యూటీ సీఎం నివాసంలో దొంగతనం

హైదరాబాద్ (ఖైరతాబాద్), సెప్టెంబర్ 27: ఉప ముఖ్యమంత్రి భట్టి ఇంట్లో దొంగలు పడ్డారు. బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. ఇంట్లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తే ఈ దొంగతనానికి పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలింది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14 బీఎన్‌రెడ్డి కాలనీలో భట్టి విక్రమార్కకు సొంత ఇల్లు ఉన్నది. అయితే ప్రభుత్వం కేటాయించిన ప్రజాభవన్‌లో ప్రస్తుతం భట్టి కుటుంబం నివాసముంటున్నది. ఈ క్రమంలో బంజారాహిల్స్‌లోని ఇంటి వద్ద బీహార్‌కు చెందిన రోషన్‌కుమార్ మండల్ అనే వ్యక్తిని వాచ్‌మన్‌గా ఉంచారు. ఇదే అదునుగా భావించిన రోషన్‌కుమార్ తనకు తెలిసిన ఉదయ్‌కుమార్‌తో కలిసి > 8వ పేజీలో



రైతుల రుణమాఫీ కోసం సిద్దిపేట జిల్లా నంగనూరులో జరిగిన భారీ ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్

ఎనుముల రేవంత్ కాదు.. ఎగవేతల రేవంత్

- దసరాలోగా రూ.2 లక్షల రుణమాఫీ చేయకపోతే సచివాలయం ముట్టడిస్తం.. అసెంబ్లీనీ స్తంభింపజేస్తం
- రైతులకిచ్చిన ఒక్క హామీనీ కాంగ్రెస్ సర్కార్ నెరవేర్చలె
- కాళేశ్వరం కూలిందా..? మల్లన్నసాగర్‌కు వచ్చి చూడు
- రేవంత్‌కు కూల్చుడు తప్ప కట్టుడు తెల్వదు: హరీశ్

హరీశ్‌రావు ఏడ నిద్రపోతున్నడు.. రాజీనామా ఎప్పుడు చేస్తవ్.. అని రేవంత్‌రెడ్డి అడుగుతున్నడు. నీ గుండెల్లో నిద్రపోతున్న రేవంత్‌రెడ్డీ.. రైతులకు రుణమాఫీ జరిగేదాకా నిన్ను విడిచిపెట్టను.

-హరీశ్‌రావు

> 5

క్షుద్రపూజలకు విద్యార్థి బలి!



- పాఠశాల అభివృద్ధి చెందాలని విద్యార్థిని బలిచ్చిన యాజమాన్యం
- యూపీలోని హాథ్రస్‌లో దారుణం
- యజమాని సహా ఐదుగురి అరెస్ట్

ఆగ్రా, సెప్టెంబర్ 27: ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్‌లో దారుణ ఘటన చోటుచేసుకున్నది. మూఢనమ్మకాలతో ఒక స్కూల్ యజమాని తన పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని క్షుద్రపూజలకు బలిచ్చాడు. దీంతో స్కూల్ యజమాని, డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్, ఇద్దరు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డీఎల్ పబ్లిక్ స్కూల్ యజమాని అయిన జషోదన్ సింగ్‌కు క్షుద్ర పూజలు, మూఢ నమ్మకాలపై అపార నమ్మకం. స్కూల్, తన కుటుంబం అభివృద్ధి చెందాలంటే ఎవరినైనా చిన్నారిని బలి ఇవ్వమని కుమారుడు, స్కూల్ డైరెక్టర్ అయిన దినేశ్ బాఘేల్‌కు చెప్పాడు. దీంతో అదే పాఠశాలలో రెండో తరగతి చదువున్న 11 ఏండ్ల కృతార్థ్‌ను సెప్టెంబర్ 23న ఉపాధ్యాయుడు రాంప్రకాశ్ సోలంకి, దినేశ్ భాఘేల్, జషోదన్ సింగ్ కలిసి స్కూల్ హాస్టల్ నుంచి అపహరించారు. తర్వాత విద్యార్థిని ఒక నిర్జన ప్రదేశంలోకి తీసుకుపోయారు. తర్వాత అక్కడ కొన్ని పూజలు చేశారు. ఇది చూసి ఆ బాలుడు ఏడవడం ప్రారంభించాడు. అనంతరం అతడి గొంతు నులిమి చంపారు. ఈ నరబలి జరుగుతున్న సమయంలో ప్రిన్సిపాల్ లక్ష్మణ్ సింగ్, మరో టీచర్ వీర్‌పాల్ సింగ్‌లు కూడా అక్కడే ఉండి ఎవరూ రాకుండా కాపలా కాశారు. తర్వాత బాలుడి మృతదేహాన్ని కారులో తీసుకుని వెళ్తుండగా, తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిని అరెస్ట్ చేశారు. తమ స్కూల్, కుటుంబం మరింత ఐశ్వర్యాభివృద్ధి పొందడానికే బాలుడిని నరబలి ఇచ్చినట్టు నిందితులు పోలీసులకు తెలిపారు.

నీట మునిగిన చైనా అణు జలాంతర్గామి!

వాషింగ్టన్: వుహాన్ సమీపంలో చైనా ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న అణు జలాంతర్గామి నిర్మాణంలో ఉండగానే నీట మునిగిందని అమెరికా రక్షణ శాఖ అధికారి ఒకరు గురువారం వెల్లడించారు. ప్రపంచంలోనే అత్యంత భారీ నావికా దళాన్ని రూపొందిస్తున్న చైనాకు ఇది పెద్ద ఎదురుదెబ్బ అని భావిస్తున్నారు. ఈ ఏడాది మే, జూన్ నెలల మధ్యలో ఆ జలాంతర్గామి మునిగిపోయినట్టు తెలుస్తున్నది. ఉపగ్రహం తీసిన ఫొటోల్లో.. నీటి అడుగు నుంచి జలాంతర్గామిని పైకి లేపేందుకు అవసరమైన భారీ క్రేన్లు అక్కడ కనిపించాయని ఆ అధికారి పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి తమ వద్ద ఎటువంటి సమాచారం లేదని అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం తెలిపింది. ఆ జలాంతర్గామిలో అణు ఇంధనం నింపారా లేక ఘటన జరిగినప్పుడు అందులోని న్యూక్లియర్ రియాక్టర్ పనిచేస్తున్నదా అన్న విషయాలు వెల్లడి కాలేదు. అయితే జలాంతర్గామి మునిగిపోయినప్పుడు ఆ ప్రాంతంలో రేడియేషన్ ప్రభావమేమీ లేదని వెల్లడైంది.

రూ.100 కోట్లతో 'శివ సృష్టి'

- ఛత్రపతి శివాజీ స్మృతివనంగా ఏర్పాటు
- మహారాష్ట్ర సర్కారు నష్టనివారణ చర్యలు

ముంబై సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాజ్‌కోట్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిపోయిన ఘటనపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం నష్టనివారణ చర్యలకు పూనుకుంది. విగ్రహం కూలిన ప్రాంతంలోనే రూ.100 కోట్ల వ్యయంతో 'శివసృష్టి' పేరుతో శివాజీ స్మృతివనాన్ని నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో భారీ శివాజీ విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేయనున్నది. ఇందుకోసం ఇప్పటికే ప్రణాళిక సిద్ధం కాగా త్వరలో టెండర్లు పిలువనున్నారు. ఆవిష్కరించిన ఆరు నెలల్లోనే శివాజీ విగ్రహం కూలిపోవడం పట్ల ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే.

లెబనాన్ సరిహద్దుకు యుద్ధట్యాంకులు

- భారీగా మోహరించిన ఇజ్రాయెల్ సైన్యం
- బీరుట్‌లోని హెజ్బొల్లా హెడ్‌క్వార్టర్స్‌పై దాడి
- లెబనాన్‌లో వారం రోజుల్లో 700 మంది మృతి
- టెల్ అవీవ్ లక్ష్యంగా హౌతీల క్షిపణి దాడులు



లెబనాన్ సరిహద్దుల్లో మోహరించిన ఇజ్రాయెల్ యుద్ధట్యాంకులు

జెరూసలేం, సెప్టెంబర్ 27: ఇజ్రాయెల్ - లెబనాన్ మధ్య యుద్ధ పరిస్థితులు తీవ్రమవుతున్నాయి. లెబనాన్‌పై భూతల దాడులకు ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నది. ఈ మేరకు సరిహద్దుకు భారీగా యుద్ధట్యాంకులను తరలిస్తున్నది. హెజ్బొల్లా లక్ష్యంగా లెబనాన్‌లోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సైనిక బలగాలకు ఇజ్రాయెల్ ఇప్పటికే ఆదేశించింది. 'మనం హెజ్బొల్లాపై వాయు, సముద్ర మార్గాల్లో దాడులు చేస్తున్నాం, ఇక భూతల దాడులకు సైతం సిద్ధంగా ఉండండి' అంటూ సైనికులను ఉద్దేశించి ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి యోవ్ గల్లాంట్ పిలుపునిచ్చారు. సరిహద్దు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఇజ్రాయెల్ కోరుతున్నది.

హెజ్బొల్లా అధినేత లక్ష్యంగా దాడి

శుక్రవారం లెబనాన్‌లో ఇజ్రాయెల్ బాంబులు, క్షిపణులతో విరుచుకు పడింది. ఈ దాడుల్లో 25 మంది మరణించారు. బీరుట్‌లోని హెజ్బొల్లా హెడ్‌క్వార్టర్స్ లక్ష్యంగా దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్ మిలటరీ ప్రకటించింది. హెజ్బొల్లా నేత హస్సన్ నస్రుల్లాను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్‌లోని ప్రధాన టీవీ చానల్స్ ప్రకటించాయి. ఈ వారంలో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 700 మంది మరణించారని, గత మూడు రోజుల్లో 30 వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారని లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది. మరోవైపు హెజ్బొల్లా సైతం ఇజ్రాయెల్‌పై రాకెట్లతో దాడి చేస్తున్నది. లెబనాన్‌పై 21 రోజుల పాటు దాడులు విరమించుకోవాలని అమెరికా చేసిన ప్రతిపాదనను ఇజ్రాయెల్ తిరస్కరించింది. హెజ్బొల్లాపై విజయం సాధించేవరకు పోరాడతామని స్పష్టం చేసింది.

ఇజ్రాయెల్‌పైకి హౌతీల క్షిపణి

ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతుండగానే యెమెన్ కేంద్రంగా పని చేసే హౌతీలు ఇజ్రాయెల్‌పై దాడికి దిగారు. ఇజ్రాయెల్ దాడిలో గురువారం మరణించిన హెజ్బొల్లా నాయకుడు మహమ్మద్ స్రుర్ మృతికి ప్రతీకారంగా ఈ దాడి చేశామని హౌతీలు ప్రకటించారు. లెబనాన్, హెజ్బొల్లాకు మద్దతు ఇచ్చేందుకు వెనుకాడబోమని హౌతీల నాయకులు అబ్దుల్ మాలిక్ అల్-హౌతీ హెచ్చరించారు. కాగా, సిరియాలోని డమాస్కస్‌పైనా ఇజ్రాయెల్ దాడి చేసింది.

విజయం సాధించే వరకు పోరాటం: నెతన్యాహూ

లెబనాన్ సరిహద్దులో మా లక్ష్యాలు సాధించే వరకు హెజ్బొల్లాను నిర్వీర్యం చేసేందుకు పోరాటం చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రకటించారు. శుక్రవారం ఆయన ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించారు. 'తనకు ఉన్న ముప్పును తొలగించుకునేందుకు, తన పౌరులను వారి ఇండ్లకు సురక్షితంగా చేర్చేందుకు ఇజ్రాయెల్‌కు అన్ని హక్కులు ఉన్నాయి. అదే పని ఇప్పుడు చేస్తున్నది. ఎల్‌పాసో, శాన్‌డియాగోను ఉగ్రవాదులు ఘోస్ట్ టౌన్‌లుగా మారిస్తే అమెరికా సహిస్తుందా? కానీ, ఇజ్రాయెల్ ఏడాదిగా సహిస్తున్నది. హమాస్ లొంగిపోతేనే యుద్ధం ముగుస్తుంది. లేకపోతే విజయం సాధించే వరకు మా పోరాటం కొనసాగుతుంది' అని నెతన్యాహూ పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్‌లో తాము చేరుకోలేని ప్రాంతం అంటూ ఏదీ లేదని హెచ్చరించారు.

జపాన్ నూతన ప్రధానిగా ఇషిబా



టోక్యో, సెప్టెంబర్ 27: జపాన్ ప్రధానమంత్రి ఫుమియో కిషిదా వారసుడిగా ఆ దేశ రక్షణ శాఖ మాజీ మంత్రి షిగెరు ఇషిబా (67) ఎన్నికయ్యారు. శుక్రవారం అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష ఎన్నికలో విజయం సాధించిన ఇషిబా.. వచ్చేవారం జపాన్ కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్నారు. 2021లో కిషిదా ఎల్‌డీపీ అధ్యక్షునిగా ఎన్నికైన విషయం విదితమే. ఆయన మూడేండ్ల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుండటంతో ఎల్‌డీపీ అధ్యక్ష పదవికి తాజాగా ఎన్నిక నిర్వహించారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో కిషిదా ఈ ఎన్నికకు దూరంగా ఉన్నారు. ఎల్‌డీపీ అధ్యక్ష పదవికి ఇద్దరు మహిళలు సహా మొత్తం 9 మంది పోటీపడ్డారు. ప్రస్తుత ప్రధాని కిషిదా, ఆయన మంత్రి వర్గం వచ్చే నెల 1న రాజీనామా చేయనున్నది. అనంతరం ఇషిబా నేతృత్వంలో కొత్త మంత్రి వర్గం కొలువుదీరనున్నది.

ప్రవాస భారతీయుల మిత్రులకు ఉచిత వీసాలు

న్యూఢిల్లీ: విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల విదేశీ మిత్రులను భారత దేశ పర్యాటక రంగంవైపు ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం వినూత్న పథకాన్ని అమలు చేయబోతున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డ్‌హోల్డర్స్ తమ విదేశీ మిత్రులను వీసా కోసం నామినేట్ చేయవచ్చు. ఒక ఓసీఐ కార్డ్‌హోల్డర్ గరిష్ఠంగా ఐదుగురు మిత్రులను నామినేట్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఓ వెబ్‌సైట్ ద్వారా వీరికి ఉచితంగా ఈ-వీసాలను భారత ప్రభుత్వం జారీ చేస్తుంది. ప్రపంచ పర్యాటక దినోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ మాట్లాడుతూ, 'చలో ఇండియా' కార్యక్రమంలో భాగంగా లక్ష మంది విదేశీ పర్యాటకులకు ఉచితంగా వీసాలను ఇస్తామన్నారు.

పని ఒత్తిడికి మరో ఉద్యోగిని బలి

న్యూఢిల్లీ: పుణెలో పని ఒత్తిడికి 26 ఏండ్ల ఉద్యోగిని మరణించడంతో కార్పొరేట్ కంపెనీలలో విష పని సంస్కృతి గురించి విస్తృతంగా చర్చ జరుగుతున్న క్రమంలో అలాంటి ఘటనే థాయ్‌లాండ్‌లో చోటుచేసుకుంది. అనారోగ్యంతో ఉన్నప్పటికీ సిక్ లీవ్ ఇవ్వడానికి మేనేజర్ నిరాకరించడంతో కార్మికురాలొకరు విధి నిర్వహణలో కుప్పకూలి మరణించిన ఘటన థాయ్‌లాండ్‌లో జరిగింది. 30 ఏండ్ల మే అనే కార్మికురాలు థాయ్‌లాండ్‌లోని డెల్టా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో పనిచేస్తున్నది. పెద్దపేగుకు సంబంధించిన వ్యాధితో ఆమె సెప్టెంబర్ 5 నుంచి 9 వరకు సిక్ లీవ్ తీసుకుంది. పరిస్థితి మెరుగుకాకపోవడంతో మరి కొన్ని రోజుల సిక్ లీవ్ కోసం మేనేజర్‌కు విజ్ఞప్తి చేసింది. దానికి అతడు నిరాకరించడంతో ఆమె అలాగే అనారోగ్యంతో విధులకు హాజరైంది.

అగ్నివీరులకు బ్రహ్మోస్ ఏరోస్పేస్‌లో రిజర్వేషన్లు

న్యూఢిల్లీ: బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ మిస్సైల్స్‌ను తయారు చేసే బ్రహ్మోస్ ఏరోస్పేస్ కీలక నిర్ణయం తీసుకుంది. మాజీ అగ్నివీరులకు సాంకేతిక, పరిపాలన, భద్రతా విభాగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. సాంకేతిక, సాధారణ పరిపాలన విభాగాల్లో కనీసం 15 శాతం; పరిపాలన, భద్రత విభాగాల్లో భర్తీ చేయవలసిన ఉద్యోగాల్లో 50 శాతం అగ్నివీరుల కోసం కేటాయిస్తున్నట్లు ఈ కంపెనీ తెలిపింది.

డిప్యూటీ సీఎం కుమారుడి రీల్ షూటింగ్‌కు ఎస్కార్టుగా పోలీస్ వాహనాలు

న్యూఢిల్లీ: రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత ప్రేమ్ చంద్ బైర్వా కుమారుడు ఓపెన్ టాప్ జీపు నడుపుతూ రీల్ షూటింగ్ చేయడం, ఆయన వాహనానికి రెండు పోలీస్ వాహనాలు ఎస్కార్టుగా రావడం విమర్శలకు దారితీసింది. మైనర్ అయినప్పటికీ వాహనాన్ని నడుపుతూ రీల్ చేయడం, అతనికి పోలీసులు రెండు వాహనాల్లో ఎస్కార్టుగా రావడం అధికార దుర్వినియోగమేనని విపక్షాలు విమర్శించాయి. ఆ వాహనంలో ప్రేమ్‌చంద్ బైర్వా కుమారుడు ఆశు బైర్వా వాహనం నడుపుతుండగా, అతని పక్కన కాంగ్రెస్ నేత పుష్పేంద్ర భరద్వాజ్ కుమారుడు కూర్చుని ఉన్నాడు.

ముడా స్కామ్‌లో ఏ1గా సిద్ధరామయ్య

- ఏ2గా ఆయన భార్య పార్వతి
- లోకాయుక్త పోలీసుల ఎఫ్ఐఆర్
- సీబీఐ విచారణ కోసం హైకోర్టుకు ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ



బెంగళూరు, సెప్టెంబర్ 27: ముడా స్కామ్‌లో కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై కేసు నమోదైంది. ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆదేశాల మేరకు లోకాయుక్త పోలీసులు శుక్రవారం మైసూరులో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో సిద్ధరామయ్యను ఏ1గా, ఆయన భార్య బీఎం పార్వతిని ఏ2గా, బావమరిది మల్లికార్జున స్వామిని ఏ3గా, దేవరాజును ఏ4గా పేర్కొన్నది. దేవరాజు వద్ద నుంచే మల్లికార్జున స్వామి భూమిని కొని పార్వతికి బహుమతిగా ఇచ్చాడని చెప్తున్నారు. తక్కువ విలువ కలిగిన ఈ భూమిని అభివృద్ధి పనుల కోసం మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) సేకరించి, పరిహారంగా పార్వతికి ఖరీదైన 14 స్థలాలను కేటాయించిందనే ఆరోపణలు ఉన్నాయి. స్నేహమయి కృష్ణ అనే సమాచార హక్కు చట్టం కార్యకర్త సిద్ధరామయ్యపై ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సిద్ధరామయ్యపై విచారణ చేసేందుకు గవర్నర్ అనుమతించగా, ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు సైతం విచారణ జరగాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో ప్రజా ప్రతినిధుల కేసులు విచారించే ప్రత్యేక కోర్టు సిద్ధరామయ్యపై కేసు నమోదు చేయాలని లోకాయుక్త పోలీసులను బుధవారం ఆదేశించింది.

సీబీఐ విచారణ కోసం హైకోర్టుకు

సిద్ధరామయ్యపై సీబీఐ ద్వారా విచారణకు ఆదేశించాలని కోరుతూ ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రానున్నది. లోకాయుక్త విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉంటుందని అనుకోవడం లేదని, సీబీఐ ద్వారానే విచారణ జరిపించాలని కోర్టును కోరారు.

ప్రొఫెషనల్ దొంగగా కాంగ్రెస్ తీరు: బీజేపీ

సీబీఐకి సాధారణ సమ్మతిని ఉపసంహరించుకుంటూ సిద్ధరామయ్య మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుపట్టింది. ఇది ముడా స్కామ్‌లో సీబీఐ విచారణ నుంచి తప్పుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రయత్నమని బీజేపీ అధికార ప్రతినిధి షెహ్‌జాద్ పూనావాలా పేర్కొన్నారు. చట్టం నుంచి తప్పించుకునేందుకు ఒక కరుడుగట్టిన దొంగ ఎలాంటి ప్రయత్నం చేస్తాడో కాంగ్రెస్ కూడా అదే చేసిందని విమర్శించారు. ప్రొఫెషనల్ దొంగగా, రాజకీయ పార్టీగా కాంగ్రెస్ స్పందించిందని పేర్కొన్నారు.



ఉత్తమ శాస్త్రవేత్తల జాబితాలో ప్రొ.సుబ్బా రావు

ప్రకటించిన స్టాన్‌ఫర్డ్ వర్సిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 27: హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ప్రొఫెసర్ నందిపాటి సుబ్బారావుకు అరుదైన గుర్తింపు లభించింది. ప్రభావశీల శాస్త్రవేత్తలతో కూడిన 'ప్రపంచ ఉత్తమ 2 శాతం శాస్త్రవేత్తల జాబితా-2024'లో ఆయనకు చోటు దక్కింది. అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ జాబితాను విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ శాస్త్రవేత్తల్లో ఆయనకు 3,766వ ర్యాంకు దక్కింది. వరుసగా ఐదో ఏడాది ఆయన ఈ జాబితాలో నిలవడం విశేషం. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో భూవిజ్ఞాన శాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ నందిపాటి సుబ్బారావు పని చేశారు. ఆయన పరిశోధనలకు సంబంధించి ఇప్పటివరకు 130 పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నళ్లలో ప్రచురితమయ్యాయి. ఇంతకుముందు ఆయన నేషనల్ మినరల్ అవార్డుతో పాటు పలు అవార్డులను అందుకున్నారు.

కేరళలో మరో మంకీ పాక్స్ కేసు

తిరువనంతపురం: కేరళలో మరో ఎంపాక్స్ కేసు వెలుగులోకి వచ్చినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ శుక్రవారం తెలిపింది. ఈ వ్యాధి లక్షణాలు ఉన్న వారు చికిత్స చేయించుకోవాలని కోరింది. శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పరిస్థితిని సమీక్షించినట్లు వివరించింది. ఎంపాక్స్ వ్యాధిగ్రస్థునితో కలసిన వారి జాబితాను తయారు చేశామని, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామని మంత్రి వీణా జార్జ్ తెలిపారు. విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారు ఎంపాక్స్ లక్షణాలు కనిపిస్తే, ఆరోగ్య శాఖను సంప్రదించాలని కోరారు. అన్ని జిల్లాల్లోనూ ఐసొలేషన్ సదుపాయాలను కల్పించామన్నారు. దేశంలోనే మొదటి ఎంపాక్స్ కేసు కేరళలోనే ఇటీవల నమోదైంది.

'ఐవీఎఫ్' పిల్లలకు గుండె సమస్యలు

- మిగతా వారితో పోలిస్తే 36 శాతం అధికం
- కవలలుగా పుట్టిన వారిలో మరింత ఎక్కువ
- స్వీడన్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి



స్టాక్‌హోమ్: ఐవీఎఫ్ ద్వారా పుట్టిన పిల్లలకు పుట్టుకతో వచ్చే గుండె సమస్యల ముప్పు ఎక్కువగా ఉంటున్నదని స్వీడన్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. పరిశోధకులు డెన్మార్క్, ఫిన్లాండ్, నార్వే, స్వీడన్ దేశాలకు చెందిన 20 నుంచి 31 ఏండ్ల మధ్య వయస్కులైన 77 లక్షల మంది ఆరోగ్య రికార్డులు పరిశీలించి ఈ అంచనాకు వచ్చారు. సహజంగా గర్భం దాల్చి జన్మించిన పిల్లలను ఐవీఎఫ్, ఎంబ్రియో ఫ్రీజింగ్ వంటి ఇతర సహాయక పునరుత్పత్తి పద్ధతుల ద్వారా జన్మించిన పిల్లల డాటాను పరిశోధకులు పోల్చారు. సహజంగా జన్మించిన వారితో పోలిస్తే ఐవీఎఫ్ లాంటి సహాయక పునరుత్పత్తి పద్ధతుల ద్వారా జన్మించిన వారిలో 36 శాతం ఎక్కువ గుండె సమస్యలు ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. ఒకవేళ ఐవీఎఫ్ ద్వారా కవలలు పుడితే ఈ ముప్పు మరింత ఎక్కువ ఉంటుందని తేల్చారు. కాగా, తల్లిదండ్రుల్లో వంధ్యత్వానికి, శిశువుల్లో పుట్టుకతో వచ్చే గుండె సమస్యలకు మధ్య సంబంధం ఉన్న అంశం ఏదైనా ఉండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. పుట్టుకతో వచ్చే గుండె సమస్యలను వేగంగా గుర్తించి సర్జరీ చేయాల్సి ఉంటుందని, తమ అధ్యయనం ఈ మేరకు ఉపయోగపడుతుందని పరిశోధకులు తెలిపారు.

మూడింట ఒక వంతు మందిలో ఎన్ఏఎఫ్ఎల్‌డీ

న్యూఢిల్లీ: మన దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎన్ఏఎఫ్ఎల్‌డీ) బాధపడుతున్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర తెలిపారు. ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు వంటి జీవనశైలి వ్యాధులకు మూల కారణాల్లో ఎన్ఏఎఫ్ఎల్‌డీ ఒకటి అని చెప్పారు. ఎన్ఏఎఫ్ఎల్‌డీకి సంబంధించి సవరించిన ఆపరేషనల్ గైడ్‌లైన్స్‌ను కేంద్రం శుక్రవారం విడుదల చేసింది. ఎన్ఏఎఫ్ఎల్‌డీ నుంచి బయటపడాలంటే, క్రమం తప్పకుండా శారీరక కార్యకలాపాలను నిర్వహించాలి. వారానికి కనీసం 150 నిమిషాలపాటు ఏరోబిక్ ఎక్సర్‌సైజ్ చేయాలి. వారానికి రెండుసార్లు దారుఢ్య శిక్షణ పొందాలి. కదలకుండా కూర్చుని ఉండే సమయాన్ని తగ్గించుకోవాలి. ఆల్కహాల్‌ను పూర్తిగా నివారించాలి. ఎన్ఏఎఫ్ఎల్‌డీని సకాలంలో గుర్తించడం వల్ల ఈ వ్యాధి మరింత పెరగకుండా నిరోధించవచ్చునని ఈ మార్గదర్శకాలు తెలిపాయి.


ఇండియన్ యూత్@క్రాస్‌రోడ్స్


- నూటికి 24 శాతం మంది యువత రోడ్డుమీదే
- చదువు, ఉద్యోగం, శిక్షణ, ప్రిపరేషన్ ఇలా దేనిలోనూ లేనివారే వీరంతా.. ఐఎల్‌వో రిపోర్ట్

పనిచేయగల సామర్థ్యం ఉన్న యువశక్తిని వినియోగించుకోలేని ఏ దేశమూ పోటీ ప్రపంచంలో నెగ్గుకురాలేదంటారు నిపుణులు. ఈ విషయంలో భారత్ ఎంతో వెనుకంజలో ఉన్నది. దేశంలో 15-34 ఏండ్ల మధ్య వయసు ఉండి, పనిచేయగల సామర్థ్యమున్న యువతలో దాదాపు పాతిక శాతం మంది ఏ పనీలేకుండా రోడ్ల మీద తిరుగుతున్నట్టు ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) తాజా నివేదికలో వెల్లడించింది. ప్రపంచ సగటు 20.4 శాతంతో పోలిస్తే, భారత్‌లోనే పనిలేకుండా ఉన్న యువత ఎక్కువగా ఉన్నట్టు నివేదిక వివరించింది. తగిన ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమవ్వడమే దీనికి కారణంగా తెలిపింది. కాగా, దేశంలో ఉద్యోగ సంక్షోభం గతంలో ఎన్నడూ చూడని స్థాయికి చేరుకున్నది. కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగు.. ఉన్న కొలువులను కాపాడుకోవడానికి కూడా ఉద్యోగులు తీవ్రస్థాయిలో కసరత్తు చేయాల్సి వస్తుండటం ఆందోళనకరంగా మారింది.

-స్పెషల్ టాస్క్ బ్యూరో







తగిన పనిలేకుండా ఉండటం అంటే?

- ఉద్యోగం లేకపోవడం
- విద్యనభ్యసించకపోవడం
- ఏ శిక్షణా తీసుకోకపోవడం
- పోటీపరీక్షలకు సిద్ధంకాకపోవడం

మధుమేహానికి చెక్‌పెట్టే వరి వంగడం

- అభివృద్ధి చేసిన ఫిలిప్పీన్స్ శాస్త్రవేత్తలు
- త్వరలో భారత్‌లోనూ సాగు



మనీలా, సెప్టెంబర్ 27: మధుమేహం బారిన పడ్డవారికి, ప్రీడయాబెటిస్ దశలో ఉన్న వారికి అన్నం ఎక్కువగా తినొద్దని వైద్యులు ముందుగా సూచిస్తుంటారు. మూడుపూటలా అన్నం తినడం అలవాటైన దక్షిణ భారతీయులకు ఈ సూచన పాటించడం కష్టమైన పనే. అయితే, ఇక మీదట ఇలా అన్నం విషయంలో కడుపు కట్టేసుకోవాల్సిన అవసరం లేదని చెప్తున్నారు శాస్త్రవేత్తలు. షుగర్ భయం పక్కనపెట్టి కడుపు నిండా తెల్లన్నం తినొచ్చని చెప్తున్నారు. ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ(ఇర్రి)కు చెందిన శాస్త్రవేత్తలు ఇర్రి 147, ఇర్రి 125 అనే రెండు కొత్త వరి రకాలను అభివృద్ధి చేశారు. ఇప్పుడు మనం తినే తెల్ల బియ్యం లానే ఈ బియ్యం కూడా కనిపిస్తాయని, కొంచెం చిన్న సైజులో ఉంటాయని శాస్త్రవేత్తలు తెలిపారు. మిగతా రకాల బియ్యంతో పోలిస్తే ఈ రెండు వరి రకాలలో గ్లైసెమిక్ ఇండెక్స్ స్థాయిలు తక్కువ ఉంటాయని, ప్రొటీన్ కంటెంట్ ఎక్కువ ఉంటుందని చెప్తున్నారు.

మధుమేహులకు ఉపయోగమేంటి?

ఏదైనా ఆహారం తిన్న తర్వాత మన రక్తంలో షుగర్ లెవెల్స్ పెరిగే స్థాయిని బట్టి గ్లైసెమిక్ ఇండెక్స్(జీఐ)ను నిర్ణయిస్తారు. డయాబెటిస్ ఉన్న వారు, ప్రీడయాబెటిస్ దశలో ఉన్న వారు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ ఉన్న ఆహారం తినడం మంచిది. తద్వారా మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చు. సాధారణంగా ఇప్పుడు మనం తినే అన్నం గ్లైసెమిక్ ఇండెక్స్ స్థాయి 70 నుంచి 92 వరకు ఉంటుందని, ఇర్రి 147 రకం బియ్యం గ్లైసెమిక్ ఇండెక్స్ 55 అని, ఇర్రి 125 రకం గ్లైసెమిక్ ఇండెక్స్ 51.1 అని శాస్త్రవేత్తలు తెలిపారు. ఏదైనా ఆహారంలో జీఐ 45 కంటే తక్కువగా ఉంటే దానికి 'అతి తక్కువ' అని, 46-55 మధ్య ఉంటే 'తక్కువ' అని, 56-69 మధ్య ఉంటే 'మధ్యస్థ' అని, 70 కంటే ఎక్కువ ఉంటే 'ఎక్కువ' అని భావిస్తున్నారు. ఈ లెక్కన ఈ రెండు కొత్త వరి రకాల గ్లైసెమిక్ ఇండెక్స్ స్థాయిలు 'తక్కువ'గా ఉన్నట్టు లెక్క.

త్వరలోనే పండించేందుకు ప్రయత్నాలు

ఈ రెండు కొత్త వరి రకాలను వచ్చే ఏడాది భారత్‌లో పండించేందుకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ నేసె శ్రీనివాసులు తెలిపారు. భారత్ సహా ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఈ వరి రకాలను అందుబాటులోకి తేనున్నారు. ప్రపంచంలో అన్నం తినేవారు, మధుమేహ బాధితులు ఎక్కువగా ఆసియాలోనే ఉన్నందున ఈ వరి రకాలు మొదట ఆసియాలోనే పండించనున్నారు. కాగా, ప్రస్తుతం ప్రపంచంలో 53.7 కోట్ల మంది మధుమేహులు ఉన్నారు. 2045 నాటికి 78.3 కోట్ల మంది మధుమేహం బారిన పడనున్నారనే అంచనాలు ఉన్నాయి. ప్రపంచంలోని మొత్తం మధుమేహుల్లో ఏషియన్లే 60 శాతం మంది ఉంటారు. ఈ నేపథ్యంలో ఈ కొత్త వరి రకాలు ఏషియన్ల ఆహారంలో కీలకంగా మారబోతున్నాయని ఇర్రి శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.



బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10 లోని పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ ఆఫీస్‌లో కీలక వ్యక్తి



బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10లో కారును రహస్య ప్రదేశంలోకి తీసుకెళ్తున్న పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కార్యాలయ సిబ్బంది



కారు వద్దకు ఫైళ్లను తీసుకెళ్తున్న రాఘవ ఆఫీసు సిబ్బంది



కారు వద్దకు డబ్బు సంచిని తీసుకెళ్తున్న కార్యాలయానికి చెందిన మరో సిబ్బంది



నోట్ల కట్టలున్న ఒక సంచి, బ్యాగును తీసుకెళ్తున్న మరో వ్యక్తి



కార్యాలయంలోని సీపీయూను తీసుకెళ్తున్న యువకుడు



రహస్య ప్రదేశం నుంచి దస్త్రాలు, నోట్ల కట్టలతో వెనక్కి వెళ్తున్న కారు

..పొంగులేటిపై ఈడీ రెయిడ్

మొదటిపేజీ తరువాయి...

హర్షారెడ్డి, కోడలు కూడా అక్కడే ఉంటున్నారని చెప్తున్నారు. జూబ్లీహిల్స్‌లో పొంగులేటికి మరో ఇల్లు ఉన్నది. అక్కడ ఆయన కూతురు ఉంటున్నారు. ప్రస్తుతం మినిస్టర్ క్వార్టర్స్‌లోనూ ఆయనకు అధికారిక నివాసం ఉండగా, దానిని తన సంస్థల కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. ఇక బంజారాహిల్స్‌లో రాఘవ ఇన్‌ఫ్రాకు సంబంధించిన కార్యాలయాలు ఉన్నాయి. జూబ్లీహిల్స్ నివాసం కేంద్రంగా పొంగులేటి కార్యక్షేత్రాలపై ఈడీ దాడులు జరిగాయి. ఈడీ బృందాల తనిఖీల నేపథ్యంలో సీఆర్పీఎఫ్ బలగాలు ఆయన నివాసాలు, ఆఫీసులను ఆధీనంలోకి తీసుకున్నాయి.

ఉదయం నుంచీ మినిస్టర్ క్వార్టర్స్‌లోనే

దాడులకు కొద్దిసేపు ముందే సమాచారం అందుకున్న పొంగులేటి హడావిడిగా మినిస్టర్ క్వార్టర్స్‌లోని తన నివాసానికి వెళ్లిపోయారు. ఆయన రోజంతా అక్కడే ఉన్నారు. ఈడీ దాడులకు సంబంధించి ఏం జరుగుతున్నదో ఎప్పటికప్పుడు తన వ్యాపార సంస్థల ముఖ్యుల నుంచి వివరాలు తెలుసుకుంటూ ఉన్నారని తెలిసింది. మరోవైపు ఈడీ సోదాల నేపథ్యంలో మంత్రి పొంగులేటి శుక్రవారం బయట ఎక్కడా ప్రభుత్వ కార్యక్రమాల్లో కనిపించలేదు. అధికారులతో సమీక్షతోపాటు పలు కార్యక్రమాలను ఆయన రద్దు చేసుకున్నట్టు తెలిసింది. మరోవైపు పొంగులేటి వియ్యంకుడు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి దాడులు జరుగుతున్న సమయంలో జూబ్లీహిల్స్ నివాసానికి తరలివచ్చారు. అధికారుల అనుమతితో ఆయన ఫోన్లు తీసుకుని భద్రతాసిబ్బంది లోనికి అనుమతించారు. సుమారు గంటపాటు లోపల ఉన్న ఆయన తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు.

హర్షారెడ్డిని విచారించిన అధికారులు

ఈడీ దాడులు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగాయి. సుమారు 16 గంటలపాటు కొనసాగిన ఈ సోదాలపై ఉదయం నుంచీ ఉత్కంఠ నెలకొన్నది. జూబ్లీహిల్స్ నివాసంలో మంత్రి తనయుడు హర్షారెడ్డిని ఈడీ అధికారులు విచారించారు. సోదాలు జరుగుతున్నంతసేపు ఆయనే అక్కడే ఉన్నారు. మధ్యాహ్నం వేళ రాఘవ గ్రూప్‌కు సంబంధించిన ఆడిటర్‌ను పిలిపించిన ఈడీ అధికారులు.. ఆయనతోకలిపి హర్షారెడ్డిని విచారించారు. ఈ సందర్భంగా పలు కీలక లావాదేవీలు, అనుమానాస్పద కార్యకలాపాలు, అక్రమాస్తులపై ఈడీ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. పొంగులేటి వివాదాలపైనా వారు ఆరా తీసినట్టు చర్చ జరుగుతున్నది.

పొంగులేటి వివాదాలపైనా ఆరా

మంత్రి పొంగులేటి నివాసాలు, ఆఫీసుల్లో ఈడీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించిన నేపథ్యంలో ఏ కేసు కేంద్రంగా వారు ప్రధానంగా విచారిస్తున్నారనే దానిపై రకరకాల వార్తలు వెలువడుతున్నాయి. ఎఫ్‌ఐయూ జోక్యం చేసుకోవడంతో ఈ కేసు వందల కోట్ల విలువైన లావాదేవీలతో ముడిపడి ఉండవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి కాలంలో పొంగులేటి ఆర్థిక వ్యవహారాలను కమ్ముకున్న పలు అభియోగాలను వారు ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు.



ఈడీ సోదాల సందర్భంగా పొంగులేటి నివాసం వద్ద సీఆర్పీఎఫ్ జవాన్

ఫెమా ఉల్లంఘన కేసులు కూడా

పొంగులేటి కంపెనీల చుట్టూ ముసురుకున్న ఎగ్జిమ్ బ్యాంక్ గ్యారెంటీలు, లగ్జరీ వాచీలు, బోగస్ కంపెనీలు-టీడీఎస్ కేసులు మనీలాండరింగ్ చట్టంతో పాటు ఫెమా (ఫారెన్ ఎక్స్చేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్) ఉల్లంఘనల కిందకు వస్తాయని నిపుణులు చెప్తున్నారు. విదేశీ మారకం, విదేశీ బ్యాంకులు, ఎగుమతులు-దిగుమతులు, గూడ్స్ అండ్ సర్వీసులకు సంబంధించిన అక్రమాలు ఫెమా చట్టం కిందకే వస్తాయని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.

తెరపైకి యూరో బ్యాంక్ గ్యారెంటీలు!

పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో రూ.4,495 కోట్ల కాంట్రాక్ట్ పనులు దక్కించుకున్నది. ఈ క్రమంలో వెస్టిండీస్‌లోని ఎగ్జిమ్‌బ్యాంకు నుంచి ఏపీ ప్రభుత్వానికి రూ. 80 కోట్ల విలువైన గ్యారెంటీలు సమర్పించింది. అయితే, ఆ గ్యారెంటీలపై ఏపీ సర్కారు అనుమానాలు వ్యక్తం చేయడం, దేశీయ బ్యాంకింగ్ సంస్థలను కాదని ఎక్కడో కరేబియన్ దీవుల్లోని ఎగ్జిమ్‌బ్యాంకు నుంచి పొంగులేటి గ్యారెంటీలు సమర్పించడం అనుమానాలకు తావిచ్చింది.

కొడుకు మెడకు లగ్జరీ వాచీల కేసు

హాంకాంగ్ నుంచి సింగపూర్ మీదుగా చెన్నైకి అక్రమంగా తరలిన పాటెక్ ఫిలిప్ 5740, రెండోది బ్రెగ్యుట్ 2759 వంటి ఖరీదైన చేతిగడియారాల కేసులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కొడుకు హర్షారెడ్డికి చెన్నై కస్టమ్స్ అధికారులు ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చారు. మద్రాస్ హైకోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉన్నది. పట్టుబడిన వాచీల విలువ రూ. 8 కోట్ల వరకు ఉన్నప్పటికీ, అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషించిన మధ్యవర్తి నవీన్ కుమార్ రూ. 100 కోట్లకు పైగా స్మగ్లింగ్ చేసినట్టు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. క్రిప్టో, హవాలా ద్వారా పెద్దయెత్తున అక్రమ లావాదేవీలు జరిగినట్టు పేర్కొన్నారు.

650 కోట్ల టీడీఎస్ ఎగవేత ఆరోపణలు

రూ.650 కోట్ల విలువైన టీడీఎస్‌ను ఎగ్గొట్టేందుకు రాఘవ గ్రూప్ ఆఫ్ కంపెనీ నిర్వాహకులు మూడు బోగస్ కంపెనీలను సృష్టించారని వార్తలు వచ్చాయి. కాగితాలకు మాత్రమే ఈ కంపెనీలు పరిమితమయ్యాయా? నిజంగానే ఉన్నాయా? ఒకవేళ ఉంటే ట్యాక్స్ ఎలా ఎగ్గొట్టాయి? అనే వివరాలకు సంబంధించి డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు ఆరునెలల కిందటే రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్)ను నమోదు చేశారు. ఇప్పుడు ఆ విషయమై సోదాలు జరిగినట్టు వార్తలు వస్తున్నాయి.

తెరపైకి అక్రమాస్తులు!

మంత్రి పొంగులేటి కుమారుడు పొంగులేటి హర్షారెడ్డికి రూ.1,300 కోట్ల పైచిలుకు ఆస్తులున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఈ మేరకు ఆస్తులు ఉన్నట్లైతే, వాటికి సంబంధించిన ఆదాయపు పన్ను చెల్లింపులు సరిగ్గా జరుగుతున్నాయా? ఆస్తులకు సంబంధించిన పత్రాలు అన్నీ సరిగ్గా ఉన్నాయా? అనే కోణంలో ఈ సోదాలు జరుగొచ్చని అంచనా వేస్తున్నారు.

రెండు కంపెనీల బంధం

శుక్రవారం నాటి సోదాలకు కేంద్ర బిందువుగా మారిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ అనే కంపెనీతో కోట్లల్లో లావాదేవీలు జరిగినట్టు ఈడీ అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఈ రెండు కంపెనీల టర్నోవర్, డైరెక్టర్లు ఇతరత్రా వివరాలపైనా ఈడీ దృష్టిసారించినట్టు చెప్తున్నారు.

ఎగ్జిమ్ బ్యాంక్‌పై ఏపీ నోటీసులు

పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి అప్పగించిన 4,495 కోట్ల కాంట్రాక్టులో అవకతవకలు జరిగాయంటూ ఏపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈమేరకు కంపెనీకి నోటీసులు ఇచ్చింది. ఇక, వెస్టిండీస్‌కు చెందిన వివాదాస్పద ఎగ్జిమ్ బ్యాంకు నుంచి రూ. 80 కోట్ల బ్యాంకు గ్యారెంటీలను రాఘవ కంపెనీ సమర్పించడాన్ని కూడా ఏపీ సర్కారు తప్పుబట్టింది. భారత్‌కు చెందిన మరేఇతర బ్యాంకు నుంచి గ్యారెంటీలు సమర్పించాల్సిందిగా నోటీసులు ఇచ్చింది.

వివాదాల ఎగ్జిమ్ బ్యాంక్

వెస్టిండీస్‌లోని సెయింట్ లూసియాలో కేంద్రంగా ఉన్న యూరో ఎగ్జిమ్ బ్యాంక్‌పై అనేక ఆరోపణలు న్నాయి. మధ్యప్రదేశ్‌లో ఓ సంస్థ డిఫెన్స్ పనుల కాంట్రాక్టును సాధించింది. పనులు చేపట్టే ముందు ఈ బ్యాంకు నుంచే గ్యారెంటీలు సమర్పించింది. వాటిని ఆధారంగా చేసుకొని అధికారులు పనులు అప్పగించారు. చివరకు ఆ సంస్థ బిచాణా ఎత్తేసింది. పనులను పూర్తిచేయలేదు. దీంతో అధికారులు నష్టపరిహారం కోసం బ్యాంక్ గ్యారెంటీలను స్వాధీనం చేసుకుందామనుకుంటే వాళ్లు సమర్పించిన గ్యారెంటీలు చెల్లలేదు. అంటే ఆ బ్యాంక్ బోగస్ అని అర్థమవుతున్నది. కాగా, వివిధ సంస్థలకు వేల కోట్ల గ్యారెంటీలను ఇస్తున్న ఎగ్జిమ్ బ్యాంక్ వాస్తవ విలువ రూ. 8 కోట్లు మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా 650కి పైగా శాఖలున్నట్టు ఈ బ్యాంకు చెప్పుకున్నప్పటికీ, అదంతా అబద్ధం. మన దేశంలో ఒక్క శాఖ కూడా లేని ఇలాంటి బ్యాంకు.. పొంగులేటి కంపెనీకి గ్యారెంటీలు సమర్పించడం ఇప్పుడు వివాదంగా మారింది.

పొంగులేటి నివాసంలో భారీగా నగదు?

- లెక్కించడానికి 3 యంత్రాలు
- పదుల సంఖ్యలో అధికారులు
- గంటల తరబడి నోట్ల లెక్కింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో సోదాలు జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులకు భారీగా నగదు పట్టుబడినట్టు తెలుస్తున్నది. ఉదయం 8 గంటలకు పొంగులేటి నివాసానికి ఈడీ అధికారులు చేరుకున్నారు. కాసేపు సోదాలు నిర్వహించిన తర్వాత ఈడీ సిబ్బంది ఒక నోట్ల లెక్కింపు యంత్రాన్ని తెప్పించారు. ఆ తర్వాత కొద్ది సేపటికి మరో యంత్రాన్ని తెప్పించారు. ఈ రెండు యంత్రాలతో కాసేపు నోట్ల లెక్కింపు జరిగిన తర్వాత ఈడీ సిబ్బంది మరో నోట్ల లెక్కింపు యంత్రాన్ని పొంగులేటి ఇంట్లోకి తీసుకెళ్లారు. పొంగులేటి నివాసం బయట ఉన్న విలేకరులు, స్థానికుల ముందే మూడు యంత్రాలు ఇంటి లోపలికి పట్టుకెళ్లారు. పదుల సంఖ్యలో సిబ్బంది, గంటల తరబడి, మూడు యంత్రాలపై నోట్లను లెక్కించాల్సి వచ్చిందంటే పొంగులేటి నివాసంలో ఈడీ అధికారులకు భారీగానే నోట్ల కట్టలు దొరికాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోదాల్లో కోట్లాది రూపాయలు లభించిన సందర్భాల్లోనే ఈడీ అధికారులు ఒకటికి మించి యంత్రాలను వినియోగించాల్సి వస్తుంది. పొంగులేటి నివాసం వద్ద కూడా ఇలాంటి పరిస్థితులే కనిపించాయి. కాగా, ఈడీకి పట్టుబడ్డ నగదులో కొంత విదేశీ కరెన్సీ కూడా ఉందనే ప్రచారం కూడా జరుగుతున్నది. అయితే, ఈ విషయంపై స్పష్టత రావాల్సి ఉన్నది. ఎంత నగదు పట్టుబడిందనే విషయాన్ని ఈడీ అధికారిక ప్రకటన ద్వారా ప్రకటించనుంది.

కీలక ఫైళ్లు మాయం

- ఈడీ సోదాలకు ముందే రహస్య ప్రాంతాలకు తరలింపు
- కంప్యూటర్ హార్డ్‌డిస్కులు, సీపీయూలు సైతం బయటకు..

హైదరాబాద్, సెప్టెంబర్ 27: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోదాలు జరపనున్న విషయంలోపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ముందే సమాచారం అందిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈడీ అధికారులు వస్తున్నారని తెలిసి ముందే జాగ్రత్తపడ్డారని తెలుస్తున్నది. శుక్రవారం ఉదయం ఈడీ అధికారులు పొంగులేటి నివాసం, కార్యాలయాలకు చేరకముందే కీలక డాక్యుమెంట్లను పొంగులేటి కార్యాలయాల నుంచి కీలక ఫైళ్లు, కంప్యూటర్ సీపీయూలు, హార్డ్ డిస్కులు మాయం చేశారని తెలుస్తున్నది. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లోని రాఘవ టవర్స్‌లో పొంగులేటికి చెందిన నిర్మాణ సంస్థల కార్యాలయాలు ఉన్నాయి. ఆయన వ్యాపార సామ్రాజ్యం మొత్తం ఈ భవనం నుంచే పని చేస్తుంది. అయితే, శుక్రవారం ఈడీ అధికారులు రంగంలోకి దిగే ముందే కొందరు వ్యక్తులు రాఘవ టవర్స్ వద్దకు చేరుకున్నారని తెలుస్తున్నది.

ముందు సెల్లార్‌కు.. అక్కడి నుంచి సేఫ్ ప్లేస్‌కు..

ఈ భవనానికి కొంత దూరంలో కార్లను నిలిపి, రాఘవ సంస్థ కార్యాలయంలోకి చేరుకున్నట్టు సమాచారం. ముందుగా పదుల సంఖ్యలో సంచులను భవనం సెల్లార్‌లోకి తీసుకొచ్చారని, అక్కడి నుంచి క్షణాల్లో వాటిని కార్లలో నింపి 'సేఫ్' ప్లేస్‌లకు తరలించినట్టు తెలుస్తున్నది. నిమిషాల వ్యవధిలో పదుల సంఖ్యలో సంచులు కార్యాలయం నుంచి బయటపడ్డాయని సమాచారం. వీటిల్లో పొంగులేటి వ్యాపారాలకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు, కంప్యూటర్ సీపీయూలు, హార్డ్ డిస్క్‌లు ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. భారీగా నగదు సైతం ఉండే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటిని తరలించింది మంత్రి అనుచరులు, ఆయన వ్యాపార సంస్థల్లో పని చేసే సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది అని తెలుస్తున్నది. అయితే, పొంగులేటి సంస్థల్లో కీలక అధికారులు కొద్ది దూరంలో ఉండి ఆదేశాలు ఇస్తూ తరలింపు పనికి పురమాయించినట్టు అనుమానాలు ఉన్నాయి.

తెల్లవారుజామునే ఇంటి నుంచి వెళ్లిన పొంగులేటి

- ఈడీ అధికారులు చేరుకోకముందే బయటకు..
- ఫోన్‌లలో వ్యవహారాలు చక్కబెట్టారనే అనుమానాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 27: తన ఇండ్లు, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు దాడులు చేయబోతున్నారనే విషయం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ముందే తెలిసిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సహజంగా పది గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లే పొంగులేటి శుక్రవారం మాత్రం తెల్లవారుజామున ఆరున్నర గంటలకే బయటకు వెళ్లిపోయారని సమాచారం. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన ఒక చోట కూర్చొని ఫోన్‌ల మీద వ్యవహారాలు చక్కబెట్టారని తెలుస్తున్నది. తన కీలక అనుచరులు, తన సంస్థల్లో పని చేసే కీలక ఉద్యోగులతో ఆయన అనుక్షణం టచ్‌లో ఉన్నారనే ప్రచారం జరుగుతున్నది. మరికాసేపట్లో ఈడీ అధికారులు రంగంలోకి దిగుతారనగా ఆయన అన్ని ముందు జాగ్రత్తలూ తీసుకున్నారని తెలుస్తున్నది. ఈడీ సోదాల సమాచారాన్ని సైతం ఆయన ఎప్పటికప్పుడు తెలుసుకున్నారని సమాచారం. గతంలో ఈడీ, ఐటీ అధికారులు సోదాలు నిర్వహించిన సమయంలోనూ ఆయన ఇదే రకంగా జాగ్రత్త పడ్డట్టు చెప్తున్నారు.

ఏమిటీ వాచీల స్మగ్లింగ్ కేసు?

- రూ.కోట్ల విలువైన వాచీల అక్రమ రవాణా
- గతంలో పొంగులేటి హర్షకు చెన్నై కస్టమ్స్ నోటీసులు
- హర్షను అరెస్టు చేసి విచారించాలన్న అలందూరు కోర్టు



హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆయన తనయుడు హర్షారెడ్డి నివాసాలపై శుక్రవారం జరిగిన ఈడీ సోదాలు ఓ స్మగ్లింగ్ కేసుకు సంబంధించినవేనన్న వాదన ఒకటి వినిపిస్తున్నది. వాచీల కోసం కోట్ల రూపాయలను క్రిప్టో ద్వారా పంపి హర్షారెడ్డి మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ గుర్తించినట్టు తెలిసింది. చెన్నై కస్టమ్స్ అధికారుల నివేదిక ఆధారంగానే ఢిల్లీకి చెందిన 16 బృందాలతో శుక్రవారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారని అంటున్నారు. రూ.1.7 కోట్ల విలువైన వాచీల అక్రమ రవాణా కేసులో పొంగులేటి హర్షారెడ్డికి చెన్నై కస్టమ్స్ అధికారులు గత మార్చి 28న నోటీసులు ఇచ్చి.. ఏప్రిల్ 4న తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించారు. అయితే డెంగీ జ్వరం కారణంగా రాలేనని, ఏప్రిల్ 27న ప్రత్యక్షంగా హాజరౌతానని ఆయన లేఖ రాశారు. అప్పట్లో హర్షారెడ్డి తనకు వాచీల అక్రమ రవాణాతో సంబంధం లేదని జాతీయ మీడియాతో చెప్పారు. అయితే, ఇదే కేసులో చెన్నైకి చెందిన కస్టమ్స్ అధికారులు గత జూన్ మూడో వారంలో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

హాంకాంగ్ టు చెన్నై.. వయా సింగపూర్!

చెన్నై విమానాశ్రయంలో ఫిబ్రవరి 5న కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.1.7 కోట్ల విలువైన రెండు లగ్జరీ వాచ్‌లు పొంగులేటి హర్షారెడ్డి కోసమేనని దర్యాప్తులో తేలినట్టు తెలిసింది. హాంకాంగ్ నుంచి సింగపూర్ మీదుగా వచ్చిన మహమ్మద్ ఫహెర్దీన్ ముబీన్ అనే వ్యక్తి నుంచి కస్టమ్స్ అధికారులు ఆ వాచీలను స్వాధీనం చేసుకున్నారు. ఆ వాచీలలో ఒకటి పాటెక్ ఫిలిప్స్ 5740, రెండోది బ్రెగ్యుట్ 2759గా గుర్తించారు. పాటెక్ ఫిలిప్స్ వాచీకు మన దేశంలో ఎక్కడా డీలర్లు లేకపోవడం.. బ్రెగ్యుట్ కంపెనీల వాచీలు ఇండియా మార్కెట్‌లో స్టాక్ లేకపోవడంతో వాటిని స్మగ్లింగ్ చేసినట్టు నిర్ధారణకు వచ్చారు. వాటి విలువ రూ.1.7 కోట్ల పైగా ఉంటుందని తేల్చారు. దీంతో ముబీన్‌ను అరెస్టు చేసి, కోర్టు అనుమతితో విచారణ చేయగా మధ్యవర్తి నవీన్‌కుమార్ పేరు బయటకు వచ్చింది.

క్రిప్టో చెల్లింపులు.. హవాలా లావాదేవీలు!

చెన్నై కస్టమ్స్ అధికారులు ఈ కేసును సీరియస్‌గా తీసుకొని దర్యాప్తు చేపట్టారు. మార్చి 12న ఈ కేసులో వారికి అలోకం నవీన్ కుమార్ ద్వారా మరిన్ని ఆధారాలు లభించినట్టు సమాచారం. నవీన్‌కుమార్ ద్వారానే ముబీన్ నుంచి హర్షారెడ్డి వాచీలను కొనుగోలు చేసినట్టు కస్టమ్స్ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ది ట్రెజరీ (యూఎస్‌డీటీ)కి చెందిన టెథర్ వంటి క్రిప్టో కరెన్సీ రూపంలో డబ్బులు చెల్లించారని కస్టమ్స్ అధికారులు దర్యాప్తులో వెల్లడైనట్టు తెలిసింది. హర్షారెడ్డి కోసమే వాచీలు తీసుకొచ్చానని నవీన్‌కుమార్ తన వాంగ్మూలంలో అంగీకరించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే హర్షారెడ్డికి కస్టమ్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

మొత్తం రూ.100 కోట్లకు పైనే స్మగ్లింగ్..

డబ్బున్న వ్యక్తులకు ఖరీదైన వాచీలను సప్లయ్ చేయడంలో ముబీన్, నవీన్‌కుమార్ ఆరితేరినట్టు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. ఈ కేసులో చెన్నై కస్టమ్స్ అధికారులు మార్చి 18న మద్రాస్ హైకోర్టుకు ఇచ్చిన వివరణలో లగ్జరీ వాచీల స్మగ్లింగ్ సుమారు రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని తెలిపారు. ముందస్తు బెయిల్ కోసం నవీన్‌కుమార్ పెట్టుకున్న పిటిషన్‌ను హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది. రూ.100 కోట్లకుపైగా ఉన్న ఈ స్మగ్లింగ్‌లో బెయిల్ ఇవ్వడం కుదరదని కోర్టు స్పష్టంచేసింది. తమిళనాడులోని అలందూరు కోర్టు వెంటనే నవీన్‌కుమార్‌ను అరెస్టు చేసి, హర్షారెడ్డిని విచారించాలని ఏప్రిల్‌లో ఆదేశాలు జారీచేసింది. దీంతో ఏప్రిల్ 4న తమ ఎదుట హాజరుకావాలని హర్షారెడ్డికి నోటీసులు అందాయి.



తీవ్రమైన ఆర్థిక నేరాల్లో పొంగులేటి కుటుంబం!

అందుకే ఎఫ్‌ఐయూ జోక్యం • 100 కోట్ల పైబడిన కేసులపైనే ఈ విభాగం ప్రత్యేకమైన దృష్టి

పొంగులేటి అక్రమాల చిట్టాను 4 దశల్లో వడబోసిన ఎఫ్‌ఐయూ • ఎఫ్‌ఐయూ ఇచ్చిన కచ్చితమైన సమాచారంతో రంగంలోకి ఈడీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్, దాని అనుబంధ కంపెనీలు తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడ్డాయా? హవాలా మార్గంలో భారీఎత్తున సొమ్మును విదేశాలకు మళ్లించాయా? కాగితాల్లో మాత్రమే కనిపించే బోగస్ కంపెనీలను సృష్టించి ఆ ముసుగులో భారీ స్కామ్‌లకు తెగబడ్డాయా? చూపించిన ఆదాయానికి చెల్లించిన పన్నులకు ఎక్కడా పొంతన లేదా? ఢిల్లీలోని విశ్వసనీయ వర్గాలు అందించిన సమాచారాన్ని విశ్లేషిస్తే ఇవన్నీ నిజమేననిపిస్తున్నది. ముఖ్యంగా పొంగులేటి కుటుంబానికి చెందిన నివాసాలు, ఆఫీసులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దాడులు నిర్వహించడం, ఈడీకి ఎఫ్‌ఐయూ పక్కా సమాచారాన్ని ఇవ్వడాన్ని చూస్తే, పొంగులేటికి చెందిన కంపెనీలు తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడినట్టు అర్థమవుతున్నదని ఢిల్లీలోని ఉన్నతస్థాయి వర్గాలు పేర్కొన్నాయి.

ఏమిటీ ఎఫ్‌ఐయూ?

కేంద్ర రెవెన్యూ విభాగంలోని ఓ ప్రత్యేక డిపార్ట్‌మెంట్.. ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్‌ఐయూ). మనీలాండరింగ్ నిరోధక చట్టం-2002 కింద రూ. 100 కోట్లకు పైబడిన ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులను మాత్రమే ఈ విభాగం పర్యవేక్షిస్తుంది.

ఎఫ్‌ఐయూ సక్సెస్ రేట్ 99 శాతం

పొంగులేటి కుటుంబం కంపెనీలకు సంబంధించిన వివరాలు, ఆ కంపెనీల ఆర్థిక లావాదేవీలు, ష్యూరిటీ బాండ్లు, ఆదాయపు పన్ను చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎఫ్‌ఐయూ సిబ్బంది ఈడీ అధికారులకు సమర్పించారు. దీనికి కారణం.. వివరాల సేకరణ, సమాచారం అప్పగింత వరకే ఎఫ్‌ఐయూకు అధికారాలు ఉన్నాయి. కేసుల విచారణ, సోదాలు కేంద్ర దర్యాప్తు సంస్థలే చూసుకోవాలి. ఈక్రమంలోనే ఎఫ్‌ఐయూ పొంగులేటి కుటుంబం కంపెనీలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఈడీకి ఇచ్చింది. కాగా, ఎఫ్‌ఐయూ సేకరించిన సమాచారం 99 శాతం కేసుల్లో నిజమేనని తేలినట్టు ఆర్థికరంగ నిపుణులు చెప్తున్నారు.

వందల కోట్ల కేసు..

రూ. 100 కోట్లకు పైబడిన ఆర్థిక నేరాల కేసులపైనే ఎఫ్‌ఐయూ దృష్టి సారిస్తుంది. ఈ లెక్కన పొంగులేటి కంపెనీల కేసు వందల కోట్లతో ముడిపడి ఉన్నట్టు స్పష్టమవుతున్నదని అధికారి ఒకరు పేర్కొన్నారు. శుక్రవారం ఈడీ జరిపిన సోదాల్లో మూడు, నాలుగు కౌంటింగ్ మెషీన్లు తీసుకెళ్లడాన్ని చూస్తే.. ఈ కేసు పరిధి రూ. 800 కోట్లు దాటొచ్చని ఆ అధికారి అంచనా వేశారు.

రాజకీయ కక్షతోనే ఈడీ దాడులు

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాజకీయ కక్షతోనే బీజేపీ సర్కారు మంత్రి పొంగులేటి ఇండ్లపై ఈడీ దాడులు చేయిస్తున్నదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంలో భాగంగానే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని చెప్పారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసమే మోదీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నదని మండిపడ్డారు. ఈ దాడులను రాజ్యాంగబద్ధంగా ఎదుర్కొంటామని స్పష్టంచేశారు. పొంగులేటి ఇండ్లపై ఈడీ దాడులను కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ కూడా ఖండించారు.

కాంగ్రెస్ అధిష్ఠానానికి 650 కోట్లు?

- సమకూర్చిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రముఖుడు!
- సంచలనంగా మారిన ఈడీ సోదాలు.
- కర్ణాటక తరహాలోనే ఇక్కడి నుంచి నిధులు



హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): త్వరలో ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలకు తెలంగాణ నుంచి భారీగా నిధులు వెళ్తున్నాయా..? హవాలా మార్గంలో కొన్ని రాష్ట్రాలకు హైదరాబాద్ నుంచి నిధులు తరలించారా? అంటే ఔననే అంటున్నాయి ఈడీ వర్గాలు. త్వరలో నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ నుంచి నిధులు తరలిస్తున్నారన్న ఆరోపణలు మరోసారి వినిపిస్తున్నాయి. ఇటీవలే కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నుంచి నిధులు తరలించినట్టు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదే తరహాలో ఢిల్లీలోని అధిష్ఠానానికి రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ప్రముఖుడు ఒకరు రూ.650 కోట్ల నిధులను సమకూర్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఏ రూపంలో నిధులు మళ్లాయన్నదానిపై ఈడీ అధికారులు కూపీ లాగుతున్నారు. మహారాష్ట్ర మీదుగా ఢిల్లీకి నిధులు వెళ్లినట్టు ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలోని ఓ కీలక నేత కేంద్రంగానే ఇది సాగినట్టు అనుమానాలు బలపడుతున్నాయి. నెలన్నర నుంచి నిధుల తరలింపు జరుగుతున్నది. దీంట్లో కొందరు బడా హవాలా వ్యాపారులు కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తున్నది. కొన్ని నిధులు హర్యానాకు కూడా చేర్చినట్టు చెప్తున్నారు. దీనిని ఢిల్లీలోని అధిష్ఠానం పెద్ద ఒకరు నేరుగా పర్యవేక్షించినట్టు చెప్తున్నారు. రాష్ట్రంలోని అనేక మంది అనుమానితులపై ఈడీ అధికారులు నిఘా పెట్టారు. వారి లావాదేవీలను తనిఖీ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇంత పెద్ద మొత్తం ఒకేసారి హవాలా రూపంలో చేతులు మారలేదని రాష్ట్రంలోని ఓ అధికారి వ్యాఖ్యానించారు. నెలన్నర క్రితమే ఈ తంతంగం పూర్తయిందని చెప్తున్నారు. అయితే, ఒక కేసు విచారణపై మహారాష్ట్రకు చెందిన ఒక వ్యక్తిని విచారించగా ఢిల్లీ, తెలంగాణ లింకు బయటకు వచ్చిందని చెప్తున్నారు.

ఆ డబ్బు ఎక్కడిది?

రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ప్రముఖుడు అధిష్ఠానానికి ఎక్కడి నుంచి నిధులు సమకూర్చారన్నది ఆసక్తికరంగా మారింది. ఇటీవల రాష్ట్రంలో పలు పనులను, కాంట్రాక్టులను ఫైనల్ చేసిన విషయం తెల్సిందే. వీటిపై బహిరంగంగానే అవినీతి ఆరోపణలున్నాయి. వీటితోపాటు ప్రపంచ బ్యాంకు పేరుతో కొన్ని పనులు చేపట్టనున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ పనులకు సంబంధించి పలువురు 'విరాళాలు' ఇచ్చినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇక హైడ్రా పేరుతో జరుగుతున్న కూల్చివేతల వెనుక కూడా వసూళ్లు జరుగుతున్నాయని పెద్ద ఎత్తున ఆరోపణలున్నాయి. వీటి నుంచే సమకూర్చి ఉంటారని చెప్తున్నారు. అధికార పార్టీలోని ఒక వర్గం పార్టీకి సంబంధించిన నిధుల వేట కొనసాగిస్తున్నది. దీనిపై పార్టీలో కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకోవడానికి ఒక వర్గమే నిధుల సమీకరణ చేస్తున్నదని, దీంతో పనుల్లో, పదవుల్లో వాళ్లకే ప్రాధాన్యం లభిస్తున్నదని కూడా చెప్తున్నారు. తాజాగా జరిగిన ఈడీ దాడులకు కూడా కాంగ్రెస్ పార్టీలోని వర్గపోరే కారణమని చెప్తున్నారు. విషయం తెల్సిన పెద్ద మనుషుల పాత్ర కూడా దీని వెనుక లేకపోలేదని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.



శ్రీ చైతన్య కళాశాలకు 2 లక్షల జరిమానా విధించి, రసీదును అందజేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

శ్రీ చైతన్య కాలేజీలో ఫుడ్ పాయిజన్?

- 60 మంది విద్యార్థులకు అస్వస్థత
- కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన
- వైరల్ ఫీవరే అంటున్న ఏజీఎం
- అధికారుల తనిఖీ.. రూ.2 లక్షల ఫైన్

మాదాపూర్, సెప్టెంబర్ 27: హైదరాబాద్ మాదాపూర్‌లోని శ్రీ చైతన్య అక్షర భవన్ క్యాంపస్‌లో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సమాచారం తెలిసిన విద్యార్థి సంఘాల నేతలు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఏబీవీపీ, ఎన్ఎస్‌యూఐ, నవ తెలంగాణ విద్యార్థి శక్తి సంఘం ఆధ్వర్యంలో కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, వారిని కళాశాలలోనే నిర్బంధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత రెండురోజులుగా ఫుడ్ పాయిజన్‌తోపాటు వైరల్ ఫీవర్‌తో సుమారు 60 మందికి పైగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీజేవైఎం రంగారెడ్డి జిల్లా కన్వీనర్ నిఖిల్ చారి తెలిపారు. ఆందోళన సందర్భంగా కళాశాల గేటు అద్దాలు పగిలాయి. దీంతో పోలీసులు ఏబీవీపీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కాలేదని, ఎవరో తప్పుగా సమాచారం ఇచ్చారని, కొందరికి వైరల్ ఫీవర్ వచ్చిందని కళాశాల ఏజీఎం శివప్రసాద్ తెలిపారు. మాదాపూర్‌లోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ కళాశాలను శుక్రవారం చందానగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి, ఏఎంహెచ్‌వో రవి, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. హాస్టల్‌లో అపరిశుభ్రత ఉండటంతో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీ చైతన్య కళాశాలకు రూ.2 లక్షల జరిమానా విధించారు.



నూతనంగా ఏర్పడిన దామగుండం అడవి పరిరక్షణ జేఏసీ కమిటీ కార్యవర్గం

దామగుండం పరిరక్షణ జేఏసీ చైర్మన్‌గా వెంకటయ్య

పూడూరు, సెప్టెంబర్ 27: నేవీ రాడార్ సిగ్నల్ కేంద్రం ఏర్పాటును అడ్డుకొనేందుకు, దామగుండం అడవి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పరిరక్షణ జేఏసీ చైర్మన్ దేవనోనిగూడెం వెంకటయ్య పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం రామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం అడవి పరిరక్షణ జేఏసీ చైర్మన్‌గా వెంకటయ్యను ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా విజయ్ ఆర్య క్షత్రియ, మాజీ ఎంపీపీ మల్లేశం, సునంద బుగ్గన్న, విజయలక్ష్మి పండిట్, కోఆర్డినేటర్లుగా 19 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే నేవీ రాడార్ సిగ్నల్ కేంద్రం ఏర్పాటును విరమించుకోవాలని, లేని పక్షంలో అన్నిపార్టీలు, సంఘాలను ఏకంచేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

స్కూళ్ల సమీపంలో జంక్‌ఫుడ్‌పై నిషేధం

- ఆల్కహాల్, డ్రగ్స్, పొగాకు అమ్మకాలపైనా..
- మత్తు పదార్థాల నియంత్రణకు ప్రహరీక్లబ్బులు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : పాఠశాలల సమీపంలో జంక్‌ఫుడ్, మత్తుపదార్థాల విక్రయాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. 100 మీటర్ల పరిధిలో ఎలాంటి జంక్‌ఫుడ్స్ విక్రయాలు జరుపొద్దని, డ్రగ్స్, ఆల్కహాల్, పొగాకు అమ్మకాలపై నిషేధం అమల్లో ఉంటుందని స్పష్టంచేసింది. విద్యాలయాల్లో డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రహరీక్లబ్‌లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఈ ఏడాది జూలై 13న జీవో విడుదల చేసింది. తల్లిదండ్రులు, పోలీసులు, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులతో కలిసి ఈ క్లబ్‌ను ఏర్పాటుచేస్తారు. పాఠశాల హెచ్ఎం క్లబ్‌కు అధ్యక్షుడిగా, సీనియర్ టీచర్ ఉపాధ్యక్షుడిగా, 6 నుంచి 10వ తరగతి వరకు క్లాసుకు ఇద్దరు చొప్పున, పీటీఏ(పేరెంట్ టీచర్ అసోసియేషన్)నుంచి ఒక ప్రతినిధి, స్థానిక పోలీసుస్టేషన్ నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో పోలీసుశాఖ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సహకారం తీసుకుంటారు. క్లబ్బుల పనితీరు, నిర్వహణపై విద్యాశాఖ సమగ్రమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. క్లబ్‌లను ఏర్పాటుచేస్తూ జీవో ఇచ్చిన రెండు నెలల తర్వాత మార్గదర్శకాలివ్వడం గమనార్హం.

ఇవీ మార్గదర్శకాలు..

- ప్రతి పాఠశాలలో నో డ్రగ్స్ సైన్‌బోర్డులు ఏర్పాటుచేయాలి. డ్రగ్స్‌తో నష్టాలను తెలియజేయడమే కాకుండా, వాటిపై అవగాహన కల్పించేలా గోడలపై నినాదాలు రాయించాలి.
- పాఠశాల ప్రాంగణంలో టోల్‌ఫ్రీ నంబర్లు(1800-599-6969, 1800-11-0031)ప్రదర్శించాలి. సూచనల బాక్స్ ఏర్పాటుచేయాలి.
- ప్రతి నెలా ప్రహరీక్లబ్ సమావేశాలు నిర్వహించాలి. యాక్షన్‌ప్లాన్ రూపొందించాలి. అందరితో డ్రగ్స్ నియంత్రణ ప్రతిజ్ఞ చేయించాలి.
- యాంటీడ్రగ్ డే(జూన్ 26), యాంటీటుబాకో డే(మే 21)లను నిర్వహించాలి.
- విద్యార్థులు సహపాఠ్య కార్యక్రమాలపై దృష్టిపెట్టేలా చూడాలి. నైపుణ్యాలు, ఆటలు, యోగా, మెడిటేషన్, మైండ్‌ఫుల్‌నెస్‌పై ఆకర్షితులయ్యేలా చేయాలి.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

రియల్ ఎస్టేట్‌ను చిదిమేయొద్దు!

హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌కు ఇప్పుడు ఒక ట్రిగ్గర్ పాయింట్ లేదు. ఇప్పట్లో పెద్దగా ఆశలు పెట్టుకోవద్దు. ఐటీ పరిశ్రమల ద్వారా హైదరాబాద్‌లో హఠాత్తుగా రియల్ ఎస్టేట్ బూమ్ వచ్చినట్టు వస్తుంది అని, అలా పెరుగుతుందని ఆశలు అసలే పెట్టుకోవద్దు. ట్రిగ్గర్ పాయింట్ లేదు కాబట్టి ఎదుగుదల పెద్దగా ఉండదు. రియల్ ఎస్టేట్ రంగంలో చాలా కాలం నుంచి ఉన్న ఒక రియల్ ఎస్టేట్‌కు చెందిన వారు చెప్పినమాట.

గతంలోనైనా, ఇప్పుడైనా అమెరికాలో ఉన్నా, కెనడాలో ఉన్నా ప్రపంచంలో ఏ మూల ఉన్నా ఇద్దరు తెలుగు వారు కలుసుకున్నప్పుడు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ గురించి తప్పనిసరిగా మాట్లాడుకుంటారు. గతంలో మాట్లాడారు, ఇప్పుడూ మాట్లాడుకుంటున్నారు. అయితే ఆ మాటల్లో తేడా ఉన్నది. గతంలో రియల్ ఎస్టేట్ ఎలా దూసుకువెళ్తుందో మాట్లాడుకునేవారు. ఇప్పుడు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఎలా చల్లబడిందో మాట్లాడుకుంటున్నారు.



బుద్దా మురళి

తెలుగువారు ఆంధ్ర, తెలంగాణ అని వేరుపడినా ప్రపంచంలో ఏ మూలకున్న తెలుగువాడికైనా రియల్ ఎస్టేట్ రాజధాని హైదరాబాద్ నగరమే. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా వంటి అనేక దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు, ఉత్తరాదికి చెందినవారు కూడా హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌పై విశ్వాసం ఉంచి పెట్టుబడి పెట్టారు. దీనికి క్రమంగా మసకబారుతున్నది.

దేశంలోని మెట్రో నగరాలన్నిటికన్నా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ ఎక్కువగా మందగించింది. ప్రాప్ ఈక్విటీ నివేదిక ప్రకారం.. జూలై, సెప్టెంబర్ త్రైమాసిక నివేదిక ప్రకారం కొత్త వెంచర్ల ప్రారంభంలో 54 శాతం తగ్గగా, అమ్మకాలు 42 శాతం తగ్గాయి. తగ్గుదలలో ప్రధాన మెట్రో నగరాలు అన్నిటికన్నా హైదరాబాద్‌లోనే ఎక్కువ తగ్గుదల నమోదైంది. జూలై, సెప్టెంబర్ త్రైమాసికంలో 2023లో 25,370 కొత్త ఇండ్ల నిర్మాణం జరిగితే, అదే ఈ సంవత్సరం 11,601 ఇండ్లు మాత్రమే. దీనికి అనేక కారణాలున్నట్టు నివేదిక చెప్తున్నది. అవసరానికి మించి సరఫరా ఉండటం, రేట్ల పెరుగుదలతో పాటు హైడ్రా హడావుడి సైతం రియల్ ఎస్టేట్ స్లంప్‌కు ప్రధాన కారణం. ఇదే కాలంలో దేశంలో ప్రధాన నగరాల్లో ఇండ్ల నిర్మాణం 11 శాతం, కొత్త వెంచర్ల ప్రారంభం 18 శాతం తగ్గినట్టు నివేదిక. దేశవ్యాప్తంగా గృహ నిర్మాణం తగ్గినా హైదరాబాద్‌లో ఈ తగ్గుదల చాలా ఎక్కువగా ఉన్నది. శాసనసభ ఎన్నికలు జరిగి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్‌కు చుట్టుపక్కల ఉన్న భూముల ధరలు హఠాత్తుగా పడిపోయాయి. అంతకు ముందు హైదరాబాద్ ప్రధాన ప్రాంతాల్లో ఇంటి స్థలాల కన్నా ఎక్కువ స్పీడ్‌గా భూముల ధరలు పెరిగాయి. నగర శివారుకు దగ్గరగా ఉన్న గ్రామాల్లో ఎకరం రెండు కోట్ల ధర పలికిన భూములు ఇప్పుడు కోటి రూపాయలకు కూడా కొనేవారు లేరనే మాటలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ సంస్థలన్ని అనుమతులు ఇచ్చిన తర్వాత బ్యాంకులు లోన్లు ఇచ్చిన తర్వాత నిర్మించిన గృహాలను కూడా హైడ్రా కూల్చివేయడంతో కొనుగోలు దారుల్లో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. అనవసర రిస్క్ ఎందుకని కొనుగోలుకు దూరంగా ఉంటున్నారు. చెరువుల ఆక్రమణలను తొలగించడం మంచి నిర్ణయమే. మరి ఇక్కడ నిర్మాణాలకు అనుమతి ఇచ్చినవారిపై చర్యలేవీ? అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటారని మీడియాకు లీకేజీ వార్తలు ఇవ్వడం తప్ప చర్యలు తీసుకోవడం లేదు. ఒక సామాన్యుడు ప్రభుత్వ సంస్థలు ఇచ్చిన అనుమతి పత్రాలు కాకుండా ఇంకెలా సొంతంగా పరిశోధన చేయాలి. హెచ్‌ఎండీఏ అనుమతి ఇచ్చిన తర్వాత కొనుగోలు చేసిన వారి ఇండ్లను కూడా హైడ్రా కూల్చేసింది. ఇక ఇళ్ల కొనుగోలుదారులు ఏ పత్రాలు చూడాలి.

రియల్ ఎస్టేట్ ధరలు ఆకాశాన్నంటాయి. ఇప్పుడు పడిపోవడం మంచిదే కదా అనే వాదనలు కూడా వినిపిస్తాయి. హైటెక్ సిటీ భవన నిర్మాణ భూమి పూజ సమయంలో అక్కడ లక్ష రూపాయలకు ఎకరం. హైటెక్ సిటీ నిర్మాణం జరిగి ఐటీ రంగంలో దేశంలోనే రెండవ స్థానంలో నిలిచిన తర్వాత లక్ష రూపాయలకు అరగజం స్థలం కూడా దొరకని పరిస్థితి. అక్కడ ఎకరా లక్ష పలికినప్పుడు ఉపాధి అవకాశాలు ఎక్కువ ఉండేవా? అరగజం లక్షకు పలికినప్పుడు ఉపాధి అవకాశాలు ఎక్కువ ఉండేవో చూస్తే తెలుస్తుంది. స్టాక్ మార్కెట్ అయినా, రియల్ ఎస్టేట్ అయినా ధరలు పెరుగుతున్నప్పుడు, ధరలు పెరుగుతాయనే నమ్మకం ఉన్నప్పుడే ఇన్వెస్ట్‌మెంట్ చేస్తారు. దీనివల్ల కొన్ని లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. గృహ నిర్మాణరంగం మందగించడంతో సిమెంట్, స్టీల్ పరిశ్రమలు కూడా మందగిస్తాయి. పెట్టుబడులు నిలిచిపోతున్నాయి. అమెరికాలో ఉన్న తెలుగువారు సైతం భూములు, ప్లాట్స్, ఇండ్లపై ఇన్వెస్ట్ చేస్తారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ మందగించడంతో బెంగళూరుపై దృష్టిసారిస్తున్నారు.



తెలంగాణ ఏర్పడినప్పుడు రియల్ ఎస్టేట్ పడిపోతుందనుకున్నారు కానీ, ఆరు నెలలకు మించి స్తబ్ధత లేదు. పైగా ఉమ్మడి రాష్ట్రంలో కన్నా తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, లాభాలు పెరిగాయి. ఏడాది నుంచి ఈ రంగంలో స్తబ్ధత నెలకొన్నది. దీన్ని ప్రభుత్వం గ్రహించాలి.

రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోతుందని విస్తృతంగా ప్రచారం జరిగింది. తెలంగాణ ఏర్పాటును కోరుకున్నవారు సైతం కొంతవరకు ఈ ప్రచారాన్ని నమ్మరు. ఐతే దీన్ని గ్రహించిన బీఆర్‌ఎస్ పాలకులు చాకచక్యంతో వ్యవహరించి రియల్ ఎస్టేట్‌కు ఊతమిచ్చారు. పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ రంగంలోకి పెట్టుబడులు వచ్చాయి. సహజంగా తమ పెట్టుబడులకు తగిన లాభం వచ్చినప్పుడు ఆ పెట్టుబడులు మరింతగా పెరుగుతాయి. ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలానా కాలంలో అదే జరిగింది.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే భూములపై తొలి దెబ్బపడింది. నిజానికి అప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి వ్యతిరేక చర్యలు చేపట్టలేదు కానీ, హఠాత్తుగా భూముల ధరలు పడిపోయాయి. భూములపై కొత్త ఇన్వెస్ట్‌మెంట్‌లు నిలిచిపోయాయి. 'నేను రియల్ ఎస్టేట్ రంగం నుంచి వచ్చాను, రియల్ ఎస్టేట్ గురించి నాకు చెప్తారా?' అని ఓ విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రియల్ ఎస్టేట్ రంగం నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మరింత పుంజుకోవడానికి రేవంత్‌రెడ్డి ఏదో చేస్తారని ఆశించినవారు కూడా చాలా మంది ఉన్నారు. కానీ, ఏమీ జరగలేదు. పురోగతి మాట దేవుడెరుగు, రియల్ ఎస్టేట్ రంగం తిరోగమనం వల్ల ఆ రంగంలోకి పెట్టుబడులు తగ్గుతాయి. అదే సమయంలో ఆ మేరకు రియల్ ఎస్టేట్ రంగంలో ఉపాధిలో అవకాశాలు తగ్గిపోతాయి.

2004 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని తేలిపోయింది. బాబు పార్టీ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఐటీ దెబ్బ తింటుందని విస్తృతంగా ప్రచారం జరిగింది. ఓ దశలో ఈ ప్రచారానికి వైయస్ రాజశేఖర్‌రెడ్డి సైతం కంగారు పడ్డారు. అప్పటివరకు ఉచిత విద్యుత్తు అంటూ రైతులపైనే ఫోకస్ చేసిన వైఎస్సార్ చివరి దశలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఐటీ రంగానికి మరింత ప్రోత్సాహం అందిస్తామని ప్రచారం చేశారు. భయపడినట్టుగా ఏమీ జరగలేదు కానీ, ఐటీ ఎగుమతులు మరింతగా పెరిగాయి. ఇక రాష్ట్ర విభజన సమయంలోనూ ఇదేవిధంగా ఐటీ రంగం వెళ్లిపోతుందని ప్రచారం చేశారు. కానీ మరింతగా ఐటీ ఎగుమతులు పదేండ్లలో పెరిగాయి. ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు హైదరాబాద్ వచ్చాయి. టీడీపీ బాబు, కాంగ్రెస్ వైఎస్సార్, టీఆర్‌ఎస్ కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌లో ఐటీ రంగం పెరుగుతూనే పోయింది తప్ప ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. అదేవిధంగా రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెరుగుతూనే పోయాయి కానీ, తగ్గలేదు. తెలంగాణ ఏర్పడినప్పుడు రియల్ ఎస్టేట్ పడిపోతుందనుకున్నారు కానీ, ఆరు నెలలకు మించి స్తబ్ధత లేదు. పైగా ఉమ్మడి రాష్ట్రంలో కన్నా తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, లాభాలు పెరిగాయి. ఏడాది నుంచి ఈ రంగంలో స్తబ్ధత నెలకొన్నది. దీన్ని ప్రభుత్వం గ్రహించాలి.

ఎన్నికల ముందు రాచకొండలో కొత్త నగరాన్ని నిర్మిస్తామని పీసీసీ అధ్యక్షునిగా రేవంత్‌రెడ్డి ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత ఇప్పుడు ముచ్చర్ల ప్రాంతంలో హైదరాబాద్, సికింద్రాబాద్, హైటెక్ సిటీ సరసన 4వ నగరంగా ఫ్యూచర్ సిటీ నిర్మిస్తామని ప్రకటించారు. ఔషధ నగరం కోసం గత ప్రభుత్వం సేకరించిన భూమి ఇది. ఇక్కడ కొత్త నగరం నిర్మిస్తామని సీఎం హామీ. ఉన్న నగరంలోనే రియల్ ఎస్టేట్‌ను స్తబ్ధతగా మార్చారు. కొత్త నగరం ఎప్పుడు కార్యరూపం దాలుస్తుందో తెలియదు.

రాజకీయం ఎలా ఉన్నా ఉపాధి రంగాలను దెబ్బతీయవద్దు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏదో ప్రాజెక్టులు ఇస్తుందని ఆశలు పెట్టుకోవద్దు. దక్షిణాదికి ఏమైనా ఇవ్వాలనుకుంటే మిత్రపక్షం అధికారంలో ఉన్న ఆంధ్రను పట్టించుకోవచ్చు కానీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ మాత్రం మోదీ ప్రాధాన్యం జాబితాలో ఉండదు. మన వనరులను మనమే సమకూర్చుకోవాలి. మన ఉపాధి అవకాశాలు మనమే చూసుకోవాలి. ఆ దిశగా ప్రభుత్వ ప్రయత్నాలు కనిపించడం లేదు. తెలంగాణకు రియల్ ఎస్టేట్ బంగారు బాతు గుడ్డు లాంటిది. దానిని చేతులతో చిదిమేయవద్దు.

గురుకుల సమస్యలు పట్టవా?

రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ తదితర అట్టడుగు వర్గాల విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యనందిస్తూ, వారి బంగారు భవితకు బాటలు వేస్తున్న గురుకుల విద్యాసంస్థలు ఇప్పుడు సమస్యలతో సతమతమవుతున్నాయి. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత విస్తృత సంఖ్యలో గురుకులాలు అందుబాటులోకి వచ్చాయి. కార్పొరేట్‌తో సమానంగా పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు విద్యనందిస్తున్నాయి. ఉన్నత విద్యకు, ఉపాధి సాధనకు కావలసిన తర్ఫీదును ఇచ్చే శిక్షణ కేంద్రాలు గానూ గురుకులాలు రూపుదిద్దుకున్నాయి. వేలమంది నిరుపేద విద్యార్థులను డాక్టర్లుగా, ఇంజినీర్లుగా తీర్చిదిద్దుతూ దేశానికే తలమానికంగా తెలంగాణ గురుకులాలు నిలుస్తున్నాయి. ఇది నాణేనికి ఒక పార్శ్వం. మరోవైపు ఊపర్ షేర్వానీ.. అందర్ పరేషానీ' అన్న చందంగానే తయారైంది గురుకులాల పరిస్థితి.



గురుకుల విద్యా జేఏసీ



గురుకుల విద్యార్థులు, బోధన ఉద్యోగులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. గడిచిన 10 నెలలుగా అసలు గురుకులాల్లో ఏం జరుగుతున్నదో తెలియని దుస్థితి నెలకొన్నది. పాలన మొత్తం గాడి తప్పిపోయింది. ఇప్పటివరకు సాధించిన ప్రాభవం క్రమంగా మసకబారుతున్నది. ముందుగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిద్దాం.

గురుకుల విద్యాలయాలు అత్యధికంగా అద్దె భవనాల్లో, అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయనే క్షేత్రస్థాయి పరిస్థితులను పట్టించుకోకుండానే అన్ని గురుకులాలకు ఒకేరకమైన పని వేళలను నిర్ణయించింది. తెరిపి లేకుండా కొనసాగే ఈ టైంటేబుల్ వల్ల విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. చాలీచాలని మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లలో కేవలం అరగంటలో స్కూల్, జూనియర్ కాలేజీకి చెందిన 640 మంది, డిగ్రీ కాలేజీలో చదివే 840 మంది విద్యార్థులు ఎలా కాలకృత్యాలను తీర్చుకోగలరు? ఎలా తయారవగలరు? అనేది టైంటేబుల్‌ను రూపొందించిన పెద్దలే చెప్పాలి.ఇక భవనాల అద్దెలను 8 నెలలుగా చెల్లించకపోవడంతో యాజమాన్యాలు వసతులు కల్పించడం మానేశాయి.

గురుకుల ఉపాధ్యాయులు బోధనేతర పనుల భారంతో ఒత్తిడికి లోనవడమే కాదు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ఇబ్బందవుతున్నది. ఇంతచేసినా ఒకటో తారీఖున జీతం అందుతుందా అంటే అదీ లేదు. ఏ సొసైటీలో ఎప్పుడు పడుతుందో తెలియని దుస్థితి. ఇవీ గాక ప్రమోషన్లు, బదిలీలకు ఒక్కో సొసైటీలో ఒక్కో నిబంధన. ప్రమోషన్ ఇవ్వకపోవడం వల్ల ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లు, లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. అదేవిధంగా వివిధ జాతీయస్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చి, అనేక ఉత్తమ ర్యాంకులు సాధించిపెడుతూ పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెడుతున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో పనిచేస్తున్న అధ్యాపకులకు ఇంతకు పూర్వం ఇస్తున్న నగదు ప్రోత్సాహకాలను ఆపేయడం తీవ్ర నిరాశకు గురిచేస్తున్నది. పేరుకే ప్రభుత్వ ఉపాధ్యాయుడు తప్ప గురుకులంలో పనిచేస్తున్న సిబ్బందికి సర్వీస్, పే ప్రొటెక్షన్ లేదు. హెల్త్ కార్డు సౌకర్యం వర్తించదు. స్టేట్ సబార్డినేట్ రూల్స్ అమలుకావు. కానీ, గురుకులంలో ఎవరి తప్పిదం వల్ల ఏదైనా అనుకోని సంఘటన జరిగితే మాత్రం చిన్న చిన్న కారణాలతో సిబ్బందిని బలి చేయడం పరిపాటిగా మారిపోయింది.

పరిష్కారమంటూ లేని సమస్య ఉండదు. అలాగే గురుకులాలు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా పరిష్కరించలేనంత పెద్దవేమీ కాదు. సంకల్పముంటే చాలు. అందుకు ముందుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పాఠశాల విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ పరిధిలోని గురుకులాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలి. కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయడంతోపాటు, కామన్ సర్వీస్ రూల్స్‌ను రూపొందించాలి. గురుకులాలకు ప్రభుత్వం గ్రీన్ చానల్ ద్వారా తక్షణం నిధులను విడుదల చేయాలి. ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతనాలను 010 పద్దు ద్వారా ప్రతి నెలా మొదటి తేదీన విడుదల చేయాలి. గురుకుల ఉపాధ్యాయులకు పనికి తగిన వేతనాలు చెల్లించాలి. అవసరమైతే ప్రోత్సాహకాలను అందించాలి. ఈ నిర్ణయాలు చాలు ప్రస్తుతం గురుకులాల్లో నెలకొన్న అనేక సంక్షోభ పరిస్థితులను సరిదిద్దడానికి. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రస్తుత ప్రభుత్వానికి ఈ సంగతి విన్నవిస్తున్నా ఇప్పటివరకు సానుకూల స్పందన లేదు. అందుకు భిన్నంగా ప్రభుత్వ విధానపర నిర్ణయాలు గోరుచుట్టు మీద రోకటి పోటులా పరిణమించాయి. వాస్తవ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తేవడం కోసం గురుకుల విద్యా జేఏసీ ఆధ్వర్యంలో అనేక విధాలుగా కృషి చేశాం. ప్రజాభవన్‌ను ఆశ్రయించాం. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆశాజనకమైన ప్రకటనలు వెలువడిన దాఖలాల్లేవు.

ఈ నేపథ్యంలోనే దశలవారీ ఆందోళన చేపట్టి సమస్యను నేరుగా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని నిర్ణయించాం. అందులో భాగంగానే సెప్టెంబర్ 17, 18వ తేదీల్లో పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాం. సెప్టెంబర్ 23, 24 తేదీలలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, వివిధ ముఖ్య కార్యదర్శులకు, అన్ని గురుకుల సంస్థల కార్యదర్శులకు మెమోరాండాలు సమర్పించాం. టైంటేబుల్ మార్పుతో సహా ఇతర ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని రావాలన్న నేపథ్యంలో సెప్టెంబర్ 28న అన్ని గురుకుల విద్యాలయాల ప్రాంగణాల్లో చాక్‌డౌన్, పెన్‌డౌన్ కార్యక్రమానికి పిలుపునిచ్చాం.

గురుకుల సమస్యలపైన ప్రస్తుత ప్రభుత్వం ఇకనైనా స్పందించాలని కోరుతున్నాం. గురుకుల ఉపాధ్యాయులతో చర్చలు జరిపి గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో నిరవధిక పోరాటాలను చేపడుతామని తెలియజేస్తున్నాం.

వాళ్లు అత్యల్ప ఆరోగ్య వ్యయం, అతి తక్కువ వనరులున్న దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు. అయితేనేం, అక్కడి వసతుల లేమి వారికి అడ్డంకిగా మారలేదు. మారుమూల ప్రాంతాలు, అడవులు, కొండకోనల్లో తిరుగుతూ ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రాణాంతక వ్యాధులపై అధ్యయనం చేస్తున్నారు. ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న మహమ్మారులను అడ్డుకునేందుకు యావత్ ప్రపంచం వారిపై, వారు చేసే పరిశోధనలపై ఆధారపడుతున్నదంటేనే ఆ శాస్త్రవేత్తల కృషిని అర్థం చేసుకోవచ్చు. వారే ఆఫ్రికా ఖండానికి చెందిన శాస్త్రవేత్తలు.

పరిశోధనలే ప్రాణం

ఎల్లో ఫీవర్, హెచ్ఐవీ, ఎబోలా, లస్సా లాంటి మహమ్మారుల కారణంగా లక్షలాది మంది మరణాలను చవిచూసిన ఆఫ్రికా ఖండంలో మళ్లీ వ్యాపిస్తున్న ప్రాణాంతక వ్యాధులపై ఆ ఖండానికి చెందిన 8 మంది వైద్య శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు. అత్యాధునిక జన్యు పరికరాలు, డేటా షేరింగ్ ప్లాట్‌ఫాంలు, షూలెదర్ ఎపిడెమియాలజీని ఉపయోగించి వారు చేస్తున్న పరిశోధనలు మానవాళికి వరంగా మారాయి.



మధ్య ఆఫ్రికాలో ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న మంకీపాక్స్‌కు కారణమైన ఎంపాక్స్ స్ట్రెయిన్ ఇప్పుడు ప్రపంచ దేశాలకు సరికొత్త సవాల్‌గా మారింది. వాతావరణ మార్పులు, పట్టణీకరణ, అటవీ నిర్మూలన, పెరుగుతున్న పశువుల ఉత్పత్తి అంటువ్యాధుల వ్యాప్తిని వేగవంతం చేస్తున్నాయి. ముందస్తుగా గుర్తించడం, వ్యాధుల వ్యాప్తి పట్ల ప్రతిస్పందించాల్సిన అవసరాన్ని ఇది నొక్కిచెప్తున్నది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నేతృత్వంలోని నెగ్లెక్టెడ్ ట్రోపికల్ డిసీజ్ గ్లోబల్ ప్రోగ్రామ్‌కు సెనెగల్‌కు చెందిన అంటువ్యాధుల ఎపిడెమియాలజిస్ట్ ఇబ్రహీం సోసె ఫాల్ నాయకత్వం వహిస్తున్నారు. స్థానిక వైద్య బృందాలకు మూడు దశాబ్దాలకు పైగా మలేరియా నియంత్రణతో పాటు కొత్తగా పుట్టుకొచ్చే ప్రాణాంతక వ్యాధులను ఎదుర్కొనే విషయంలో సన్నద్ధతపై ఆయన శిక్షణ ఇస్తున్నారు. జోహెన్నస్‌బర్గ్‌లోని విట్‌వాటర్స్‌రాండ్ విశ్వవిద్యాలయానికి చెందిన వైరాలజిస్ట్ మెరిట్జీ వెంటర్ అంటువ్యాధుల నిఘా నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేయడంలో ఆయన ఎంతగానో కృషిచేశారు. దోమల ద్వారా వ్యాపించే వైరస్‌లపై పరిశోధనలకు ఇది దోహదపడింది. అదే విశ్వవిద్యాలయానికి చెందిన చిన్న పిల్లల నిపుణుడు, వ్యాక్సినాలజిస్ట్ సబీర్ మధి యాంటీబయోటిక్-రెసిస్టెంట్ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ల నుంచి మరణాలను నివారించడానికి రోగనిరోధకతపై పనిచేస్తున్నారు. జాంబియా నేషనల్ పబ్లిక్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పశువైద్యుడు, ఎపిడెమియాలజిస్ట్ రేమండ్ హమూంగా మానవులు, పశువులు, మొక్కలు, పర్యావరణ పరిస్థితుల కారణంగా వ్యాపించే సూక్ష్మజీవుల గురించి అధ్యయనం చేస్తున్నారు. ఇలా ఎందరో ఆఫ్రికా ఖండానికి చెందిన శాస్త్రవేత్తలు ప్రపంచం ఎదుర్కొం టున్న ప్రాణాంతక వ్యాధుల నివారణకు కృషిచేస్తునారు.


యావత్ ప్రపంచం ఎంపాక్స్ పట్ల ఆందోళనగా ఉన్నది. కానీ, ఆఫ్రికాలో అది సాధారణ విషయం. ఎందుకంటే, అలాంటి ఎన్నో వ్యాధులు అక్కడి ప్రజల అనుభవంలో ఉండటమే అందుకు ప్రధాన కారణం. జికా, డెంగ్యూ, వెస్ట్ నైల్, సింద్‌బిస్, షుని, రిఫ్ట్ వ్యాలీ లాంటి ప్రాణాంతక వ్యాధులు ఆఫ్రికాకు సుపరిచితం.

ఇంకా చెప్పాలంటే.. వీటిలో చాలావరకు ఆఫ్రికాలో పురుడుపోసుకున్నవే. వసతులు, వనరుల సమస్యలు వెంటాడుతున్నప్పటికీ ఆఫ్రికా శాస్త్రవేత్తలు వెనుకడుగు వేయడం లేదు. పరిశోధనలను ఆపడం లేదు. వినూత్నమైన పరిశోధనలు చేస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. అందుకే వారికి పజలూ సహకరిస్తున్నారు. ఎందుకంటే, ఎవరో వస్తారు, ఏదో చేస్తారని వారు ఎదురుచూడటం లేదు. అక్కడి శాస్త్రవేత్తలే ప్రపంచానికి మార్గనిర్దేశం చేస్తున్నారు, మహమ్మారుల నుంచి ప్రపంచాన్ని కాపాడుతున్నారు.

- జానిస్ క్యూ

('బిజినెస్ స్టాండర్డ్' సౌజన్యంతో)

ఎటమటం




ఎట్లుండేటోళ్లం?

మూడు రంగుల *జెండా పార్టీ ఇటీవల గాంధీభవన్‌లో ఓ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి, ఇద్దరు, ముగ్గురు మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు గూడ హాజరైండ్రు. ఈడిదాన్క బాగనే ఉంది గనీ.. పాపం ఆ పార్టీలో కొత్తగా జేరిన ఓ ఇద్దరు ముసలి నేతల పరిస్థితే నెరీ అవమానంగా తయారైందట. ఓ మూలగ్గాసున్న వీళ్లు మీటింగ్ అయిపోయినంక పక్కకువొయి విక్రమార్కుడు సినిమాలోని 'రవితేజ, బ్రహ్మానందం' తరహాలో గతాన్ని తవ్వుకున్నరట. 'గులాబీ పార్టీల ఉన్నప్పుడు ఆయన కుడిబాజుకు నువ్వు, ఎడమ బాజుకు నేను.. ఎట్లుండేటోళ్లం, ఇప్పుడెట్లైపోయినం భయ్యా' అని మస్తు బాధవడ్డరట. ఇప్పుడెంత బాధవడ్డా ఫాయిదా లేదని కాంగ్రెస్ కార్యకర్తలు ఊకోవెట్టడంతో వాళ్లకు కొంత ధైర్నం వచ్చిందని సమాచారం.*


ఏకు వొయి మేకైంది!

గాంధీభవన్‌లో *ఇప్పుడు 'ఏకు వొయి మేకై గూసుంది' అనే మాట ఎక్కువినిపిస్తున్నది!. వారంల ఒక్కరోజన్న గాంధీభవన్‌కు పోవాల్నని, కార్యకర్తల కట్టాలను, బాధలను, సమస్యలను సావధానంగా విని వాళ్లకు పరిష్కారం సూపెట్టాల్నని రాష్ట్ర మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. అయితే... పీసీసీ అధ్యక్షుడిగా పదవీ ప్రమాణం తిన్న వెంటనే మహేశ్‌కుమార్ గౌడ్.. 'మంత్రులే గాద్ సారు, మీరు గూడ గాంధీభవన్‌కు వారానికి రెండు రోజులు రావాల్నని, గప్పుడే కార్యకర్తల కట్టాలు తీరుతయని' చెప్పిండట! సూడటానికి సలహా, సూచనల లెక్కనే కనిపిస్తున్నా మహేశ్‌కుమార్ మాటల వెనుక మర్మం మరోటి ఉన్నదని, పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి సుర్కు వెట్టిండని గాంధీభవన్ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నయి.*



ముంచింది మనోళ్లే...

'నమ్మినోళ్లే *నట్టేట ముంచిర్రని' కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య లబోదిబోమని మొత్తుకుంటున్నడట. కర్ణాటక రాష్ట్రంల ఏ మూల జూసినా ముడా స్కాం గురించే ఇప్పుడు చర్చ నడుస్తున్నది. 'మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ'లో తన భార్య పార్వతి పేరు మీన అక్రమంగా ఇంటి జాగలు కొట్టేసిండనేది సిద్ధరామయ్య మీద అభియోగం. ఈ ముచ్చట బైటికెలా పొక్కిందనే విషయాన్ని ఆరా తీస్తే ఉచ్చులు పేనింది బీజేపీ మాజీ సీఎం యడియూరప్పే అయినప్పటికీ ఇరికిచ్చింది మాత్రం తన కాంగ్రెస్ పార్టీకి చెందినవారేనట! ముడా కుంభకోణానికి సంబంధించిన కీలక పత్రాలన్నీ యడియూరప్పకు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీకి చెందిన పెద్ద లీడరేనట. విషయం తెల్సుకున్న సిద్ధులు సార్ ఇటు కక్కలేక, అటు మింగలేక లోలోపల మండిపోతున్నడట.!*





పండవెట్టి తొక్కితే....

ముఖ్యమంత్రి *నోటి పొంట 'పండవెట్టి తొక్కుతె కసరెల్లాలె.., పేగులు దీసి మెడలేసుకుంటా' అనే మాటలు అలవోకగా వస్తయి. ముఖ్యమంత్రి సారు మాటల్నే ఆదర్శంగా తీసుకున్నట్టున్నరు హుజూర్‌నగర్ ఏరియా దవాఖాన నర్సులు. రోజులు నిండిన చూలాలును పండవెట్టి తొక్కి మరీ కాన్పు జేసిన్రు. మఠంపల్లి మండలం గుర్రంపోడు తండా వాసి అయిన రేణుక పురుడు పొయ్యిమని దవాఖానకు వోతె డాక్టర్లు అందుబాటులో లేరు. 'మేమేమన్న తక్కువ తిన్నమా' అనుకున్నారేమో నర్సులు ఆ నిండు చులాలు పొట్ట మీద శెయ్యి వెట్టి ఒత్తుడు షురూ జేసిన్రు. ఎంత తన్లాడినా పాపం ఆ తల్లి ప్రసవించలేదు. ఆ నర్సులకు మన ముఖ్యమంత్రి మాటలు టక్కున గుర్తుకొచ్చినట్టున్నయి. చేతి గ్లౌజులు తీసి కాళ్లకు తొడిగి.. నిండు చులాలును పండవెట్టి తొక్కిర్రు. మగపిల్లగాడు బైటికైతే వచ్చిండు గనీ పాపం జీవునంతోని గాదు. ఇంకా నయ్యం ఆ చూలాలు పేగులు తీసి మెడలో వేసుకోలేదు సంతోషం.*

- సిన్రాజయ్య

రాత్రికి రాత్రి లక్ష ఇండ్లు ఎక్కడివి చిట్టీ

- **డబుల్ బెడ్‌రూం ఇండ్లపై సర్కారు తీరుపై కేటీఆర్ ఎద్దేవా**



హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): 'కట్టలేదన్నారు. ప్రజలను మభ్యపెట్టాం అన్నారు. మరి లక్ష ఇండ్లు రాత్రికి రాత్రికి ఎక్కడ నుంచి పుట్టుకొచ్చాయి చిట్టీ...' అని డబుల్ బెడ్‌రూం ఇండ్లపై సర్కారు అనుసరిస్తున్న తీరుపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రం విసిరారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల ఫొటోలను, పత్రికల్లో వచ్చిన ప్రత్యేక కథనాలను ట్యాగ్ చేస్తూ ఆయన ఎక్స్‌వేదికగా పోస్ట్ చేశారు. 'మేము నిర్మిస్తే.. మీరు కూల్చేస్తున్నారు. మాది నిర్మాణం .. మీది విధ్వంసం. లక్షల నిర్మాణాలు మావి ..లక్షల కూల్చివేతలు మీవి. మూసి నది సాక్షిగా మహానగరంలో కేసీఆర్ లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు. కాంగ్రెస్ విష ప్రచారాలు అబద్ధాలు అనడానికి మరో సాక్ష్యం' అని పేర్కొన్నారు. కేసీఆర్ పాలన దృశ్యాలను చూసి మింగుడు పడటం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ జూటా మాటలు, కుట్రలకు, పనుల డ్యామేజ్ కంట్రోల్‌కు కేసీఆర్ నిర్మాణాలే దిక్కయ్యాయని ఆయన విమర్శించారు. కేసీఆర్ లక్ష డబుల్ నిర్మాణాలు నిజం...కేటాయింపులు నిజమని ఆయన స్పష్టం చేశారు.

ప్రజా పోరాట యోధుడు బాపూజీ : కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): ప్రజాపోరాటయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కేటీఆర్ పేర్కొన్నారు. 1969లో ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమంలో తన మంత్రి పదవికి రాజీనామా చేసి ఎందరో తెలంగాణ ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచిన మహానేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటం, మలి దశ తెలంగాణ ఉద్యమం దాకా ప్రజా ఉద్యమాల్లో వారి పాత్ర అనిర్వచనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ సారథ్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసంలోనే పురుడు పోసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ట్యాంక్‌బండ్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేసి, హార్టికల్చరల్ యూనివర్సిటీకి వారి పేరు పెట్టి ఘనంగా స్మరించుకున్నదని తెలిపారు.



వనపర్తి జిల్లా రేవల్లిలో యూనియన్ బ్యాంక్ ఎదుట రైతులతో కలిసి ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రేవల్లిలో బ్యాంకు ఎదుట రైతుల ధర్నా

- **రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్**
- **మద్దతు పలికిన బీఆర్‌ఎస్ నేతలు**

గోపాల్‌పేట, సెప్టెంబర్ 27 : రుణమాఫీతోపాటు రైతుభరోసా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నేతలు ధర్నా చేపట్టారు. శుక్రవారం వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు రఘురామారావు, సేనాపతి, భీమన్నతోపాటు పలువురు నాయకులు, రైతులు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యంకాని హామీలిచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయలేక మీనమేషాలు లెక్కిస్తున్నదని ధ్వజమెత్తారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రేవంత్ సర్కారు అర్హులైన రైతులకు మాఫీతోపాటు రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సిద్దిపేట జిల్లా నంగునూరులో రైతుల ధర్నాలో ప్లకార్డులు చేతబూనిన రైతులు



సిద్దిపేట జిల్లా నంగునూరులో ధర్నాలో భారీగా పాల్గొన్న రైతులు

ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి

- **దసరాలోగా 2 లక్షల రుణమాఫీ చేయకపోతే సచివాలయం ముట్టడిస్తాం.. అసెంబ్లీని స్తంభింపజేస్తాం**
- **కాంగ్రెస్ సర్కార్ రైతులకిచ్చిన ఒక్క హామీ నెరవేర్చలె**
- **నీ గుండెల్లో నిద్రపోతున్నా రేవంత్..!**
- **కాళేశ్వరం కూలిపోయిందా..? మల్లన్నసాగర్‌కు వచ్చి చూడు**
- **రేవంత్‌కు కూల్చుడు తప్ప కట్టుడు తెల్వదు**
- **నంగునూరులో రుణమాఫీ ధర్నాలో హరీశ్‌రావు**



సిద్దిపేట జిల్లా నంగునూరులో రైతుల ధర్నాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, అన్ని వర్గాలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దసరాలోగా రైతులందరికీ రుణమాఫీ చేయకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని, వచ్చే అసెంబ్లీ సమావేశాలను స్తంభింపచేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేదాకా బీఆర్‌ఎస్ వదిలిపెట్టదని స్పష్టంచేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలంటూ శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలకేంద్రంలో రైతులు నిర్వహించిన ధర్నాలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ, రైతుభరోసా, పంటలకు బోనస్ ధర ఇలా అన్ని విషయాల్లో రైతులను రేవంత్‌రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో.. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ, అవ్వ తాతలకు 4వేల పెన్షన్, అక్కచెల్లెళ్లకు రూ.2,500 సహా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తే రాజీనామా చేస్తానంటూ తాను సవాల్ చేసిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఎమ్మెల్యే పదవి కంటే రైతులకు రుణమాఫీ కావడమే తనకు ముఖ్యమని చెప్పారు. 'పంద్రాగస్టు వరకు 2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. మొదట రూ.49 వేల కోట్లు అని, ఆ తర్వాత 31 వేల కోట్లు అని చెప్పి చివరకు మాఫీ చేసింది రూ.17 వేల కోట్లు. నంగునూరు మండలంలోనే 11,000 మంది రైతులు అప్పు తెచ్చుకుంటే ఐదువేల మందికే రుణమాఫీ అయింది. మరి.. ఎక్కడ రుణమాఫీ చేసిండ్రు' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

> హరీశ్‌రావు ఏడ నిద్రపోతున్నడు.. రాజీనామా ఎప్పుడు చేస్తావ్.. అని రేవంత్‌రెడ్డి అడుగుతున్నడు. నీ గుండెల్లో నిద్రపోతున్న రేవంత్‌రెడ్డీ.. రైతులకు రుణమాఫీ జరిగేదాకా నిన్ను విడిచిపెట్టను **- హరీశ్‌రావు**

కాళేశ్వరం కూలిపోతే నీళ్లు ఎట్లా వచ్చాయో చూడు

కాళేశ్వరం కూలిపోయిందని చెప్తున్న రేవంత్‌రెడ్డి వచ్చి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌ను చూడాలని, కాళేశ్వరం కూలిపోతే నీళ్లు ఎట్లా వచ్చాయో చెప్పాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి కూలగొట్టుడు తప్ప కట్టుడు తెలవదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరంలో 100 భాగాలు ఉన్నాయని, అందులో మూడు బరాజ్‌లు, 19 పంప్‌హౌజ్‌లు, 18 రిజర్వాయర్లు, సొరంగాలు, కాలువలు, పైపులైన్లు ఉన్నాయని వివరించారు. రెండు పిల్లర్లకి చిన్నపగుళ్లు వస్తే కాళేశ్వరం మొత్తం కూలిపోయినట్టు ప్రచారం చేశారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే ఫారూఖ్‌హుస్సేన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ పాల్గొన్నారు.

హరీశ్‌కు గోడు వెల్లబోసుకున్న రైతులు

నంగునూరు ధర్నాకు తరలివచ్చిన రైతులతో హరీశ్‌రావు ముచ్చటించారు. ఆయా రైతులకు రుణం ఎంత ఉన్నది? ఎన్ని ఎకరాల భూమి ఉన్నది? రుణమాఫీ కాకపోవడానికి అధికారులు ఏం చెప్తున్నారు? వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ కోసం ఎవరెవరి వద్దకు ఎలా తిరిగామో రైతులు హరీశ్‌రావుకు వివరించారు. 'మేమంతా రుణమాఫీ కానోళ్లం సార్.. పంట కోతకు వచ్చింది కానీ రైతుబంధు పడలేదు. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు రైతుబంధు మంచిగా ఇచ్చిండు. రేవంత్ మాటలకు మోసపోయాం. రుణమాఫీ అయ్యేంత వరకు కొట్లాడుదాం. దసరా వరకు మాఫీ చేయకపోతే సచివాలయంకు వస్తాం.. మాఫీ అయ్యేంత వరకు అక్కడే ఉంటాం' అని రైతులు చెప్పారు.

మిత్తికి తెచ్చి మీది పైసలు కట్టిన



నాకు బ్యాంకుల రెండు లక్షల ముప్పై వేల రుణం ఉన్నది. రెండు రూపాయల చొప్పున అప్పు తెచ్చి మీది రూ.40 వేలు బ్యాంకుల కట్టిన. మిత్తికి తెచ్చి రెండు నెలలు అయింది. లోన్ మాఫీ అయితలేదు. ఏం చేయాల్నో అర్థమైతలేదు. నాకు మూడున్నర ఎకరాల భూమి ఉన్నది. ఇంకా రైతుబంధు రాలె. కాంగ్రెస్‌ది ఏమి సర్కారో ఏమో. **- జక్కుల యాదగిరి, రైతు, గట్లమల్యాల, సిద్దిపేట జిల్లా**

రైతుబంధు లేదు.. రుణమాఫీ లేదు



నాకు ఎకరం ఒక గుంట భూమి, రూ.58 వేల క్రాప్ లోన్ ఉన్నది. బ్యాంకుకు వెళ్తే వ్యవసాయ అధికారులను అడుగుమన్నరు. వచ్చే నెలలో లోన్ రెన్యువల్ ఉన్నది. కట్టకపోతే వడ్డీ ఎస్తమంటుర్రు. కేసీఆర్ ఉన్నప్పుడు రైతుబంధు రూ.5 వేలపైన పడుతుండే. ఇప్పుడు రైతుబంధు రాక పెట్టుబడికి రూ.10 వేల అప్పు తెచ్చిన. **-దుర్గారెడ్డి, రైతు, నంగునూరు, సిద్దిపేట జిల్లా**

నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం రాష్ట్రానికి రానున్నారు. ఉదయం నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి హాజరవుతారు. మధ్యాహ్నం రాష్ట్రపతి నిలయంలో ఎనిమిది రోజులపాటు నిర్వహించే ఈశాన్య రాష్ట్రాల భారతీయ కళా మహోత్సవంను ప్రారంభిస్తారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా మినిస్టర్ ఇన్ వెయిటింగ్‌గా మంత్రి సీతక్కను రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. రాష్ట్రపతిని స్వాగతించడం మొదలు సాగనంపడం వరకు ఆమె వెంట సీతక్క ఉండనున్నారు.

సీఎంకు కాళేశ్వరంపై అవగాహనలేదు

- **కేసీఆర్ మీద కోపంతో ప్రాజెక్టును అర్థం చేసుకోరా?: వినోద్‌కుమార్**



హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అవగాహన లేదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ మీద కోపంతో కాళేశ్వరంను అర్థం చేసుకునే ప్రయత్నం చేయలేదని పేర్కొన్నారు. మేడిగడ్డ బరాజ్‌లో మూడు పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టే పనికిరాదనే రీతిలో మాట్లాడటం సీఎం అవగాహన రాహిత్యానికి పరాకాష్టగా అభివర్ణించారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం 14 టీఎంసీలతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి డిజైన్ చేస్తే, దాని సామర్థ్యాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేసీఆర్ 141 టీఎంసీలకు పెంచారని వివరించారు. మేడిగడ్డ బరాజ్ నిర్మాణానికి 4,613 కోట్లు, అన్నారం బరాజ్‌కు 2,734.81 కోట్లు, సుందిళ్ల బరాజ్‌కు 2,111.10 కోట్లు ఖర్చు అయిందని వివరించారు. గోదావరి నీటిని మేడిగడ్డ వద్ద 100 మీటర్ల ఎత్తు నుంచి 620 మీటర్ల ఎత్తు వరకు పంపింగ్ చేస్తూ మొత్తం 141 టీఎంసీల నీరు ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నిల్వ అవుతుందని వివరించారు. ప్రాణహిత చేవెళ్లలో భాగమైన ఎల్లంపల్లి రీ ఇంజినీరింగ్ తర్వాత ఇప్పుడు కాళేశ్వరంలో భాగమైందని వివరించారు.

21 రోజుల్లో ఈఆర్సీ నిర్ణయం సాధ్యమేనా?

- **గడువు పొడిగించాల్సిందేనంటున్న విద్యుత్తురంగ నిపుణులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఎల్‌టీ క్యాటగిరిలో ఫిక్స్‌డ్ చార్జీలు, హెచ్‌టీలో విద్యుత్తు చార్జీల పెంపు, ఇతరత్రా అంశాలపై ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేశాయని సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ వేణుగోపాల్‌రావు పేర్కొన్నారు. గృహజ్యోతి, రెవెన్యూ లోటు, ప్రభుత్వ అనుమతులను సాకుగా చూపుతూ ఏడున్నర నెలల ఆలస్యంగా 18న ప్రతిపాదనలు సమర్పించాయని పేర్కొంటున్నారు. అక్టోబర్ 1లోగా తుది నిర్ణయం తీసుకొని టారిఫ్‌లు నిర్ణయించాలని అభ్యర్థించాయి. డిస్కంల ప్రతిపాదనలపై అక్టోబర్ 20న షెడ్యూల్, 23, 24 తేదీల్లో పబ్లిక్ హియరింగ్ పూర్తిచేయాలని నిర్ణయించింది. నవంబర్ 11న తుది ప్రతిపాదనలు రూపొందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఆరు పిటిషన్లపై విచారణ చేపట్టాల్సి ఉంటుంది. పబ్లిక్ హియరింగ్‌కు కనీసం 15 రోజులు అవసరం. దీని ప్రభావంతో భవిష్యత్తులో విద్యుత్తు వ్యవస్థ అస్తవ్యస్తంగా మారే ప్రమాదం ఉంటుందని వేణుగోపాల్‌రావు చెప్పారు.

బీసీలకు బీఆర్‌ఎస్ బాసట గొప్ప విషయం

- **పదేండ్లలోనే కేసీఆర్ తెలంగాణను తీర్చిదిద్దారు**
- **తమిళ నాడు మాజీ సీఎస్ రామ్మోహన్‌రావు**
- **రిజర్వేషన్ల విధానంపై కేసీఆర్‌కు నివేదిక ఇస్తాం**
- **శాసనమండలిలో విపక్ష నేత మధుసూదనాచారి**



తమిళనాడులో బీసీ రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం కోసం వెళ్లిన బీఆర్‌ఎస్ నేతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : బీసీలు న్యాయం కోసం ఎదురుచూస్తున్న సమయంలో వారికి బీఆర్‌ఎస్ బాసటగా నిలువడం గొప్ప విషయమని తమిళనాడు మాజీ చీఫ్ సెక్రటరీ రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం కోసం వెళ్లిన బీఆర్‌ఎస్ నేతలు శుక్రవారం చెన్నైలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ అనేక ఘనవిజయాలు నమోదు చేసిందని ప్రశంసించారు. కేసీఆర్‌తో తనకున్న వ్యక్తిగత సంబంధాన్ని గుర్తుచేసుకున్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో మాదిరిగానే తెలంగాణలోనూ బీసీలు తమకు దక్కాల్సిన వాటా కోసం పోరాడుతున్నట్టు తెలిపారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో మొదలైన బీసీల హక్కుల పోరాటం సుదీర్ఘకాలం అనేక రూపాల్లో కొనసాగిందని, ప్రజల డిమాండ్లపై తమిళనాడు ప్రభుత్వాలు సామాజిక దృక్పథంతో వ్యవహరించాయని చెప్పారు. తమిళనాడు రాష్ట్ర విద్య, ఉద్యోగాల్లో 69 శాతం రిజర్వేషన్ల అమలు వెనుక సుదీర్ఘ చరిత్ర ఉన్నదని తెలిపారు. తమిళనాడు ప్రజల చైతన్యం, రాజకీయ పార్టీల విధానం, తమిళ ఉద్యమాలు, సాధించిన విజయాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ సాధనతో పాటు స్వల్పకాలంలో స్వరాష్ట్రాన్ని ప్రగతిశీల రాష్ట్రంగా తీర్చిదిద్దిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్.. బీసీల కోసం కూడా అద్భుత విజయాలు సాధించి తీరుతుందనే విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. అనంతరం తమిళనాడు ప్రభుత్వ బీసీ, ఎంబీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి విజయ్‌రాజాకుమార్, కమిషనర్ వెంకటేశ్ తదితర ఉన్నతాధికారులతో బీఆర్‌ఎస్ నేతలు సమావేశమై పలు అంశాలపై అధ్యయనం చేశారు. కేసీఆర్ ఆదేశాల మేరకు తమిళనాడు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం అధ్యయనంలో ఎంతో విలువైన సమాచారం లభించిందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, శాసనమండలిలో విపక్షనేత సిరికొండ మధుసూదనాచారి తెలిపారు. రిజర్వేషన్ల విధానంపై చారిత్రక, సామాజిక, రాజకీయ పరిణామాల నివేదిక రూపొందించి కేసీఆర్‌కు అందజేస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్ రాజ్యసభ పక్ష ఉపనేత వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, జోగు రామన్న, శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర బీసీల హక్కుల సాధన కోసం బీఆర్‌ఎస్ పక్షాన కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో తమిళనాడు రాష్ట్ర బీసీ సంఘాల ప్రతినిధులు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పుట్ట మధు, కోరుకంటి చందర్, భిక్షమయ్యగౌడ్, మాజీ చైర్మన్లు జూలూరు గౌరీశంకర్, ఆంజనేయగౌడ్, పల్లె రవికుమార్, తుల ఉమ, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాగేందర్‌గౌడ్, రవీంద్ర సింగ్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు సుభప్రద పటేల్, కిశోర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు దాసోజు శ్రీనివాస్, చెరుకు సుధాకర్, రాజ్యలక్ష్మి, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, విద్యార్థి సంఘం నేత దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మధుసూదనాచారి నేతృత్వంలోని బృందం ద్రవిడ కళగం పార్టీ కార్యాలయాన్ని సందర్శించింది. ఆ పార్టీ అధ్యక్షుడు వీరమణితో సమావేశమయ్యారు.



నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల

ధాన్యం కొనుగోలు కేంద్రాలేవీ?

- **పంటలన్నీ ప్రభుత్వమే కొనాలి**
- **మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**

వేల్పూర్, సెప్టెంబర్ 27: రైతుల పంటలకు కేంద్ర ప్రభుత్వ కనీస మద్దతు ధరకు అదనంగా కాంగ్రెస్ సర్కారు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. పంట కోతలు ప్రారంభమైనా ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాల జాడే లేదని, దీంతో దళారుల చేతుల్లో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లోని తన నివాసంలో వేముల మీడియాతో మాట్లాడారు. మక్కజొన్న, సోయా పంట కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదన్నారు. మొదట్లో ప్రైవేట్ వ్యాపారులు మక్కలకు రూ.2,600 చెల్లించి కొనుగోలు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు లేక క్వింటాకు రూ.300-400 వరకు నష్టపోతున్నారని చెప్పారు. ఎకరాకు రూ.60 వేల వరకు నష్టంతోపాటు కాంగ్రెస్ చెప్పినట్టు రైతుభరోసా ఇవ్వకపోవడంతో ఎకరాకు రూ.90 వేల దాకా రైతు నష్టపోతున్నట్టు చెప్పారు. మక్కకు కేంద్రం నిర్ణయించిన ఎంఎస్పీ రూ.2,225 కాగా, కాంగ్రెస్ ఇస్తామన్న బోనస్ రూ.500 కలిపి రూ.2,725కు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సోయాబీన్ క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి రూ.5,392 చొప్పున, వరికి అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి రూ.2,800 చొప్పున కొనుగోలు చేయాలని వేముల సూచించారు.

కేఆర్ సురేశ్‌రెడ్డి | దీవకొండ దామోదర్‌రావు | వద్దిరాజు రవిచంద్ర | పార్థసారథిరెడ్డి

పార్లమెంట్ కమిటీల్లో బీఆర్‌ఎస్

- **ప్రజాఫిర్యాదులు, న్యాయ కమిటీలో కేఆర్ సురేశ్‌రెడ్డి**
- **అటవీ పర్యావరణ కమిటీలో దీవకొండ**
- **పెట్రోలియం కమిటీలో వద్దిరాజు**
- **హెల్త్ కమిటీలో పార్థసారథిరెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): 2024-25వ సంవత్సరానికి పార్లమెంట్ స్థాయీ సంఘ సభ్యులుగా బీఆర్‌ఎస్ పార్లమెంటరీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఉపనేత వద్దిరాజు రవిచంద్ర, ఎంపీలు దీవకొండ దామోదర్‌రావు, పార్థసారథిరెడ్డి నియమితులయ్యారు. పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్ స్టాండింగ్ కమిటీలో కేఆర్‌ఎస్ , సైన్స్‌అండ్ టెక్నాలజీ, అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల కమిటీలో దీవకొండ , పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ కమిటీలో రవిచంద్ర, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో పార్థసారథి రెడ్డిలకు అవకాశం లభించింది.

గౌరవ వేతనం ఇంకెప్పుడిస్తరు?

- **ప్రభుత్వంపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం**

హైదరాబాద్, (నమస్తే తెలంగాణ) : పదవీకాలం ముగిసి నెలలు గడుస్తున్నా గౌరవవేతనాలు విడుదల చేయడం లేదని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందరికీ బ్యాంక్ అకౌంట్‌లో జమచేసేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక స్థానిక రెండు నెలల వేతనాలు విడుదల చేయగా, ఐదు నెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయని జడ్పీటీసీల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి తెలిపారు.


గాలి మోటర్లలో వచ్చి గాలి మాటలు

- **జిల్లాల్లో పర్యటిస్తున్న మంత్రుల తీరిది**
- **శ్రీశైలం నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలి**
- **నెల్లికల్ లిఫ్ట్‌తో 25 వేల ఎకరాలకు నీళ్లివ్వాలి**
- **మాజీ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్‌రెడ్డి, భగత్, సురేందర్**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి. చిత్రంలో భగత్, సురేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు మంత్రులు గాలి మోటర్లలో వచ్చి గాలి మాటలు చెప్పి వెళ్తున్నారని మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, నోముల భగత్, జాజాల సురేందర్ విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో వారు మాట్లాడారు. ఈ ప్రభుత్వానికి హనీమూన్ పీరియడ్ అయిపోయిందని, ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని హర్షవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు శ్రీశైలం నిర్వాసితులకు అన్యాయం జరిగిందన్న రేవంత్‌రెడ్డి, ఇప్పటికీ వారికి ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. శ్రీశైలం నిర్వాసితుల్లో 78 మందికి కేసీఆర్ ప్రభుత్వం లష్కర్లుగా శాశ్వత ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఆనాడే 6 వేల మందికి లష్కర్ ఉద్యోగాలు ఇవ్వాలనుకొని అందులో శ్రీశైలం నిర్వాసితులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రతిపాదించారని, దీని కోసం జీవో ఇచ్చారని తెలిపారు. వెంటనే శ్రీశైలం నిర్వాసితుల సమస్యను పరిష్కరించాలని, వారికి ఉద్యోగాలు ఇవ్వాలని హర్షవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మంత్రులు తమ సొంత పనులకే ప్రాధాన్యం ఇస్తున్నారని నోముల భగత్ ధ్వజమెత్తారు. జిల్లాకు హెలికాప్టర్‌లో వస్తున్నారే తప్ప ఏ సమస్యనూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. మిషన్ భగీరథపై మంత్రి కోమటిరెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, ఈ పథకంతో నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య దూరమైందని పార్లమెంట్‌లో కేంద్రమే చెప్పిందని తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో నెల్లికల్ లిఫ్ట్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు వేల ఎకరాలకు నీళ్లిస్తామంటున్నారని, గతంలో కేసీఆర్ 24 వేల ఎకరాలకు నీళ్లివ్వాలని ప్రతిపాదించారని, దానినే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా నాలుగేండ్లు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఎలా భరించాలని ప్రజలు విసిగిపోతున్నారని తెలిపారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ పెద్దలు అబద్ధాలు మాట్లాడుతున్నారని, నిజాలతో కూడిన బుక్‌లెట్‌ను వారికి పోస్టులో పంపుతామని ప్రకటించారు. ఆరు గ్యారెంటీలపై గాలి మాటలు చెప్పి కాంగ్రెస్ నేతలు తప్పించుకుంటున్నారని జాజల సురేందర్ విమర్శించారు. కేసీఆర్‌పై విమర్శలు తప్ప రేవంత్‌రెడ్డి సాధించిందేమీ లేదంటూ ఎద్దేవా చేశారు. సంపూర్ణ రుణమాఫీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



తెలంగాణభవన్‌లో కొండా లక్ష్మణ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేతలు

కడదాకా స్వరాష్ట్రమే బాపూజీ తపన

- **మంత్రి పదవిని వదులుకున్న త్యాగజీవి**
- **కొనియాడిన మాజీ మంత్రి మహమూద్ అలీ**
- **తెలంగాణ భవన్‌లో కొండా లక్ష్మణ్ జయంతి వేడుకలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): జీవితాంతం స్వరాష్ట్ర సాధనే ఎజెండాగా దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ జీవించారని మాజీ హోంశాఖ మంత్రి మహమూద్ అలీ కొనియాడారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళ్లర్పించి, ఆయన సేవలను నాయకులు స్మరించుకున్నారు. తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు చేశారని, మంత్రి పదవిని సైతం వదులుకున్న త్యాగజీవి అని మహమూద్ అలీ పేర్కొన్నారు. రాచరికపు పాలనకు వ్యతిరేకంగా పేదలను కొండా లక్ష్మణ్ బాపూజీ ఏకం చేశారని ఎమ్మెల్సీ ఎల్ రమణ తెలిపారు. బాపూజీ పోరాట పటిమ అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బాపూజీ తొలిసారి ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారని, తన తండ్రి కొండా లక్ష్మణ్ బాపూజీ ఇద్దరూ సమకాలికులని ఎమ్మెల్యే కోవ లక్ష్మి చెప్పారు. మాజీ ఎంపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జాజాల సురేందర్, భగత్, బీఆర్‌ఎస్ నేతలు దేవీప్రసాద్, నగేశ్, రాకేశ్, విప్లవ్‌కుమార్, వాసుదేవరెడ్డి, రాకేశ్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్రచారి, నాయకులు గోవర్ధన్ రెడ్డి, రామ్మూర్తి, నరేందర్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, కడారి స్వామి యాదవ్ పాల్గొన్నారు.




హైడ్రా అధికారుల నోటీసులతో కొత్తపేటలో జరిగిన ఆందోళనలో సొమ్మసిల్లిన జ్యోతిని దవాఖానకు తరలిస్తున్న స్థానికులు



చైతన్యపురిలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేస్తున్న మహేశ్‌ను అడ్డుకుంటున్న స్థానికులు

లోకం పోకడ



హైడ్రా గోబ్యాక్.. సీఎం డౌన్ డౌన్!

మొదటిపేజీ తరువాయి...

నెలకొన్నాయి. ఎక్కడ చూసినా ప్రజల ఆందోళనలు.. హోరెత్తిన నినాదాలతో కాలనీలన్నీ అట్టుడుకిపోయాయి. సర్వే అధికారులపై శుక్రవారం ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్నది. అడుగడుగునా నిరసనలతో సర్వే ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. చైతన్యపురిలో ఓ యువకుడు తన చావే సమస్యకు పరిష్కారమని పెట్రోల్ పోసుకునే ప్రయత్నం చేయడం కాలనీవాసుల మనోవేదనకు ప్రత్యక్ష నిదర్శనంలా చెప్పాలి. పాతనగరంలో మూసీ రివర్‌బెడ్‌లో ఏ కాలనీ చూసినా.. ఏ బస్తీని కదిలించినా ప్రతీ ఒక్కరి నుంచి ఒకటే మాట.. రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్.. హైడ్రా గో బ్యాక్. తమ ప్రాంతంలో అడుగుపెడితే ఖబర్దార్ అంటూ అధికారులకు స్థానికులు హెచ్చరికలు జారీ చేసి సర్వే చేయకుండా తరిమికొట్టారు. హైడ్రా సర్వేకు వ్యతిరేకంగా బాధితులు రోడ్డెక్కారు.

రోడ్లపై బైఠాయింపు.. భారీగా ట్రాఫిక్‌జామ్

మూసీ పరివాహక ప్రాంతంలో అధికారులు చేపట్టిన సర్వే ఉద్రిక్తంగా మారుతోంది. వరుసగా రెండో రోజు ఆందోళనలకు దిగిన స్థానికులు శుక్రవారం నిరసనను తీవ్రతరం చేశారు. వందల మంది రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో పురానాపూల్ నుంచి లంగర్‌హౌజ్ వరకు భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. మరోవైపు లంగర్‌హౌజ్ పిల్లర్ నెంబర్102 వద్ద ఆశంనగర్ కాలనీ, డిఫెన్స్ కాలనీ వాసులు బైఠాయించారు. దీంతో రాజేంద్రనగర్ నుంచి మెహదీపట్నం వైపు పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. బడాబాబులను వదిలేసి సామాన్యుల జోలికి వస్తున్న నువ్వు సర్వనాశనమైపోతవ్ రేవంత్‌రెడ్డి అంటూ శాపనార్థాలు పెట్టారు. ప్రాణాలైనా అర్పిస్తాం కానీ ఇక్కడినుంచి వెళ్లేదేలేదని ఖరాఖండిగా చెప్తున్నారు. ప్రజాపాలన, ఇందిరమ్మపాలన అంటే ఇదేనా అంటూ ప్రశ్నిస్తున్నారు. న్యాయం జరిగేవరకు కదిలేదిలేదని బైఠాయించడంతో పోలీసులు వారిని సముదాయించే ప్రయత్నంచేశారు. హైదరాబాద్ పాతనగరంలోని కిషన్‌బాగ్, అసద్ బాబానగర్, నందిముసలైగూడ మూసీరివర్‌బెడ్‌లోని నివాసితులంతా ర్యాలీగా వచ్చి బహదూర్‌పురా తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తమ ఇళ్లనుకూల్చవద్దని తమకు డబుల్‌బెడ్రూం అవసరం లేదని తేల్చిచెప్పారు.



కొత్తపేటలోని మూసీ పరివాహకంలో కూల్చివేతలకు సంబంధించి ఎఫ్‌టీఎల్ మ్యాప్‌ను చూపుతున్న భూబాధితుడు

యువకుడి ఆత్మహత్యాయత్నం

మూసీ పరివాహకంలో పర్యటిస్తున్న అధికారులకు అడుగడుగునా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మహిళలు అధికసంఖ్యలో వచ్చి అధికారులతో గొడవలకు దిగుతున్నారు. ఆందోళనకారులు అధికారులపై తిరగబడడంతో సర్వేచేయకుండానే వెనుదిరుగుతున్నారు. అత్తాపూర్‌లో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ఆ తర్వాత మార్కింగ్ చేస్తామని చెప్పారు. దీంతో మహిళలంతా ఒక్కసారిగా తిరగబడ్డారు. సర్వే చేయొద్దని రాజేంద్రనగర్ తహసీల్దార్ సిబ్బందిని, మున్సిపల్ అధికారులను మహిళలు హెచ్చరించారు. 'మీ అన్న తిరుపతిరెడ్డి ఇల్లు కూలగొట్టవా.. మా ఇళ్లేమన్నా నీ అయ్య జాగీరా' అని రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. మా ఇళ్లుకూలగొడ్తే మేమెక్కడికి పోవాలని గుండెలవిసేలా రోదించారు. కొత్తపేట, చైతన్యపురిడివిజన్ల పరిధిలోని భవానీనగర్, వినాయక్‌నగర్, ఫణిగిరికాలనీ, సత్యానగర్, న్యూమారుతినగర్ నార్త్ కాలనీలో మూసీ సర్వేకు వచ్చిన అధికారులను స్థానికులు అడ్డగించారు. మా ఇళ్లు కూల్చొద్దు.. మాకు కరెంట్, వాటర్ సప్లై ఉన్నయ్.. అన్నిరకాల రిజిస్ట్రేషన్లు ఉన్నాయ్.. ఇప్పుడెందుకు వచ్చారు అని నిలదీశారు. చైతన్యపురిలో ఓ యువకుడు పెట్రోల్‌పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయడంతో స్థానికులు అడ్డుకున్నారు. 'నా భార్య 9నెలల కడుపుతో ఉంది.. మా ఇల్లు కూలగొడ్తే మేము ఎక్కడకుపోవాలి.. పట్టా భూమిలోనే ఇల్లుకట్టుకున్నాం.. కరెంట్ బిల్లు, ఇంటిపన్ను అన్నీ కడుతున్నం అంటూ తన పత్రాలు చూపిస్తూ ఆ యువకుడు ఏడుస్తుంటే చుట్టుపక్కల వాళ్లు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో ఓ మహిళ స్పృహ తప్పి పడిపోయింది.

ప్రజల తిరుగుబాటు

మూసీ రివర్ బెడ్ ఏరియాలో ఉన్న ఇండ్లపై మార్కింగ్ చేసేందుకు వచ్చిన అధికారులపై ప్రజలు ఒక్కసారిగా తిరగబడ్డారు. మూసీ పరివాహక ప్రాంతానికి సుమారు 100 మీటర్ల ఎత్తులో ఉన్న ఇండ్లను ఖాళీ చేయాలనడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ప్రశ్నించారు. తాము నిర్మించుకున్న ఇండ్ల ఎత్తుకు మూసీ నది నీరు చేరుకున్నట్లయితే దిగువన ఏ గ్రామం మిగలదని.. తమ ఇండ్లను కూల్చి రియల్ ఎస్టేట్ దందా చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని ప్రజలు ఆరోపించారు. ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, వ్యతిరేకత ఎదురవ్వడంతో అధికారులు ఆయా ప్రాంతాలనుంచి వెనుదిరిగారు. లంగర్‌హౌజ్‌లో ఏకంగా అధికారులపైకి దాడికి పాల్పడేయత్నం చేయడంతో అధికారులు భయంతో వెళ్లిపోయారు. న్యూమారుతీనగర్ నార్త్ కాలనీతో పాటు ఇతర ప్రాంతాల్లో అధికారులు వేసిన మార్కింగ్‌లను ప్రజలు తొలగించారు.



హైడ్రా అధికారుల నుంచి నోటీసులు అందుకున్న చైతన్యపురిలోని కొత్తపేటకు చెందిన రాధ కుటుంబం. ఆమెకు ముగ్గురు కూతుళ్లు ఉండడంతో వారి పెండ్లిళ్లు చేసేదెలా అని అధికారులను వేడుకున్నారు. అయినా కనికరించకపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు.



అత్తాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ర్యాలీ నిర్వహించి ధర్నా చేస్తున్న మూసీ నాలా బాధితులు



30 ఏండ్లుగా ఉంటున్నం

30 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నాం. ఇప్పుడు వచ్చి ఇల్లు ఖాళీ చేసి పొమ్మంటే ఎందుకు పోవాలి. తినో, తినకనో ఉంటూ కొనుకున్న ఇల్లు ఇది. కట్టుకున్నప్పుడు ఏం చేశారు. మా జీవితాలతో చెలగాటమాడుతున్నారు. మమ్మల్ని బలవంతంగా పంపాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినందుకు తగిన శాస్తి జరిగింది మాకు.

- కవిత , న్యూమారుతీనగర్, చైతన్యపురి



నట్టేట ముంచుతున్నరు

ఇరవై ఏండ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. ఇద్దరు పిల్లలున్నారు. లోన్ తీసుకుని ఇల్లు కట్టుకున్నాను. ఇప్పుడు మీ ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉంది.. ఖాళీ చేసి వెళ్లమనడం ఎంత వరకు సమంజసం. నా కష్టార్జితమైన ఇంటిని ఎలా వదులుతాం. ప్రజాపాలన అంటూ ప్రజలను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అవుతుంది.

- ఉమా మహేశ్వర్‌రావు, న్యూమారుతీనగర్, చైతన్యపురి



రిజిస్ట్రేషనప్పుడు తెలువదా?

కష్టపడి ఇల్లును కట్టుకున్నాం. ఇంటి రిజిస్ట్రేషన్ చేసేప్పుడు ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని తెలువదా. మా ఇంటికి వంద మీటర్ల దిగువన మూసీ నది ఉంది. ఒక వేళ మా కాలనీలోకి మూసీ నది నీళ్లు వచ్చినట్లయితే దిగువన ఉన్న ఏ గ్రామం మిగులదు. పేదల భూములు గుంజుకుని రియల్ ఎస్టేట్ దందా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చూస్తున్నాడు.

- వెంకటేశ్, న్యూమారుతీనగర్, చైతన్యపురి



ప్రాణం పోయినా కదలం

పూల వ్యాపారంతో కుటుంబాన్ని పోషిస్తున్నాను. నా భార్య నిండు గర్భిణీ. నా చెల్లెండ్లు ఇక్కడే దగ్గర చదువుకుంటున్నారు. అధికారులు ఇప్పుడు వచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తాం.. ఖాళీ చేయమంటే ఎలా? ప్రాణం పోయినా ఇక్కడే ఉంటాం.. ఇల్లు మాత్రం ఖాళీ చేయం.

- మహేశ్, న్యూమారుతీనగర్, చైతన్యపురి



మమ్మల్ని బతుకనివ్వు రేవంత్

ఇవి అక్రమ నిర్మాణాలు కాదు. కబ్జాలూ కావు. పక్కా పట్టాభూములు. మూసీ సుందరీకరిస్తానంటే దానిపై బ్రిడ్జిలు కట్టుకోమను. మా ఇండ్ల జోలికి రావొద్దు. మా బతుకు మమ్మల్ని బతుకనివ్వు రేవంత్‌రెడ్డి..హైదరాబాద్‌లో ఓట్లు పడలేదని ఇలా చేస్తున్నావా? మాకు డబుల్ బెడ్‌రూమ్‌లు వద్దు.

- కుర్మయ్య, మేస్త్రీ, న్యూకమలానగర్,అంబర్‌పేట



ఇదో పెద్ద కుంభకోణం

మూసీ సుందరీకరణ ఒక పెద్ద కుంభకోణం. రేవంత్‌రెడ్డి గరీబోళ్లను రోడ్డున పడేయడానికి చూస్తున్నాడు. సొంతంగా కట్టుకున్న ఇంటిని అక్రమం అంటున్నారు. గరీబోళ్లను ఆగం చేస్తున్నారు. ఇండ్లు కూలుస్తారని భయంతో వణికిపోతున్నారు ఇక్కడి జనాలు. మా పేదల బతుకులను రోడ్లున పడేయొద్దు.

-సంజీవ,తులసీరాంనగర్, గోల్నాక, అంబర్‌పేట

బుల్డోజర్ హెచ్చరిక.. బుచ్చమ్మ లేదిక!

మొదటిపేజీ తరువాయి...

ప్రాణం తీసుకోవడం సంచలనంగా మారింది. హైదరాబాద్ కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనతో విషాదం నిండుకున్నది. కూకట్‌పల్లి రామాలయానికి చెందిన గుర్రంపల్లి శివయ్య, బుచ్చమ్మ దంపతులు కూలిపనులతో జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కూతుళ్లు. ముగ్గురికీ వివాహాలు చేసి కట్నం కింద నల్ల చెరువు వద్ద ఉన్న ఇంటిని ఇచ్చారు. కూల్చివేతల్లో భాగంగా నల్ల చెరువును పరిశీలించిన హైడ్రా అధికారులు ఇండ్లు ఖాళీ చేయాలని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో కూతుళ్లకు ఇచ్చిన ఇల్లు కుల్చివేస్తే బిడ్డలు రోడ్డున పడుతారనే మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో బుచ్చమ్మ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. కుటుంబసభ్యులు దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు కూలుస్తరనే తట్టుకోలేకే..

'మా అమ్మ జీవితాంతం నాన్నతో కలిసి కూలి పనులు చేసి, రూపాయి రూపాయి కూడేసి ఇల్లు కట్టించింది. ఇప్పటికీ రెక్కల కష్టంతోనే బతుకుతున్నరు. ముగ్గురు ఆడపిల్లల పెండి చేసింర్రు. ఇల్లు ముగ్గురికీ కట్నంగా ఇచ్చింర్రు. ఒక్కసారిగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూల్చివేస్తామని అనేసరికి పాణందీసుకున్నది' అని బుచ్చమ్మ కూతుళ్లు, ఇతర కుటుంబ సభ్యులు రోదిస్తూ చెప్పారు. ఆమె ఆత్మహత్య చేసుకునే మనిషి కాదు. చాలా ధైర్యవంతురాలు ఆమె. ఇట్ల చేసుకుంటదని అనుకోలేదు. కొడుకులు లేకున్నా మాకున్న ఇల్లును చూసి పిల్లలు మంచిగ ఉంటారు కదా అనుకుంటూ ఉండేది. కూల్చివేస్తారన్న విషయాన్ని విని ఆమె తట్టుకోలేకపోయింది. మాకు కూడా ఆడపిల్లలే కలిగారు. వారి భవిష్యత్తు కూడా ఈ ఇంటిమీదే ఆధారపడి ఉన్నదన్న బెంగ ఉండేది. ఈ ప్రభుత్వానికి ఏది న్యాయమో అర్థం కావడంలేదు. పేద ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నది' అని ఆవేదన వ్యక్తం చేశారు. బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నదన్న సమాచారంతో బంధువులు, స్థానికుల రోదనలు మిన్నంటాయి. భర్త, కూతుళ్లను ఓదార్చే ప్రయత్నం చేశారు. ఎన్నో ఆశలతో సొంతంగా కష్టపడి కట్టుకున్న ఇంటిని ఒక్కసారిగా ప్రభుత్వం కూల్చివేస్తుందన్న భయమే ఆమెను వెంటాడి ఈ స్థితికి చేర్చిందని స్థానికులు వాపోయారు.



కూకట్‌పల్లి రామాలయం సమీపంలోని యాదవ బస్తీలో రోదిస్తున్న గుర్రంపల్లి బుచ్చమ్మ కుటుంబ సభ్యులు



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని సాకి చెరువు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు

పటాన్‌చెరులో హైడ్రా యాక్షన్

సాకి చెరువు ఎఫ్టీఎల్‌లో నిర్మాణాల గుర్తింపు • 18 ఇండ్ల యజమానులకు నోటీసులు

ఇండ్లపై రెడ్ మార్కింగ్ వేసిన అధికారులు • భయంతో వణికిపోతున్న బాధితులు

పటాన్‌చెరు, సెప్టెంబర్ 27: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో హైడ్రా యాక్షన్ ఉండబోతుందా? ఈ ఆదివారం అదే ప్రత్యేకం కావచ్చా? అంటే అవుననే సంకేతాలు పటాన్‌చెరు సాకీ చెరువు వద్ద వినిపిస్తున్నాయి. శుక్రవారం హైడ్రా అధికారుల బృందం వచ్చి సాకి చెరువు ఎఫ్టీఎల్‌లో నిర్మించినట్టు గుర్తించిన భవనాలకు ఎర్ర సిరా మార్క్ వేసింది. దీంతో ఆ భవన యజమానుల గుండెల్లో గుబులు రేకెత్తిస్తున్నది. హైడ్రా ఆదేశాలతో జీహెచ్‌ఎంసీ పటాన్‌చెరు సిబ్బంది.. ఇండ్ల యజమానులకు శుక్రవారం నోటీసులను అందజేశారు. దీంతో వారంతా హడావుడిగా ప్రముఖ నేతలను కలిసి కాపాడాలని విన్నవించుకుంటున్నారు. 2021లో అధికారులు సాకీ చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న అక్రమ నిర్మాణాలను సర్వే చేసి గుర్తించారు. 18 అక్రమ నిర్మాణాలు చెరువులో ఉన్నాయంటూ నోటీసులు ఇచ్చారు. ఆగస్టు 31న హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా పటాన్‌చెరుకు వచ్చి సాకి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన చెరువు ఎఫ్టీఎల్‌లో, బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాల గురించి అధికారుల వద్ద వివరాల తీసుకున్నారు. కొన్ని నిర్మాణాలపై కోర్టు కేసులు ఉన్నాయని అధికారులు, స్థానికులు తెలపడంతో వాటి వివరాలు సేకరించి వెళ్లిపోయారు.

ఆరుగురికి హైకోర్టు ఆర్డర్?



గతంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై విభాగం సైతం సాకి చెరువులోని ఆక్రమణలను తొలిగించాలని జీహెచ్‌ఎంసీని ఆదేశించింది. దానిపై చర్యలకు ఆనాటి అధికారులు వెనుకాడారు. ఇప్పుడు హైడ్రా యాక్టివ్‌గా చెరువుల్లో ఆక్రమణలు తొలిగిస్తుండటంతో ఆరుగురు హైకోర్టు నుంచి కూల్చివేతలను నిలిపివేసేందుకు ఆర్డర్ తెచ్చుకున్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. అటు జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్, ఇటు పటాన్‌చెరు తహసీల్దార్ తమకు కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ రాలేదని స్పష్టం చేశారు. కోర్టు ఆర్డర్లలో ఏమున్నది? ఎంతవరకు ఆ ఆర్డర్లు హైడ్రా చర్యలను నిలువరించగలవు అనేది ఆసక్తికరంగా మారింది.

కేసులు పెడ్తం.. లోపలేస్తం

స్థానికులకు పోలీసుల బెదిరింపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): మూసీ రివర్‌బెడ్‌పై సర్వేకు వచ్చిన అధికారులకు స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దీంతో పోలీసు భద్రతతో అధికారులు సర్వే చేస్తున్నారు. ఈ సమయంలో ఆందోళన చేస్తున్న స్థానికులను పోలీసులు బెదిరిస్తున్నారు. బలవంతంగా పక్కకు తీసుకెళ్లి .. మీరు పక్కకు తప్పుకోకపోతే అరెస్టులు తప్పవు.. కేసులుంటాయి... జైళ్లలో పడేస్తం.. కోర్టుల చుట్టూ తిరగాలి.. అంటూ బెదిరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎవరైతే స్థానిక ఆందోళనకు నాయకత్వం వహిస్తున్నారో వారికి ప్రత్యక్షంగా పరోక్షంగా కూడా బెదిరింపులు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వంతో పెట్టుకుంటే లోపలికి పోవాలంటున్న అధికారులకు ప్రజలే గట్టిగా సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తున్నా.. పోలీసుల జులుం ముందు అది పనిచేయడం లేదు. తమ ప్రశ్నలకు సమాధానాలివ్వాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను స్థానికులు అడుగుతుంటే అడుగడుగునా పోలీసులే అడ్డుపడుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ లేదని.. ఇపుడు అంతా పోలీస్ రాజ్యమేనని వారు మండిపడుతున్నారు.

నేడు, రేపు కూల్చివేతలు

బుల్డోజర్ టీమ్‌లకు అర్ధరాత్రి సందేశాలు

అధికారులతో హైడ్రా అత్యవసర సమావేశం

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): ఒకవైపు మార్కింగులపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంటుంటే.. మరోవైపు మూసీ పరివాహక ప్రాంతాలపై హైడ్రా కత్తులు నూరుతున్నది. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో శుక్రవారం ఇంజినీరింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖలతో పాటు నేషనల్‌ఏజెన్సీల ప్రతినిధులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ అంతర్గతంగా అత్యవసరంగా సమావేశమయ్యారు. మూసీ పరివాహక ప్రాంతాలలో హైడ్రా కూల్చివేతలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకున్నది. శని, ఆదివారాల్లో 14టీమ్‌లతో కూల్చివేతలకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా కూల్చివేతలకు కొన్ని కీలక అంశాలు సమావేశంలో చర్చించినట్టు తెలిసింది. మూసీ రివర్‌బెడ్‌లోని పలు కాలనీల్లో సర్వే మార్కింగ్ వెంటవెంటనే చేసి ఆ తర్వాత వనస్థలిపురంలో కొందరిని డబుల్‌బెడ్రూం ఇళ్లలోకి తరలింపు వంటివి తూతూమంత్రంగా చేపట్టారు. శనిఆదివారాల్లో ఎవరూ కోర్టుకు వెళ్లకుండా పూర్తి పకడ్బందీ ప్రణాళికతో భారీ పోలీసు బందోబస్తుతో కూల్చివేతలకు బుల్డోజర్లు సిద్ధం చేశారు. శుక్రవారం మధ్యాహ్నమే టీమ్స్ అన్నింటినీ సిద్ధం చేసి కూల్చివేసే ఏరియాలు మాత్రం అర్ధరాత్రి వారి పర్సనల్ వాట్సప్ గ్రూప్‌లో పంపిస్తామని చెప్పినట్టు తెలిసింది. సమావేశంలో ఎఫ్‌టీఎల్ పరిధికి సంబంధించి చర్చించినా.. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల వద్ద ఉన్న మ్యాప్‌ల్లో చాలా తేడాలుండడం సమస్యలు తెచ్చిపెడుతుందని కమిషనర్ అన్నట్టు తెలిసింది.

సర్కారుది 'హైడ్రా'మా

హామీల నుంచి దృష్టి మరల్చేందుకే కూల్చివేతలు

బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం అలవికాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు హైడ్రా పేరిట డ్రామాలకు తెరలేపిందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పేరుతో పేదల ఇండ్లు, గుడిసెలను కూల్చుతున్న సర్కారుకు.. పెద్దల ఇండ్లు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. మూసీ బెల్ట్‌లో ఇండ్లను కూల్చివేసేందుకు హైడ్రా అధికారులు నోటీసులు జారీ చేయగా, ధర్నాకు దిగిన బాధితులను బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం పరామర్శించారు. అనంతరం మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూసీ ఒడ్డున ఎఫ్‌టీఎల్ అని తెలియక ఎంతోమంది పేదలు అక్కడ స్థలాలను కొనుక్కొని ఇండ్లు కట్టుకున్నారని, ఇప్పుడు వాటిని కూల్చివేయడం ఎంతవరకు కరెక్ట్ అని మండిపడ్డారు. సీఎం సోదరుడి ఇంటిని ఎందుకు కూల్చడం లేదని నిలదీశారు. కూల్చివేతలను ఆపకపోతే బీజేపీ తరపున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దుపై హైకోర్టులో విచారణ

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 పోస్టుల భర్తీ నిమిత్తం 2022 నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీపై హైకోర్టులో దాఖలైన పిటిషన్లపై జస్టిస్ కార్తీక్ శుక్రవారం విచారణ ప్రారంభించారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది జొన్నలగడ్డ సుధీర్ వాదనలు వినిపిస్తూ.. 503 పోస్టుల భర్తీ కోసం 2022లో నోటిఫికేషన్ జారీ అయినప్పటికీ వివిధ కారణాలతో పరీక్ష రద్దయిందని తెలిపారు. ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో 60 పోస్టులను కలిపి కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేయడం చెల్లదన్నారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ.. టీజీపీఎస్సీ రాజ్యాంగబద్ధమైన సంస్థ అని, పరీక్షను రద్దుచేసి తాజాగా నోటిఫికేషన్ జారీచేసే అధికారం టీజీపీఎస్సీకి ఉంటుందని చెప్పారు. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు ప్రకటించింది.



సర్వేను నిలిపివేయాలని సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

50 ఏండ్లుగా ఇక్కడే బతుకుతున్నం

హైడ్రా సర్వేను నిలిపివేయాలి

ఇండ్లను కూల్చే కుట్రలను ఆపండి..

సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట బాధితుల ఆందోళన

సూర్యాపేట, సెప్టెంబర్ 27: 'యాభై ఏండ్లుగా ఇక్కడే బతుకుతున్నం.. మా బతుకులు ఆగం చేయకండి' అంటూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వివిధ కాలనీలవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇండ్ల వద్ద సర్వేను నిలిపేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పేరుతో పేదలం నిర్మించుకున్న ఇండ్లను కూల్చివేసే కుట్రలను ఆపాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని 30, 42, 43వ వార్డుల్లోని వివిధ కాలనీల్లో 50 ఏండ్లుగా సద్దుల చెరువు పక్కన ఇండ్లు కట్టుకొని జీవిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు తీసుకొని ఇండ్లు కట్టుకుంటే, ఇప్పుడు వాటిని కూల్చివేసే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సద్దుల చెరువు పక్కన మూడు ప్రభుత్వ పాఠశాలలు, పార్కు, కమ్యూనిటీ హాల్, వసతి గృహాలు ఉన్నాయని, వాటినెలా నిర్మించారని ప్రశ్నించారు. అనుమతులు ఇచ్చేది ప్రభుత్వమే, కూల్చివేసేది ప్రభుత్వమేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సర్వేతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, వెంటనే సర్వేను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అంగిరేకుల రాజశ్రీనాగార్జున, పల్స మహాలక్ష్మిమల్సూర్, కోఆప్షన్ సభ్యురాలు బత్తుల ఝాన్సీరమేశ్, మీర్ అక్బర్, గాలి సాయికుమార్, కట్టు శంకర్, చంచల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అధికారులకు దండం పెట్టి వేడుకుంటున్న వేములవాడ గుడి చెరువు వద్ద నివాసి దేవమ్మ

అయ్యా.. మా ఇండ్లు కూలగొట్టొద్దు!

వేములవాడ గుడి చెరువు నివాసితుల వినతి

విప్ ఆది శ్రీనివాస్‌కు చేతులెత్తి మొక్కిన బాధితులు

వేములవాడ, సెప్టెంబర్ 27: 'అయ్యా మా ఇండ్లను కూలగొట్టొద్దు.. పడగొట్టకుండా చూడండి' అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని గుడి చెరువు వద్ద నివాసితులు శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. ఇటీవల గుడి చెరువు వద్ద అధికారులు సర్వే చేసి, ఎఫ్టీఎల్‌లో నివాసాలు ఉన్నట్టుగా గుర్తించారు. దీంతో ఆందోళన చెందిన అక్కడి ప్రజలు శుక్రవారం వేములవాడ సహకార సంఘం వద్ద ఆది శ్రీనివాస్‌ను కలిశారు. తాము ఎన్నో ఏండ్ల కింద అనుమతులు తీసుకొని ఇండ్లు కట్టుకున్నామని తెలిపారు. సర్వేతో భయమవుతుందని, ఎలాగైనా మీరే కాపాడాలని చేతులెత్తి మొక్కుతూ వేడుకున్నారు. నివాసాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూసే బాధ్యత తనదేనని ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ వారికి హామీ ఇచ్చారు. అక్కడే ఆర్డీవో రాజేశ్వర్ కూడా ఉండటం గమనార్హం.

పేదల ఇండ్లను కూల్చితే అగ్నిగుండమే

- విశ్వనగరాన్ని వల్లకాడుగా మారుస్తున్న సీఎం రేవంత్
- మూసీపై సంపూర్ణ ప్రజాభిప్రాయం సేకరించాలి
- మూసీ వెంట బడా రియల్ సంస్థలకు ఇచ్చిన నిర్మాణ అనుమతులన్నీ రద్దుచేయాలి
- 58 కిమీ పనులకు 1.5 లక్షల కోట్లా?
- నీళ్లు లేని నదిలో రివర్‌ఫ్రంట్ పెడతారా?
- సుందరీకరణ పేరుతో భారీ దందా
- మూసి బాధితులకు అండగా కేసీఆర్
- బీఆర్ఎస్ నేత పీ కార్తీక్‌రెడ్డి



తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చితే హైదరాబాద్ అగ్నిగుండంగా మారుతుందని బీఆర్ఎస్ నాయకుడు పీ కార్తీక్‌రెడ్డి హెచ్చరించారు. మూసీ ప్రాజెక్టుపై సంపూర్ణ ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని, నిర్వాసితుల ఆమోదంతోనే సుందరీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మూసీ వెంట బడా సంస్థలు చేపడుతున్న భారీ రియల్‌ఎస్టేట్ ప్రాజెక్టుల అనుమతులన్నీ రద్దు చేయాలని కోరారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ను వల్లకాడుగా మార్చారని విమర్శించారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ఇండ్లను హైడ్రా, మూసీ పేరుతో కూల్చివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. చేతులు తడిపిన వారి జోలికి ప్రభుత్వం వెళ్లడం లేదని, పేద, మధ్య తరగతి ఇండ్లనే కూల్చేస్తున్నారని ఆరోపించారు. మూసీ సుందరీకరణ పేరిట దందా నడుస్తున్నదని ఆరోపించారు. బాధితులకు కేసీఆర్ అండగా ఉంటారని, ప్రజల తరఫున మహాశక్తిలా నిలబడి పోరాడతారని చెప్పారు. ఎవరు బెదిరించినా బీఆర్ఎస్ కార్యాలయానికి ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తామని తెలిపారు. మూసీ బాధితులను కూడగట్టి బడా రియల్‌ఎస్టేట్ నిర్మాణ సంస్థల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ప్రాధాన్యాలు నిర్ణయించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రాన్ని ఎటువైపు తీసుకెళ్తున్నారో పాలకులకు అర్థం కావడం లేదని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ సంతోషంగా, ఆర్థిక పరిపుష్టితో ఉండేదని, ఇప్పుడు అన్ని వ్యవస్థలూ కుప్పకూలాయని మండిపడ్డారు. హైడ్రా పేరిట ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, రైతులను మళ్లీ అడుక్కునే స్థితికి తీసుకొస్తున్నారని విమర్శించారు. తినడానికి చద్దన్నం లేదు కానీ బిర్యానీ తినిపిస్తా అన్నట్టుగా రేవంత్ వ్యవహారం ఉన్నదని ఎద్దేవా చేశారు.

లక్షన్నర కోట్ల అంచనా ఎక్కడిది?

మూసీ సుందరీకరణకు బీఆర్ఎస్ హయాంలో రూ.16 వేల కోట్లతో డీపీఆర్ తయారైందని, ఇప్పుడు రూ.1.5 లక్షల కోట్ల అంచనా ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని కార్తీక్‌రెడ్డి నిలదీశారు. 2,400 కిలోమీటర్లు ఉండే నమామి గంగ ప్రాజెక్టుకే రూ.40 వేల కోట్లు ఖర్చు కాలేదని, 58 కిలోమీటర్లలో ఉన్న మూసీ సుందరీకరణకు లక్షా యాభై వేల కోట్లా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కూడా లక్ష కోట్లు ఖర్చు కాలేదని గుర్తుచేశారు. మూసీ మీద లక్షన్నర కోట్లు ఖర్చు పెడితే తిరిగి రాబడి ఎలా వస్తుందని, నీళ్లే లేని నదిలో రివర్‌ఫ్రంట్ పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. మూసీలో సెప్టెంబర్, అక్టోబర్‌లో తప్ప నీళ్లు ఎప్పుడూ ప్రవహించవని చెప్పారు. అసలు మూసీకి గరిష్ఠ ప్రవాహ స్థాయి లెక్కలున్నాయా? ఉంటే వాటిని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ముందు రివర్‌బెడ్, మ్యాగ్జిమమ్ ఫ్లడ్‌లెవల్ (ఎంఎఫ్ఎల్)ను నిర్ణయించాలని సూచించారు. ప్రజలకు మూసీ రివర్ ఫ్రంట్ మీద ఆసక్తి లేదని పేర్కొన్నారు. రూ.1,500 కోట్లతో మూసీకి డీపీఆర్ తయారుచేస్తారా? అని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఎవరికి టెండర్లు ఇవ్వాలో రేవంత్ ప్రభుత్వం ముందే నిర్ణయించుకున్నదని ఆరోపించారు. మూసీ పనులను బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న మెయిన్ హార్ట్ కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు.

మూసీ కార్పొరేషన్‌కు 50 వేల కోట్లు జమచేయాలి

మూసీ కార్పొరేషన్‌కు ముందుగా రూ.50 వేల కోట్లు జమ చేసి నిర్వాసితులకు భరోసా ఇవ్వాలని కార్తీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒకవైపు రాష్ట్రం దివాలా తీసిందని, వేతనాలకు కూడా డబ్బులు లేవని చెప్తూ.. మరోవైపు 1.5 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ ఎలా చేపడుతున్నారని నిలదీశారు. హైడ్రాతో అటెన్షన్ డైవర్షన్, మూసీతో ఫండ్ డైవర్షన్ జరుగుతున్నదని ఆరోపించారు. ప్రభుత్వాన్ని కేసీఆర్ ప్రజల పట్ల ప్రేమతో నడిపితే, రేవంత్‌రెడ్డి మాత్రం భయపెట్టి నడుపుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్ సర్కార్ మీద ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గజ్జెల నగేశ్, చిరుమళ్ల రాకేశ్‌కుమార్, వై సతీశ్‌రెడ్డి, బీఆర్ఎస్వీ నేత చటారి దశరథ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ స్థానికుల నిరసన

ఖానాపూర్‌లో కూల్చివేతలకు కసరత్తు

చెరువు పరిసరాల్లోని ఇండ్లకు మార్కింగ్

అధికారులను అడ్డుకున్న స్థానికులు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో పేదల ఇండ్ల కూల్చివేతకు కాంగ్రెస్ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ చెరువు పరిసర ప్రాంతాల్లోని ఇండ్లను శుక్రవారం రెవెన్యూ, మున్సిపాలిటీ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. పలు ఇండ్లు ఎఫ్టీఎల్‌లో ఉన్నాయని కొలతలు తీస్తూ నంబర్లు వేశారు. స్థానికులు తమ ఇండ్లను మార్కింగ్ చేయవద్దని అధికారులు, సిబ్బందిని అడ్డుకున్నారు. ఎన్నో ఏండ్లుగా నివాసం ఉంటున్నాం.. మున్సిపల్ పర్మిషన్, ట్యాక్స్, కరెంటు బిల్లులు, ఆధార్‌కార్డులు ఉన్నాయని అధికారులు, సిబ్బందిని నిలదీశారు. గుడిసెలు, రేకుల ఇండ్లను కూల్చి వేయాలని చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి తమ ఉసురుతగులుతుందని మహిళలు శాపనార్థాలు పెట్టారు.

హైడ్రా డ్యామేజీకి కంట్రోల్ టీమ్!

- రేవంత్ సర్కార్ మరో కొత్త నాటకం
- రంగంలోకి కాంగ్రెస్ సోషల్ మీడియా టీం
- కూల్చివేతలతో ఇబ్బందులేవనేలా వీడియోలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): 'మూసీ పరివాహక ప్రాంతాల కన్నీటి వ్యథ ఎవరికీ చేరొద్దు.. గూడు చెదిరిందని ఏడవొద్దు.. రోడ్డున పడ్డామని బాధపడొద్దు.. బాధితుల కష్టాన్ని నొక్కిపెట్టాలి. అందుకోసం మూసీవాసులకు ఇబ్బందులే లేవనేలా.. ప్రజలంతా కూల్చివేతలను హర్షిస్తున్నారనేలా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలి. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను నియంత్రించాలి.' ఇప్పుడు ఇదే లక్ష్యంతో రేవంత్ సర్కార్ మరో డ్రామాకు తెరతీసింది. మూసీ నిర్వాసితుల ఆర్తనాదాలను తుడిచిపెట్టడానికి సోషల్ మీడియా వేదికల ద్వారా రంగంలోకి దిగింది. అందుకోసం రూ.కోట్లు ఖర్చు చేయడానికి సమాయత్తమైంది. ఇప్పటికే మైండ్‌స్పేస్ వద్ద కార్యాలయం ఏర్పాటు చేశారు. ఫేక్ వీడియోలు చేసి ప్రచారం చేయడానికి 300 మందిని రిక్రూట్ చేసుకున్నారు. వీరికి ఒక్కొక్కరికి 45 వేల నుంచి 80 వేల వరకు జీతం ఇస్తున్నారని సమాచారం.

డ్యామేజీ కంట్రోల్..!

మూసీ కూల్చివేతల ప్రక్రియ రోజురోజుకు ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటుంది. అభాగ్యుల ఇండ్లను కూల్చడంపై సమస్త సమాజం వ్యతిరేకిస్తున్నది. శత్రుదేశంపై దాడి చేసినట్టుగా కూల్చివేయడంపై జాతీయస్థాయిలో రేవంత్ సర్కార్ విమర్శలు ఎదుర్కొంటున్నది. రాజకీయ పార్టీలు కూడా మూసీ ఇండ్ల మార్కింగ్‌ను తప్పుపడుతున్నాయి. సామాజికవేత్తలు, నిపుణులు వ్యతిరేకిస్తున్నారు. వందల ఎకరాల్లో కబ్జా పెట్టిన భవంతులను వదిలేసి పేదోళ్ల ఇండ్లపైకి బుల్డోజర్లు పంపడం ఏమిటని మేధావులు ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్‌లో రేవంత్ సర్కార్ కూల్చుతున్న ఇండ్లకు సబంధించిన ఆర్తనాదాల వీడియోలు ప్రపంచదేశాల్లో ఉన్న తెలుగు వాళ్లందరికీ చేరుతున్నాయి. ఎన్ఆర్ఐల నుంచి తీవ్రంగా విమర్శలు వస్తున్నాయి. రేవంత్ సీఎంగా పనికిరాడు.. పాలించడం తెలియడం లేదని భావిస్తున్నారు. ఈ పరిస్థితులు సీఎం రేవంత్‌రెడ్డిని కంటి మీద కునుకు లేకుండా చేశాయి. సొంత పార్టీలోనూ వ్యతిరేకత వస్తుంది. మూసీ ఇండ్ల జోలికి వెళ్లి ఉండకపోయుంటే బాగుండేదని సన్నిహితులు సైతం చర్చించినట్టు సమాచారం. ఇలాంటి స్థితిలో రేవంత్ రెడ్డి ఆ వ్యతిరేకతను తగ్గించడానికి సోషల్ మీడియా టీంలను రంగంలోకి దించినట్టు తెలుస్తోంది. హైడ్రా కూల్చివేతలు సబబే అనేల వీడియోలు చేయించేలా ప్రణాళికలు చేస్తున్నారు. బాధితుల్లో ఉబికి వస్తున్న కన్నీటికి ఎన్ని సోషల్ మీడియా అకౌంట్లు అడ్డుకోలేవని రేవంత్ టీమ్ తెలుసుకోవాల్సి ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

అర్ధరాత్రి బస్తీల్లో గస్తీ

- వెంటాడుతున్న కూల్చివేతల భయం
- రాత్రుళ్లు స్థానికుల కాపలా
- శత్రుదేశంపై దాడుల్లా సీఎం కక్ష
- కూల్చివేతలను అడ్డుకుంటాం
- బాధితుల హెచ్చరిక



ఎప్పుడు, ఎట్లా కూల్చివేతలు ప్రారంభమవుతాయోనన్న భయంతో అర్ధరాత్రివేళ గస్తీ నిర్వహిస్తున్న 'ఆపరేషన్ మూసీ' బాధితులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): క్షణ క్షణం..భయం భయం.. మూసీ నిర్వాసితులు బస్తీల్లో అర్ధరాత్రి గస్తీకాస్తున్నారు. ఎటు నుంచి బుల్డోజర్లు వచ్చి తమ గూడుపైకి దూసుకొస్తాయో తెలియక హైరానా పడుతున్నారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు.. రెండు రోజుల నుంచి కంటి మీద కునుకులేకుండా రాత్రుల్లో తమ ఇండ్లకు రక్షణగా నిలుస్తున్నారు. కార్వాన్, బహదూర్‌పుర పరిసర ప్రాంత ప్రజలు బృందాలుగా ఏర్పడి హైడ్రాను అడ్డుకోవడంపై చర్చోపచర్చలు చేస్తున్నారు. హైడ్రా బుల్డోజర్లు తెల్లవారుజాము కూల్చివేతలు ప్రారంభిస్తుందని సోషల్ మీడియాలో వార్తలు వస్తుండటంతో వాళ్లంతా నిద్దురపోకుండా అడ్డుకోవడానికి సిద్ధమయ్యారు. ఇటువంటి దుస్థితి వస్తుందని తామెప్పుడూ ఊహించలేదని బాధితులు విస్మయం చెందుతున్నారు. శత్రుదేశాలపై యుద్ధం చేస్తున్నట్టుగానే రేవంత్ ప్రభుత్వం మా బతుకులపై దాడులు చేస్తుందని రహీం అనే స్థానికుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. చార్మినార్, అంబర్‌పేట్, కొత్తపేట, లంగర్‌హౌజ్ తదితర అన్నీ ప్రాంతాల్లో రాత్రి గస్తీ కాస్తూ తమ గూడు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. కూల్చివేతలను అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు.



మాపై ఎందుకంత కక్ష

మేం శత్రుదేశాలకు చెందినోళ్లం కాదు. మాపై అంత కక్ష ఎందుకు. మేం ఏం తప్పు చేశాం. మా ఇంట్లో పిల్లలు ఇల్లు ఎందుకు కూల్చేస్తారని అడుగుతున్నారు. బుల్డోజర్లు ఇండ్లను కూల్చేస్తాయని నెల రోజుల నుంచి నిద్దుర పోవడం లేదు. మా ఉసురు రేవంత్ సర్కార్‌కు తగులుద్ది.

– మల్లేశ్, అంబర్‌పేట

ప్రాణాలను లెక్క చేయం



హైడ్రా పేరు తలచుకుంటేనే భయం వేస్తోంది. ప్రజా పాలన అని చెప్పే సీఎం రేవంత్‌రెడ్డి పేదల మీదకు హైడ్రాను ఉసిగొల్పడం దారుణం. పేదల ఉసురు ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి తగుతుంది. మా ఇళ్లను కాపాడుకోవడానికి ప్రాణాలను లెక్క చేయం.

– అపర్ణ, తులసీరాంనగర్, అంబర్‌పేట

హైడ్రాను అడ్డుకుంటాం..



పిల్లాజెల్లా అంతా భయపడుతున్నారు. ఎవ్వరూ నిద్దరపోవడం లేదు. ఇన్నేండ్లు ఇక్కడే బతుకుతున్నాం. ఉన్న పళంగా వెళ్లిపొమ్మంటే ఎలా ? ఈ రాత్రుల్లో మాకు ఈ శిక్ష ఏందీ? హైడ్రా బుల్డోజర్లు వచ్చినా.. పోలీసులొచ్చినా భయపడం. ప్రాణం పోయినా సరే వాటిని అడ్డుకుంటాం. మా ఇండ్లను కూల్చనివ్వం.

– ప్రసాద్, గోల్నాక, అంబర్‌పేట

డబుల్ ఇండ్లు వాళ్లకు ఎట్లిస్తరు?

- స్థానికేతరులకు కేటాయింపుపై జియాగూడ ఆగ్రహం
- అధికారుల వివరణతో శాంతించిన స్థానికులు

కార్వాన్, సెప్టెంబర్ 27: జియాగూడలోని డబుల్ బెడ్‌రూం ఇండ్లను స్థానికేతరులకు కేటాయించవద్దంటూ ఆ ప్రాంతవాసులు ఆందోళనకు దిగారు. దీంతో జియాగూడలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద శుక్రవారం రాత్రి ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. అయితే పోలీసులు, రెవెన్యూ అధికారులు వారికి నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ప్రభుత్వం చేపట్టిన కూల్చివేతల్లో భాగంగా జుమ్మేరాత్ బజార్ ఉప్పలమ్మ ఆలయం సమీపంలో నివసిస్తున్న 16 కుటుంబాలను నోటీసులిచ్చి ఖాళీ చేయించారు. వారికి జియాగూడలోని డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించారు. దీంతో వారంతా శుక్రవారం రాత్రి తమ సామాన్లతో జియాగూడకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకొని వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ కలెక్టర్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, స్థానిక కార్పొరేటర్ దర్శన్ అక్కడికి చేరుకున్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లను తమ ప్రాంతం వారికే కేటాయించాలంటూ గత నాలుగేండ్లుగా ప్రభుత్వంతో పోరాడుతున్నామని, ఇప్పుడు అకస్మాత్తుగా బయటివారికి ఎలా కేటాయిస్తారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ ప్రాంతంలో కూడా సర్వే చేస్తున్నారని ఇక్కడ ఇండ్లు కోల్పోయేవారికి ఇక్కడే కేటాయించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఖాళీగా ఉన్న ఇండ్లను జియాగూడలోని పేద ప్రజలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు మాట్లాడుతూ.. కేవలం 16 మందికే పట్టాలు ఇచ్చామని, ఇకముందు స్థానికులకే ప్రాధాన్యం ఇస్తామని తెలపడంతో సమస్య సద్దుమణిగింది. ఈ పట్టాలు అందుకున్న 16 మందిలో 11 కుటుంబాలు మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇండ్లలోకి ప్రవేశించాయి. మిగతా ఐదు కుటుంబాలవారు సరైన పత్రాలు తేలకపోవడంతో వారికి కొంత సమయమిచ్చారు.

హైడ్రా.. అంత దూకుడెందుకు?

మొదటిపేజీ తరువాయి...

నోటీసు ఇచ్చి రేపు కూల్చేస్తారా? ఒక్క రోజు కూడా ఆగలేకపోతున్నారా? శనివారం నోటీసు ఇచ్చి ఆదివారం కూల్చేస్తారా? ఆ తర్వాత కోర్టు పనిదినం వచ్చే వరకైనా ఆగలేరా? ఆగమేఘాల మీద కూల్చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? బాధితులకు గడువు ఎందుకు ఇవ్వడం లేదు? ఇంత దూకుడుగా వ్యవహరించడానికి కారణం ఏమిటి?' అని నిప్పులు చెరుగుతూ పలు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. హైడ్రా కేవలం నోడల్ ఏజెన్సీ మాత్రమేనని పేర్కొంటూ.. దానికి ఉన్న చట్టబద్ధత ఏమిటో చెప్పాలని నిలదీసింది. దీనిపై గతంలోనే వివరణ కోరామని, ఇప్పుడు మళ్లీ కోరుతున్నామని స్పష్టం చేసింది. తమ ప్రశ్నలపై వివరణ ఇచ్చేందుకు హైడ్రా కమిషనర్‌తోపాటు సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండల తాసిల్దార్ వ్యక్తిగతంగా లేదా ఆన్‌లైన్‌లో విచారణకు హాజరు కావాలని పేర్కొంటూ.. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. అమీన్‌పూర్ సర్వే నంబర్ 164లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను 48 గంటల్లో తొలగించాలంటూ ఈ నెల 20న తాసిల్దార్ జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ డాక్టర్ మహమ్మద్ రఫీ, గణేశ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిలోని శ్రీకృష్ణనగర్‌లో రఫీ, గణేశ్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు సంబంధించిన ఆస్పత్రి భవనానికి సంబంధించి సెప్టెంబర్ 5న జారీచేసిన ఉత్తర్వులను తాసిల్దార్, హైడ్రా కమిషనర్ ఉల్లంఘించారని, కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా కూల్చివేత చర్యలు చేపట్టారని తీవ్రంగా తప్పుపట్టారు.

నోటీసులిచ్చిన మరుసటి రోజే కూల్చివేతలు

పిటిషనర్ తరఫు న్యాయవాది నరేందర్‌రెడ్డి వాదిస్తూ.. అమీన్‌పూర్ తాసిల్దార్ ఈ నెల 20తో ఉన్న నోటీసులను 21న సాయంత్రం 6.30 గంటలకు అందజేశారని, ఆ మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు జేసీబీలు, బుల్డోజర్లు, 50 మంది సిబ్బందితో హైడ్రా వచ్చి 5 అంతస్తుల దవాఖాన భవనాన్ని కూల్చేసిందని తెలిపారు. 165, 166 సర్వే నంబర్లలో రఫీకి చెందిన 270 గజాల స్థలాన్ని గణేశ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు విక్రయించడంతో ఆ స్థలంలో నిర్మాణాల కోసం గ్రామ పంచాయతీ నుంచి 2022 నవంబర్ 10న అనుమతులు తీసుకున్నారని వివరించారు. పంచాయతీ నుంచి అనుమతులు ఉన్నందున ఈ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోవడం లేదని అప్పట్లో పంచాయతీ తరఫు న్యాయవాది చెప్పడంతో ఆ పిటిషన్‌పై హైకోర్టు విచారణను మూసేసిందని గుర్తుచేశారు. ఇటీవల ఆ స్థలంలో కూల్చివేతలు చేపట్టనున్నట్టు హైడ్రా అధికారులు బెదిరించడంతో మరోసారి హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. ఆ పిటిషన్‌పై ఇంతకు ముందు హైడ్రా తరఫు న్యాయవాది స్పందిస్తూ.. పిటిషనర్ ఆస్పత్రి ఉన్న ప్రాంతాన్ని హైడ్రా ఎన్నడూ సందర్శించలేదని, కూల్చివేత చర్యలు చేపట్టాలంటూ అధికారులకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని చెప్పడంతోపాటు ఏ చర్యలైనా జీవో 99కు అనుగుణంగానే ఉంటాయని హామీ ఇచ్చారని, దీంతో ఆ పిటిషన్‌పై సెప్టెంబరు 5న హైకోర్టు విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించిందని వివరించారు. కాగా, గతంలో పంచాయతీ ఇచ్చిన అనుమతులను ఈ ఏడాది ఫిబ్రవరిలో రద్దు చేయడంతో అందుకు సంబంధించిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసిందని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిపినట్టు పేర్కొంటూ అమీన్‌పూర్ తాసిల్దార్ ఈ ఏడాది ఏప్రిల్ 2న నోటీసులు జారీ చేశారని, ఈ నోటీసులకు 15 రోజులు గడువు కావాలని పిటిషనర్లు కోరినప్పటికీ అనుమతించలేదని పేర్కొన్నారు. పిటిషనర్లు 18న వివరణ సమర్పించినప్పటికీ పరిగణనలోకి తీసుకోలేదని, ఈ నెల 20న నిర్మాణాలను తొలగించాలనే నోటీసుల్లో 48 గంటలే గడువు ఇచ్చారని చెప్పారు. ఈ నెల 20వ తేదీతో ఉన్న నోటీసులను 21న సాయంత్రం అందజేశారని, ఆ మరుసటి రోజు ఉదయమే నిర్మాణాలను కూల్చివేశారని తెలిపారు. దీనిపై హైడ్రా తరఫు న్యాయవాది కటిక రవీందర్ రెడ్డి వాదిస్తూ.. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగింపునకు యంత్రాలను, సిబ్బందిని పంపాలని కోరుతూ అమీన్‌పూర్ తాసిల్దార్ నుంచి ఈ నెల 21న లేఖ అందిందని, దీంతో జీవో 99 ప్రకారం ప్రభుత్వ స్థలం రక్షణ కోసం యంత్రాలను, సిబ్బందిని పంపామని వివరించారు.

హైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనే..

అనంతరం ఇరు పక్షాల వాదనలను, రికార్డులను బేరీజు వేసిన హైకోర్టు.. ఆక్రమణలను తొలగింపునకు తాసిల్దార్ జారీ చేసిన నోటీసుపై పిటిషనర్ స్పందించలేదని గుర్తించింది. అలాగే ఏప్రిల్ 15న పిటిషనర్ గడువు కోరిన విషయాన్ని మాత్రమే తాసిల్దార్ గమనంలోకి తీసుకున్నారని, అందుకే ఏప్రిల్ 18న పిటిషనర్ సమర్పించిన వివరణను పరిగణనలోకి తీసుకోకుండా కూల్చివేతలకు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నది. పిటిషనర్ల వ్యాజ్యంపై విచారణ పూర్తయ్యే వరకూ ఆ నిర్మాణాల్లో జోక్యం చేసుకోరాదని గతంలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, అయినప్పటికీ కూల్చివేత చర్యలు చేపట్టడం హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది.

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణకు

క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఎస్సీ వర్గీకరణ అంశంపై అన్ని షెడ్యూల్డ్ కులాల ప్రతినిధులు, కులసంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించాలని క్యాబినెట్ సబ్‌కమిటీ నిర్ణయించింది. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు ఇటీవలే సుప్రీంకోర్టు సానుకూల తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఆ తీర్పులోని న్యాయపర అంశాలను అధ్యయనం చేసి, దాని అమలుకు సిఫారసులు చేసేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని కమిటీ శుక్రవారం భేటీ అయి అభిప్రాయాలను సేకరించాలని నిర్ణయించింది. ఈ నెల 30 నుంచి అన్ని సంఘాలు తమ అభిప్రాయాలనుcommr. scsub classification@gmail.comకు పంపించాలని సూచించింది.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వైసీపీకి చుక్కెదురు

మధ్యంతర ఉత్తర్వుల జారీకి సుప్రీంకోర్టులో నిరాకరణ


న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఏపీలో టీడీపీ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడి కేసులో వైసీపీ నేతలకు చుక్కెదురైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ ఈ నెల 22న ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా వైసీపీ నేతలు మన్యం జగదీశ్, వెంకటసుబ్బారావు, వినోద్‌కుమార్, హరిబాబు, ఆంజనేయులు, అమితాబ్, గెల్లిపోగు రాజు దాఖలు చేసుకున్న పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వుల జారీకి శుక్రవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. 48 గంటల్లోగా పిటిషనర్లు తమ పాస్‌పోర్టులను దర్యాప్తు అధికారులకు సరెండర్ చేయాలని ఆదేశించింది. కేసు విచారణకు పూర్తిగా సహకరించాలని, దర్యాప్తు అధికారులు పిలిచినప్పుడు హాజరుకావాలని వారికి స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను అక్టోబర్ 1కి వాయిదా వేసింది.

పర్యాటకంలో 'ఎస్‌సీఆర్'దే హవా

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : పర్యాటక రంగం లో దక్షిణ మధ్య రైల్వే కీలక పాత్ర పోషిస్తున్నదని, పర్యాటకుల కోసం 25 భారత్ గౌరవ్ యాత్ర రైళ్లను నడిపినట్టు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

గుడిగుడికో జమ్మి చెట్టు!

- దసరాకు గ్రీన్ చాలెంజ్ కొత్త కార్యక్రమం
- పదివేలకుపైగా మొక్కల పంపిణీకి సిద్ధం
- స్వర్ణగిరిలో పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎంపీ సంతోష్‌కుమార్



స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో జమ్మి మొక్కను నాటి నీళ్లు పోస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండర్ సంతోష్ కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): దసరా పండగ సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ (జీఐసీ) మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నది. తెలంగాణ రాష్ట్ర వృక్షం జమ్మిని ప్రతి ఊరిలో, ప్రతి గుడిలో నాటించాలన్న సంకల్పం తీసుకున్నది. దసరా పండుగనాడు లాంఛనంగా జమ్మి మొక్కలను నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను స్వర్ణగిరి అలయ పూజారి చేతుల మీదుగా రాజ్యసభ మాజీ సభ్యుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు సంతోష్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో జమ్మి మొక్కను నాటారు. వేద కాలం నుంచి భక్తిపూర్వకంగా అందరూ పూజించుకునే జమ్మిచెట్టును తెలంగాణ రాష్ట్ర వృక్షంగా నాటి కేసీఆర్ ప్రభుత్వం గుర్తించింది. అయితే, అనేక కారణాలతో జమిచెట్టు అంతరించిపోతున్న నేపథ్యంలో దాని విశిష్టత రీత్యా ప్రతి ఊరిలో, ప్రతి గుడిలో పెంచాలన్న లక్ష్యంతో గ్రీన్ ఇండియా చాలెంజ్ తరపున ఊరు ఊరుకో జమ్మి చెట్టు- గుడిగుడికో జమ్మి చెట్టు నినాదాన్ని సంతోష్‌కుమార్ తీసుకున్నారు.

జమ్మిని పూజించడం ఆచారం: సంతోష్

తెలంగాణలో దసరానాడు జమ్మిచెట్టును పూజించడం ఆచారమని, జమ్మి ఆకులను బంధుమిత్రులకు ఇచ్చిపుచ్చుకుని అందరికీ మంచి జరగాలని కోరుకోవడం ఆనవాయితీ అని సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రాధాన్యం దృష్ట్యా రానున్న దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఊరుఊరుకో జమ్మిచెట్టు-గుడిగుడికో జమ్మి చెట్టు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటికే పదివేలకుపైగా జమ్మి మొక్కలను సిద్ధం చేస్తున్నామని, అన్ని గ్రామాలు, గుడులకు వీటిని పంపిణీ చేస్తామని చెప్పారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ కోఫౌండర్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వేద కాలం నుంచి నిత్య జీవితంలో భాగమైన జమ్మిని ప్రతి ఊరిలో, గుడిలో, బడిలో పెంచాలన్న గొప్ప ఆలోచన చేసిన సంతోష్‌కుమార్‌కు అభినందనలు తెలియజేశారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,పొన్నం ప్రభాకర్‌గౌడ్, జూపల్లికృష్ణారావు, సీతక్క

త్యాగజీవి కొండా లక్ష్మణ్ బాపూజీ

- స్వరాష్ట్రం కోసం పరితపించిన నేత కొండా లక్ష్మణ్ బాపూజీ
- మంత్రి పదవినే వదులుకున్న మహనీయుడు
- మంత్రులు పొన్నం, తుమ్మల, జూపల్లి, సీతక్క
- రవీంద్రభారతిలో బాపూజీ 109వ జయంతి

రవీంద్రభారతి, సెప్టెంబర్ 27: నమ్మిన సిద్ధాంతం కోసం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జీవితాన్నే త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం తెలంగాణ సమాజానికి ఆదర్శనీయమని రాష్ట్ర మంత్రులు కొనియాడారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, జూపల్లి కృష్ణారావు, సీతక్క మాట్లాడారు. తొలుత బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుపెట్టి గౌరవించిందని మంత్రులు తెలిపారు. చేనేత కార్మికుల ఉపాధి కల్పనకు అనేక రకాలుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వస్త్రాల మీద జీఎస్టీ విధించడాన్ని వ్యతిరేకిస్తూ బాపూజీ స్ఫూర్తితో పద్మశాలీలంతా ఐక్యపోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. స్వరాష్ట్రం కోసం మంత్రి పదవినే వదులుకున్న త్యాగజీవి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, టీజీఎండీసీ చైర్మన్ అనిల్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, బీసీ కమిషన్ సభ్యుడు సురేందర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ మాయాదేవి, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగంట్ల స్వామి, వైస్ చైర్మన్ అవ్వారి భాస్కర్ పాల్గొన్నారు.

నేతన్నలకు రుణమాఫీ లేనట్టే!

- బాపూజీ జయంతికి హాజరే కాని సీఎం
- లక్ష మంది కార్మికులకు మొండిచెయ్యి

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి మొండిచెయ్యి చూపింది. ఇప్పటికే బతుకమ్మ చీరల తయారీని నిలిపివేసిన ప్రభుత్వం నేతన్నల కడుపు కొట్టింది. రాష్ట్రంలోని లక్ష మంది నేతన్నలకు రుణమాఫీ చేస్తామన్న హామీని కూడా తుంగలో తొక్కిందని చేనేత కార్మికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. శుక్రవారం రవీంద్రభారతి వేదికగా అధికారికంగా నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి డుమ్మా కొట్టారు. కేవలం మంత్రులు పొన్నం, జూపల్లి, తుమ్మల, సీతక్క హాజరయ్యారు. ఎలాంటి ప్రకటన చేయకుండానే జయంతి ఉత్సవాలను ముగించడం విమర్శలకు దారితీసింది. సీఎం వచ్చి రుణమాఫీ, ఇతర సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటారని అనుకున్న చేనేత కార్మికులకు నిరాశే ఎదురైంది. దీంతో నేత కార్మికులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా త్వరలోనే నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు చేనేత సంఘాల నాయకులు సిద్ధంగా ఉన్నారు.

తుమ్మిడిహట్టికి మహారాష్ట్ర ఒప్పుకోలే

- బరాజ్ ఎఫ్‌ఆర్‌ఎల్‌ను మార్చాలన్నది
- ఆ తరువాతనే కాళేశ్వరం రీడిజైన్ చేశాం
- కాళేశ్వరం ప్రాజెక్టు ఆస్తులన్నీ కార్పొరేషన్‌వే
- కమిషన్ ఎదుట ఈఎన్సీ, కేఐపీసీఎల్ ఎండీ హరిరాం

హైదరాబాద్, సెప్టెంబర్27 (నమస్తే తెలంగాణ): ముంపు నేపథ్యంలో తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర సర్కారు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసిందని గజ్వేల్ ఈఎన్సీ, కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీ హరిరాం వెల్లడించారు. ఎఫ్‌ఆర్‌ఎల్‌ను 152 మీటర్ల నుంచి 148కి తగ్గించాలని కోరడంతో ప్రాజెక్టునే మరోసారి పునఃసమీక్షించాలని కోరిందని, అందుకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని వివరించారు. ఉన్నతస్థాయి సమావేశాల అనంతరం ప్రాజెక్టు రీడిజైన్ చేశారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటైన జస్టిస్ ఘోష్ కమిషన్ శుక్రవారం నిర్వహించిన బహిరంగ విచారణకు హరిరాం హాజరయ్యారు. ప్రాజెక్టు రూపకల్పన, కార్పొరేషన్ ఏర్పాటు, బ్యాంకుల నుంచి రుణాల సేకరణ, బిల్లుల చెల్లింపు అంశాలపై జస్టిస్ ఘోష్ అడిగిన ప్రశ్నలకు సూటిగా, స్పష్టంగా సమాధానాలు ఇచ్చారు. 2.30 గంటలపాటు విచారణ కొనసాగగా, 90కిపైగా ప్రశ్నలు అడిగారు. ప్రాజెక్టు రూపకల్పనకు సంబంధించిన అంశాలను హరిరాం వివరించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై 2015 ఫిబ్రవరిలో మహారాష్ట్ర, తెలంగాణ సీఎంల మధ్య అత్యున్నతస్థాయి సమావేశం కొనసాగిందని వివరించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బరాజ్‌ను నిర్మిస్తే 3,700 ఎకరాలకు ముంపు సమస్య ఉన్నదని, ఎత్తును 148కి తగ్గించాలని మహారాష్ట్ర సీఎం, తెలంగాణ సీఎంను కోరారని, మొత్తం ప్రాజెక్టునే మరోసారి సమీక్షించాలని విజ్ఞప్తి చేశారని వెల్లడించారు. దీంతో తెలంగాణ సర్కారు అనేక చర్చలు కొనసాగించి, ఆ తరువాత ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చారని కమిషన్‌కు వివరించారు.

రుణాల్లో 10 వేల కోట్లు పీఆర్‌ఎల్‌ఐఎస్‌కు

కాళేశ్వరం ప్రాజెక్టును వేగంగా నిర్మించేందుకు, అవసరమైన నిధులకు కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసిందని హరిరాం తెలిపారు. ప్రభుత్వ గ్యారెంటీలతోనే రుణాలను సేకరించామని, నిబంధనల మేరకే బిల్లుల చెల్లింపు కొనసాగిందని వివరించారు. కార్పొరేషన్ ఆర్థిక వ్యయాల మదింపునకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఇంటర్నల్ ఆడిటర్‌ను నియమించిందని, కాగ్ సైతం ఆర్థిక సంవత్సరం వారీగా ఆడిటర్లను నియమిస్తూ మదింపు చేయిస్తున్నదని వెల్లడించారు. ఇప్పటివరకు వడ్డీతో కలిపి రూ.87,449 కోట్ల రుణం మంజూరైందని తెలిపారు. వాటిలో బ్యాంకుల నుంచి రూ.64 వేల కోట్లు విడుదల కాగా, ఏజెన్సీలకు చెల్లింపులు చేశామని వివరించారు. రూ.29,737 కోట్లు రీ పేమెంట్ చేశామని తెలిపారు. కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా రుణం నుంచే రూ.10వేల కోట్లను పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (పీఆర్‌ఎల్‌ఐఎస్) నిర్మాణ పనుల కోసం వెచ్చించామని తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం కార్పొరేషన్ బ్యాలెన్స్‌షీట్, వార్షిక నివేదికలు, ఆడిట్ రిపోర్టులు, వర్క్‌బిల్లను అందజేయాలని ఈఎన్సీ హరిరాంకు కమిషన్ సూచించింది. శనివారం కూడా విచారణ కొనసాగుతుంది.

మరో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

- గిరాకీ లేక, ఈఎంఐ కట్టలేక..
- మేడ్చల్ జిల్లాలో ఘటన

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'మహాలక్ష్మి' పథకంతో ఉపాధి కరువై.. బతుకు భారమై మరో ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా మల్లాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. మల్లాపూర్‌లో నివాసముండే పత్లావత్ వీరేశ్(31) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రభుత్వ నిర్వాకంతో ఆటో గిరాకీ తగ్గి ఆర్థిక సమస్యలు తలెత్తాయి. కాగా శుక్రవారం వీరేశ్‌ను ఫైనాన్స్ డబ్బులు ఎప్పుడిస్తావంటూ కొంతమంది దుర్భాషలాడారు. దీనికితోడు పిల్లల ఫీజులు కట్టలేకపోయానని కలతచెందిన వీరేశ్ ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇప్పటివరకు 60 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్యకు పాల్పడ్డారని బీఆర్‌టీయూ నాయకులు వాపోయారు.

రాష్ట్రంలో దొంగలు పడ్డారు!

- తెలంగాణలో అంతర్రాష్ట్ర దొంగల హల్‌చల్
- సాక్షాత్తూ డిప్యూటీ సీఎం భట్టి ఇంట్లోనే చోరీ
- హైదరాబాద్ శివార్లలో రెచ్చిపోతున్న ముఠాలు
- జిల్లాలకు విస్తరించిన చైన్‌స్నాచింగ్ ఘటనలు
- కరువైన పోలీస్ నిఘా.. బిక్కుబిక్కుమంటున్న జనం

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో దొంగలుపడ్డారు. ఎక్కడికక్కడ దోచేస్తున్నారు. ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మరీ ముఖ్యంగా హైదరాబాద్ నగరంతోపాటు సమీప జిల్లాల్లో దొంగల ముఠాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. చైన్‌స్నాచింగ్ ఘటనలు అన్ని జిల్లాల్లో చోటుచేసుకుంటున్నాయి. తెలంగాణలో తిష్టవేసిన పార్థీ గ్యాంగ్‌లు, థార్ గ్యాంగ్‌లు, బిహారీ దొంగల ముఠాలు పేట్రేగిపోతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి అడ్డగోలుగా దొంగతనాలు చేస్తున్నారు. ఏకంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట్లో చొరపడి విలువైన నగదు, నగలు, విదేశీ కరెన్సీ తదితర సామగ్రిని దోచుకున్న ఘటన మరింత భయాందోళన కలిగిస్తున్నది. మళ్లీ వరసగా చైన్‌స్నాచింగ్, దొంగతనాలు జరుగుతుండటం ఆందోళనకరం. నగర శివార్లలోని సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవడంతోపాటు ఎక్కువ మొత్తంలో నగలను కొల్లగొట్టేందుకు జిల్లాలకు విస్తరించాయి. గత మూడు నెలల్లో ఖమ్మం జిల్లా పెనుబల్లిలో, నిజామాబాద్ జిల్లా మామిడిపల్లి, మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్, పోచారంలో, వరంగల్ జిల్లా చిల్పూర్‌లో, హైదరాబాద్ నగర శివారులోని మరో రెండు చోట్ల చైన్‌స్నాచింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. విద్యుత్ మోటర్లు ఎత్తుకెళ్లే ముఠాలు, రాగి వైరు దొంగలు, బైక్‌ల దొంగలు, కార్ల దొంగలు రెచ్చిపోతున్నారు. గత ఆరు నెలలుగా దొంగతనాలు, చోరీల్లో నల్లగొండ జిల్లా అగ్రస్థానంలో ఉన్నది. పోలీసులు పార్థీగ్యాంగ్‌ను ఎట్టకేలకు అరెస్టు చేయడంతో అక్కడ కొద్దిగా దొంగతనాల బెడద తగ్గింది. ఇటీవల మళ్లీ దొంగలు చెలరేగిపోతున్నారని స్థానికులు అంటున్నారు. సెల్ షాపులు, మూసి ఉన్న దుకాణాలు, ఇండ్లు టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్నారు. హైదరాబాద్ సహా సమీప జిల్లాల్లో థార్ గ్యాంగ్‌లు, పార్థీ గ్యాంగ్‌లు, భవారీయా ముఠాలు, చుడీదార్ గ్యాంగులు, రైళ్లలో దొంగతనం చేసే ముఠాలు, ఫోన్లు అపహరించే ముఠాలు, కిరాయి హత్యలు చేసే మూకలు, చిన్నారులను అపహరించే గ్యాంగులు రాష్ట్రంలో తిష్టవేసినట్టు పోలీసులే చెబుతున్నారు. కానీ, వారిని అరెస్టు చేయడంలో, తెలంగాణ వైపు కన్నెత్తి చూడకుండా చేయడంలోనూ ఎలాంటి పటిష్ట చర్యలు తీసుకోలేకపోతున్నారు.

డిప్యూటీ సీఎం ఇంట్లో చోరీ

మొదటిపేజీ తరువాయి...

చోరీకి పాల్పడ్డాడు. అనంతరం ఇద్దరు పశ్చిమబెంగాల్‌కు పారిపోయారు. ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో భట్టి ఇంట్లో దొంగతనం బయటపడింది. నిందితుల వద్ద రూ.2.2 లక్షల నగదు, వంద గ్రాముల బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని బంజారాహిల్స్ పోలీసులకు సమాచారమిచ్చారు. నిందితులను హైదరాబాద్‌కు తీసుకొచ్చే అవకాశమున్నది.

సంక్షోభంలోకి తెలంగాణ విద్యారంగం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
- హైదరాబాద్‌లో ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి మహాగర్జన ధర్నా
- విద్యార్థులపై పోలీస్ జులుం.. నేడు నిరసనలకు ఎస్‌ఎఫ్‌ఐ పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రాష్ట్రంలోని విద్యారంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో ప్రవేశంతో మొదలు సీటు, ఫీజులు, డొనేషన్లు, పాఠ్య పుస్తకాలు, హాస్టల్ వసతులు, అధ్యాపకుల కొరతతో విద్యారంగంలో సంక్షోభం నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ 8 నెలల కాలంలో విద్యారంగంలో నెలకొన్న ఏఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచలేదని విమర్శించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద చేపట్టిన ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి మహాగర్జన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 1,864 ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మహాగర్జన తరలివచ్చిన విద్యార్థులను పోలీసులు ఈడ్చుకెళ్లి అరెస్టు చేయడాన్ని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు టీ నాగరాజు, కార్యదర్శి ఆర్‌ఎల్ మూర్తి తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా శనివారం రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపునిస్తున్నట్టు ప్రకటించారు.

అటవీశాఖ అధికారులపై దాడి

- జేసీబీని స్వాధీనానికి యత్నించగా ఘటన
- వరంగల్‌లో చికిత్స పొందుతున్న సిబ్బంది
- దాడిని ఖండించిన మంత్రులు సురేఖ, సీతక్క



దాడిలో తీవ్రంగా గాయపడిన అటవీ శాఖ అధికారి

ములుగు, సెప్టెంబర్ 27 (నమస్తేతెలంగాణ)/తాడ్వాయి/వరంగల్: రిజర్వు ఫారెస్టులో పోడు చేస్తున్నారనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లి జేసీబీని స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులపై కొందరు దాడికి తెగబడ్డారు. ములుగు జిల్లా తాడ్వాయి రేంజ్ పరిధిలోని దామరవాయి గ్రామ శివారులో పోడు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎఫ్‌ఎస్‌వో వినోద్‌కుమార్, ఎఫ్‌బీవోలు శరత్‌చంద్ర, సుమన్, బేస్ క్యాంపు సిబ్బంది ఎట్టి శ్రీను, జీపు డ్రైవర్ రాజేందర్ గురువారం రాత్రి పెట్రోలింగ్‌కు వెళ్లారు. తాడ్వాయి వైపు వస్తున్న జేసీబీని ఆపి ఎక్కడికి వెళ్లి వస్తున్నారంటూ ప్రశ్నించారు. పోడు చేసి వస్తున్నారని గుర్తించి జేసీబీని స్వాధీనం చేసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించేందుకు యత్నించారు. ఆగ్రహించిన జేసీబీ యజమాని గంట సూరజ్‌రెడ్డి, ఆపరేటర్ నీరటి శ్రీకాంత్, గంట శశిధర్, పాండవుల సాయికుమార్, మ్యాదరి చంటి కలిసి దాడి చేయడంతో ఎఫ్‌ఎస్‌వో వినోద్‌కుమార్, ఎఫ్‌బీలు శరత్‌చంద్ర, సుమన్ తల, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడికి పాల్పడిన సూరజ్‌రెడ్డి, శశిధర్, చింటు, సాయి, శ్రీకాంత్‌ను శుక్రవారం కాటాపూర్ క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసినట్టు ఎస్పీ శబరీష్ తెలిపారు. కాగా రెవెన్యూ భూమిలో పైప్‌లైన్ కందకాలు తీసేందుకు వెళ్లి రాత్రి 11 గంటలకు తిరిగి వస్తుండగా అటవీ అధికారులు బూతులు తిడుతూ తన తమ్ముడు శశిధర్‌పై బండరాయితో తలపై కొట్టడంతో రక్తస్రావమైందని, దీంతో తాము దాడి చేశామని సూరజ్‌రెడ్డి తెలిపారు. అధికారులపై దాడిని మంత్రులు సురేఖ, సీతక్క, కలెక్టర్ టీఎస్ దివాకర, ఆదివాసీ సంఘాల నాయకులు ఖండించారు. శుక్రవారం మంత్రి సురేఖ దవాఖానకు వెళ్లి వారిని పరామర్శించారు.

మరో 2 వేల కోట్ల అప్పుకు బాండ్లు

మొదటిపేజీ తరువాయి...

చేరనున్నది. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు అధికారం చేపట్టిన నాటినుంచి ఇప్పటివరకు రూ.71,495 కోట్ల అప్పు చేసింది. వచ్చే రూ.2,000 కోట్లతో కలిసి రాష్ట్ర రుణం రూ.73,495 కోట్లకు చేరుతుంది. ఈ నెల 3న రూ.2,500 కోట్లు, 10న 1,500 కోట్లు, 17న రూ.500 కోట్లు.. ఇలా నెల వ్యవధిలోనే రూ.4,500 కోట్ల రుణం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అక్టోబర్ 1న మరో రూ.2,000 కోట్ల అప్పు తీసుకోనున్నది. ప్రతి నెలా రూ.5 వేల కోట్ల నుంచి 6 వేల కోట్ల విలువైన బాండ్ల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుంచి అప్పులు తీసుకుంటున్నది.

దాతల సహకారంతోనే బ్రేక్‌ఫాస్ట్ స్కీం

- సీఎం నియోజకవర్గం కొడంగల్‌లో పైలట్‌ప్రాజెక్ట్‌గా అమలు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): సర్కారు బడుల్లోని విద్యార్థుల ఆకలి తీర్చేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని నీరుగార్చిన ప్రస్తుత ప్రభుత్వం ఇదే పథకానికి కొత్త రంగులద్దింది. మళ్లీ తిరిగి ప్రారంభించనుండగా, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలుచేయాలని నిర్ణయించింది. హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా బ్రేక్‌ఫాస్ట్ స్కీంను అమలుచేయనున్నారు. నియోజకవర్గంలోని 312 పాఠశాలల్లోని 28 వేల మంది పిల్లలకు అల్పాహారాన్ని అందజేసేందుకు వయాట్రిక్ ఫార్మా సంస్థ ముందుకొచ్చింది. సీఎస్సార్ నిధుల నుంచి రూ.6.4కోట్లను విరాళంగా అందజేసింది. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో రెండు సంస్థల మధ్య ఎంవోయూ కుదిరింది. దాతల సహకారంతో బ్రేక్‌ఫాస్ట్ స్కీంను అమలుచేసే అంశాన్ని ఇటీవలే 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తీసుకొచ్చింది. 'దాతలు దయతలిస్తేనే బ్రేక్‌ఫాస్ట్' శీర్షికతో 22న కథనాన్ని ప్రచురించింది.

జీవో 46 బాధితుల గాంధీభవన్ ముట్టడి

- కాంగ్రెస్ నట్టేట ముంచిందని ఆగ్రహం
- ఉత్తమ్‌ను నిలదీసిన బాధితులు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): సమస్యను వెంటనే పరిష్కరించాలని జీవో 46 బాధితులు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌ను ముట్టడించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాడు కాంగ్రెస్ నేతలు ఆందోళనలకు పిలుపునిచ్చిన పోస్టర్లనే ప్లకార్డులుగా చేతబూని గాంధీభవన్ మెట్లపై కూర్చొని నినాదాలు చేశారు. శుక్రవారం గాంధీభవన్‌కు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని వారు ఘెరావ్ చేశారు. జీవో 46ను తక్షణం రద్దు చేయాలని, ఇక్కడే ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి, ఉన్న 2 వేల కానిస్టేబుల్ పోస్టుల ఖాళీలను తమతో భర్తీచేయాలని, మరో 1,000 సూపర్ న్యూమరరీ పోస్టులను భర్తీ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 'మీ సమస్యపై ముఖ్యమంత్రితో మాట్లాడి చెప్తాను. ఎన్నికల్లో జీవో 46ను రద్దు చేస్తామని మీకిచ్చిన హామీ మాట వాస్తవమే. దీనికి కొంత సమయం పడుతుంది' అని మంత్రి ఉత్తమ్ వారితో చెప్పారు. త్వరలోనే న్యాయం చేస్తామని బాధితులకు చెప్పి వెళ్లిపోయారు.



ఏసీబీకి పట్టుబడిన హుస్సేన్, రవీందర్,ప్రభుదాస్, షకీల్

ఏసీబీకి చిక్కిన నలుగురు అధికారులు

- జనగామలో ఆర్‌అండ్‌బీ ఈఈ, ఏటీవో
- సరూర్‌నగర్‌లో వీఎం హోం ప్రిన్సిపల్
- సంగారెడ్డి జిల్లాలో పంచాయతీ కార్యదర్శి

జనగామ చౌరస్తా/ఆర్కేపురం/కొండాపూర్, సెప్టెంబర్ 27: వేర్వేరు చోట్ల లంచం తీసుకుంటూ శుక్రవారం నలుగురు అధికారులు ఏసీబీకి పట్టుబడ్డారు. జనగామలో ఆర్‌అండ్‌బీ ఈఈ, ఏటీవో, సరూర్‌నగర్‌లో వీఎం హోం ప్రిన్సిపల్ సంగారెడ్డి జిల్లాలో పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు దొరికారు. వివరాలు ఇలా.. జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం బండ్లగూడెంకు చెందిన ఎక్స్ సర్వీస్‌మెన్ చిర్ర సత్యపాల్‌రెడ్డి భార్యకు లింగాలఘనపురంలో హిందూస్థాన్ పెట్రోలియం బంక్ మంజూరైంది. దాని స్థాపనకు అవసరమయ్యే ఎన్‌వోసీ కోసం వరంగల్ పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోగా, రిమార్క్స్ పరిశీలన కోసం జనగామ ఆర్‌అండ్‌బీ ఈఈ, డీపీవో, ఏసీపీకి ఉత్తర్వు లు జారీ చేశారు. దీంతో ఈఈ చిలుకపాటి హుస్సేన్ ఎన్‌వోసీ జారీ చేయడా నికి సత్యపాల్‌రెడ్డిని 14 వేలు లంచం డిమాండ్ చేయగా ఏసీబీని సంప్రదించారు. శుక్రవారం జనగామ కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ ఈఈ హుస్సేన్ సత్యపాల్‌రెడ్డి నుంచి రూ.12 వేలు తీసుకొని మరో రూ.2 వేలను ఏటీవో రవీందర్‌కు ఇప్పించాడు. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

29వేలు తీసుకుంటూ 'వీఎం' ప్రిన్సిపల్

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సరూర్‌నగర్ వీఎం హోం ప్రిన్సిపాల్ ప్రభుదాస్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. పాఠశాల ఫుడ్ కాంట్రాక్టర్ బిల్లుకు ప్రిన్సిపల్ వాస్తవ బిల్లుల కన్నా రూ.29 వేలు అధిక బిల్లులు సృష్టించాడు. మొత్తాన్ని శుక్రవారం కాంట్రాక్టర్ నుంచి తీసుకుంటుండగా ఏసీబీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నది.

7 వేలతో చిక్కిన పంచాయతీ కార్యదర్శి

సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌కు చెందిన మాచేపల్లి అప్సరకు ఓనర్ షిప్ సర్టిఫికెట్ ఇవ్వడానికి పంచాయతీ కార్యదర్శి రూ.7 వేలు లంచం డిమాండ్ చేశాడు. శుక్రవారం అప్సర నుంచి కార్యదర్శి షకీల్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కార్యదర్శిని అదుపులోకి తీసుకున్నారు.

ఎలక్ట్రికల్ బస్సులకు 10 కొత్త డిపోలు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రికల్ బస్సుల కోసం నూతనంగా పది డిపోలు అవసరమని ప్రభుత్వానికి ఆర్టీసీ ప్రతిపాదనలు చేసింది. ఒక్కో డిపోకు రూ.10 కోట్ల చొప్పున రూ.100 కోట్లు.. ఒక్కో డిపోకు 10 ఎకరాల చొప్పున 100 ఎకరాలు కావాలని ప్రభుత్వాన్ని కోరింది. ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్ కోసం 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ సరఫరా అవసరమని ఆర్టీసీ భావిస్తున్నది. ఇతగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నది.

అపాయంలో ఉపాలయాలు!

- మసకబారుతున్న యునెస్కో నిర్మాణప్రభ
- ఇటు ఓపెన్ కాస్టు ముప్పు.. అటు భద్రతాలోపం
- ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కొరవడిన భద్రత
- ఉపాలయాల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- పట్టించుకోని కేంద్ర పురావస్తు శాఖ

మైనింగ్ కోరల్లో మహా శిల్ప శిఖరం

ప్రత్యేక కథనం -3

వరంగల్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రపంచ వారసత్వ సంపదగా నిలిచిన రామప్ప ఆలయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఇప్పుడు మానవ ముప్పును ఎదుర్కొంటున్నది. సింగరేణి కాలరీస్ కొత్తగా రామప్ప ఆలయం సమీపంలో ఓపెన్ కాస్టు మైనింగ్‌ను మొదలుపెట్టేందుకు వేగంగా ఏర్పాట్లు చేస్తుండడంతో దాని మనగుడ ప్రమాదంలో పడింది. ఇది మొదలైతే రామప్ప ఆలయానికి వచ్చే వారు పూర్తిగా తగ్గిపోనున్నారు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా ఉన్న ఇక్కడికి పర్యాటకులు వచ్చే పరిస్థితి ఉండదు. మరోవైపు సర్కారు నిర్లక్ష్యం, భద్రతాలేమితో రామప్పతో పాటు దీని పరిసరాల్లోని ఉపాలయాలు శిథిలమవుతున్నాయి. సరైన భద్రత లేకపోవడంతో గుప్త నిధుల వేటలో రాతి కట్టడాలు నేలకూలుతున్నాయి. రాజుల చరిత్ర శాసనాల్లో ఉంటే వారి కాలంలో నిర్మించిన అద్భుత శిల్పకళ సంపద మట్టిలో కలిసిపోతున్నది. నిత్యం అభిషేకాలు, పూజలతో ఆధ్యాత్మికతను ప్రపంచానికి చాటిన దేవాలయాలు, శిల్పాలు రాళ్ల కుప్పలవుతున్నాయి. శతాబ్దాలనాటి జీవకళను తెలియజెప్పే ఘనకీర్తి గల చారిత్రక ఆలయాలు ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ప్రభను కోల్పోతున్నాయి.



రామప్ప సరస్సు కట్టపై పిచ్చి చెట్ల నడుమ ఉన్న ఉప ఆలయం

యునెస్కో గుర్తింపు వచ్చినా..

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలో రామప్ప ఆలయం ఉన్నది. కాకతీయుల కళావైభవానికి, ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనంగా ఉన్న రామప్ప ఆలయం చుట్టూ పక్కల కిలోమీటరు పరిధిలోనే మరో 20 ఉపాలయాలను నిర్మించారు. కాకతీయుల అద్భుత కళానైపుణ్యం ఉట్టిపడే రామప్ప ఆలయానికి 2021 జూలైలో యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్, కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) గుర్తింపు వచ్చింది. అప్పటి వరకు ఎలా ఉన్నా ఆ తర్వాత దీని ప్రభ మరింత పెరుగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న రామప్ప ఆలయం అభివృద్ధికి నోచుకోక పోగా ఉన్న కట్టడాలు కూలిపోతున్నాయి.



రామప్పలోని గొల్లగుడి వద్ద నంది తలను ధ్వంసం చేసిన దృశ్యం

శిథిలమవుతున్న ఆలయాలు

కాకతీయుల కాలంలో రామప్ప ఆలయంతోపాటు దీనిని ఆనుకుని కాటేశ్వర, కామేశ్వర, నరసింహస్వామి, నంది మంటపాన్ని నిర్మించారు. రామప్ప చుట్టున్న కోటగోడ లోపల గొల్లగుడి, యాకూబ్ సాబ్ గుడి, త్రికూటాలయం, అడవిలో మరో రెండు శివాలయాలు ఉన్నాయి. రామప్ప చెరువు కట్టపై కల్యాణ మంటపం, త్రికూటాలయం (కాటేజీల పక్కన), మరో రెండు చిన్న ఆలయాలు ఉన్నాయి. పాలంపేటలో ఉన్న మరో రెండు శివాలయాలు శిథిలమవుతున్నాయి. ఆదరణ లేకపోవటంతో ఆలయంలోని శిల్పాలు మట్టిలో కలిసిపోతున్నాయి. రాతి స్థంబాలు కూలిపోతున్నాయి. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు తూర్పు ద్వారాన్ని ఆనుకుని ఉన్న ప్రాకారం 36 మీటర్ల వరకు కుప్పకూలింది. దీంతో ప్రహరీ మొత్తంగా కూలిపోయే ప్రమాదం పొంచి ఉన్నది. రామప్ప ఆలయానికి 300 మీటర్ల దూరంలో ఉన్న ఉప శివాలయం పూర్తిగా కూలిపోయింది. ప్రధాన ఆలయంతో పాటు చుట్టుపక్కల 16 ఉపాలయాలూ పూర్తిగా శిథిలమైపోయాయి. కామేశ్వరాలయం పునర్నిర్మాణం కోసం కూలగొట్టి శిలలను కుప్పలుగా పోశారు. చుట్టుపక్కల ఉన్న ఆలయాలన్నీ దశాబ్దాల తరబడి ఆదరణ లేక శిథిలమయ్యాయి. వీటిలో శివాలయం పూర్తిగా కూలిపోయింది. రామప్పతోపాటు లక్ష్మీదేవిపేట, పెద్దాపురం, రామాంజాపురం, నర్సాపురం గ్రామాల్లోని ఆలయాలు సంరక్షణ లేకపోవడంతో సహజత్వాన్ని కోల్పోతున్నాయి. గుప్త నిధుల కోసం వేట కొనసాగుతూనే ఉండడంతో నిత్యం తవ్వకాలు జరిగి నిర్మాణాలు చెదిరిపోతున్నాయి.



రామప్పలోని గొల్లగుడి ఆలయం

ఇటీవలె తవ్వకాలు..

రామప్ప సమీపంలోని గొల్లగుడిలో ఇటీవల గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. గుడి పైకప్పు ధ్వంసం చేశారు. అక్కడ కాకతీయుల కాలం నాటి నిధులున్నాయనే కారణంతోనే కొందరు ఈ పని చేసినట్టు అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. గొల్లగుడిలో ఏడాది క్రితం ఇదే రకమైన తవ్వకాలు జరిగాయి. రామప్ప ఆలయం సమీపంలో గడ్డపారలతో తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు ఉన్నాయి. గుప్తనిధుల కోసం దుండగులు గడ్డపారలతో గర్భగుడిని తవ్వడంతో శివలింగాలు చెల్లాచెదురయ్యాయి. ప్రపంచ వారసత్వ సంపద ఉన్న ప్రదేశంలో ఉండాల్సిన భద్రతా ఏర్పాట్లు కనీసం లేకపోవడం వల్లే ఈ పరిస్థితులు వస్తున్నాయని పురావస్తు నిపుణులు చెబుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రామప్ప పరిసరాల్లో అవసరమైన మేరకు భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.



గొల్లగుడి గర్భాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన దృశ్యం

నకిలీ క్లినిక్‌లపై దాడులు

- రూ.3.45 లక్షల విలువైన నకిలీ మందులు సీజ్ చేసిన డీసీఏ
- కరీంనగర్‌లో నకిలీ కాంబినేషన్ డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో గుర్తింపు లేకుండా కొనసాగుతున్న నకిలీ క్లినిక్స్‌పై శుక్రవారం దాడులు నిర్వహించినట్టు డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.3.45 లక్షల విలువైన నకిలీ మందులను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కాప్రా సర్కిల్‌లో లైసెన్స్ లేకుండా కొనసాగుతున్న మెడికల్ షాపును సీజ్ చేసి, రూ.30 వేల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పెద్దపల్లిలో ఫెర్రోస్ అస్కోర్బేట్ అండ్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్, మంచిర్యాలలో హెమాటినిక్ విత్ జింక్ అండ్ విటమిన్స్ టాబ్లెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్‌లో కేంద్రం బ్యాన్ చేసిన ఎల్-అర్జిన్ +సిల్‌డెనాఫిల్ డ్రగ్ కాంబినేషన్, హిమాచల్‌లోని బ్రాడ్ ఇంజక్టబుల్స్, తప్లివాల్‌తో పాటు ఎల్-ప్రాన్జ-సిడ్-సాఫ్టజెల్ క్యాప్సుల్స్ అనే కాంబినేషన్, హర్యానాకు చెందిన ఫార్మాకాన్ గైనకాలజీ కేర్ తయారీ చేసిన మందులను సీజ్ చేశారు. నకిలీ క్లినిక్‌లు, లైసెన్స్ లేని మెడికల్ షాపులు, నకిలీ మందుల తయారీ గురించి టోల్‌ఫ్రీ నంబర్ 18005996969కు ఫోన్ చేయాలని డీజీ సూచించారు.



కోదాడ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వరద బాధిత కుటుంబాలు

కోదాడలో వరద బాధితుల ఆందోళన

కోదాడటౌన్, సెప్టెంబర్ 27 : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సర్వం కోల్పోయిన తమను ఆదుకోవాలని సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కూచిపూడి గ్రామం, అనంతగిరి మండలం గోంద్రియాల చెందిన వరద బాధితులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు కోదాడ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నష్టపోయిన బాధితులను వదిలేసి కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవారినే అధికారులు జాబితాలో చేర్చారని, రేషన్ కార్డు లేకుంటే కూడా నష్టపరిహారం రాదని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కోదాడ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేష్ నాయుడు మాట్లాడుతూ వరదల కారణంగా సర్వం కోల్పోయి దిక్కుతోచని అయోమయ స్థితిలో ఉన్న బాధితులకు న్యాయం చేయాల్సిన అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ఎన్పీడీసీఎల్‌లో బదిలీల నిషేధం ఎత్తివేత

అక్టోబర్ 4లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం

హనుమకొండ, సెప్టెంబర్ 27: టీజీఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు శుభవార్త. బదిలీల నిషేధం ఎత్తివేస్తూ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మార్గదర్శకాలు జారీ చేశారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. అక్టోబర్ 4లోగా బదిలీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మార్గదర్శకాల ప్రకారం 30 జూన్ 2024 నాటికి రెండేండ్ల సర్వీసు పూర్తి చేసిన వారు బదిలీలకు అర్హులు. ఏడాదిలోపు పదవీ విరమణ పొందేవారికి బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. ప్రత్యేక కారణాలు గలవారు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకొంటే పరిశీలిస్తారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని క్యాటగిరీల ఉద్యోగులకు బదిలీలు జరుగనున్నాయి. నిబంధనల ప్రకారం ఉద్యోగుల జాబితాను సిద్ధం చేసి బదిలీ పోర్టల్‌లో 28లోగా పొందుపరుచాలి. అభ్యంతరాలు ఉంటే 30వ తేదీ లోగా ఫిర్యాదు చేయాలి. అక్టోబర్ 4న బదిలీ చేసే అథారిటీ అధికారులకు ట్రాన్స్‌ఫర్ దరఖాస్తులను అందజేయాలి. ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులు అక్టోబర్ 7లోగా జారీ చేయాలి. బదిలీ అయిన ఉద్యోగులు ఆయా స్థానాల నుంచి అక్టోబర్ 9వ తేదీ లోగా రిలీవ్ కావాల్సి ఉంటుందని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. అక్టోబర్ 8వ తేదీ నుంచి బదిలీల నిషేధం మళ్లీ అమలులోకి వస్తుందని సీఎండీ తెలిపారు.

ట్రిపుల్ ఆర్‌పై ఉద్యమమే..

- అలైన్‌మెంట్ మార్చే వరకూ పోరాటం
- ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు ప్రణాళిక
- అవసరమైతే ఢిల్లీ దాకా వెళ్తాం
- చౌటుప్పల్‌లో బాధితుల సమావేశం
- హాజరైన చౌటుప్పల్, వలిగొండ మండలాల భూ నిర్వాసితులు



ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల ఐక్యవేదిక సమావేశంలో పాల్గొన్న నాయకులు, రైతులు

చౌటుప్పల్, సెప్టెంబర్ 27: రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు భూ నిర్వాసితులు కదం తొక్కుతున్నారు. అలైన్‌మెంట్ మార్చే వరకు పోరాటం ఆగదని, హైదరాబాద్ నడిబొడ్డుకు కాదు ఢిల్లీకైనా సిద్ధమేనని ప్రకటించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం శుభం గార్డెన్‌లో శుక్రవారం ట్రిపుల్ ఆర్ బాధితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భూ నిర్వాసితులు సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి చౌటుప్పల్, వలిగొండ మండలాల్లోని రైతులు పెద్దసంఖ్యలో వచ్చారు. అక్టోబర్1న ఇందిరాపార్కు వద్ద ధర్నా చేయాలని రైతులు చర్చించుకున్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు నాలుగు ప్రధాన రహదారులకు 40కిలోమీటర్లు దూరంలో జంక్షన్ ఏర్పాటు చేశారని, కానీ చౌటుప్పల్, భువనగిరి ప్రాంతాల్లో కేవలం 28కిలోమీటర్ల దూరంలో నిర్మించడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై ఢిల్లీకి వెళ్లి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలుస్తామని తెలిపారు.

సీఎం, మంత్రులవి పొంతన లేని మాటలు

సీపీఎం నేతలు సీఎం రేవంత్ రెడ్డిని కలిస్తే అలైన్‌మెంట్‌పై ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని, వెనక్కి తగ్గేదిలేదని చెప్పారని. కానీ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాత్రం జంక్షన్ 40కిలోమీటర్ల దూరం వెళ్తున్నదని చెబుతున్నారని తెలిపారు. సీఎం, మంత్రుల పొంతన లేని మాటలు నమ్మే పరిస్థితి లేదంటున్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి ట్రిపుల్ ఆర్‌పై మాట్లాడడం లేదని మండిపడ్డారు.

ఫార్మాసిటీపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తేతెలంగాణ): వేలాది మంది యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా తెచ్చిన ఫార్మాసిటీపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ నేత భరత్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఫార్మాసిటీ విషయంలో హైకోర్టుకు కూడా అబద్ధాలు చెబుతున్నారని అని విమర్శించారు.ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేయదలుచుకుంటే రైతుల నుంచి సేకరించిన 14 వేల ఎకరాలను తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు ఫ్యూచర్‌సిటీ అంటూ హంగామా చేస్తూ రియల్‌ఎస్టేట్ దందాకు తెరలేపిందని దుయ్యబట్టారు.

ఢిల్లీదాకా వెళ్తాం..



ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చక పోతే మరింత ఉద్యమిస్తాం. హైదరాబాద్ ఇందిరపార్కు వద్ద ధర్నాకు సిద్ధమయ్యాం. ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే ఢిల్లీ దాకా వెళ్తాం. కేంద్రమంత్రులను కూడా కలుస్తాం.

–చింతల దామోదర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, చౌటుప్పల్

పంట భూములను ఆగం చేస్తరా?



నాకు 11 ఎకరాల భూమి ఉన్నది. వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకుతున్న. మా అయ్య కష్టపడి సంపాదించిండు. సగానికిపైగా రోడ్డుకు పోతున్నది. మా కుటుంబం ఎట్ల బతకాలె. పంట భూములను ఆగం చేస్తరా?

–వల్లూరిబోగయ్య, మందోళ్లగూడెం

'పవర్ జేఏసీ నుంచి వైదొలుగుతున్నాం'

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నుంచి వైదొలుగుతున్నట్టు తెలంగాణ విద్యుత్తు బీ సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, తెలంగాణ ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు ప్రకటించారు. పదోన్నతులు సమీక్షించాలన్న డిమాండ్లను జేఏసీ నేతలు పరిగణనలోకి తీసుకోకపోవడంతో స్వచ్ఛందంగా వైదొలుతున్నట్టు ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భానుప్రకాశ్, బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్ ప్రకటనలో తెలిపారు.

గాంధీభవన్‌లో ముఖాముఖి


320 వినతులు స్వీకరించిన మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తేతెలంగాణ):హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కార్యకర్తలు, ప్రజలతో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ముఖాముఖి నిర్వహించారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 320 దరఖాస్తులను స్వీకరించారు.

ఉత్తమ పర్యాటకంగా సోమశిల, నిర్మల్

- ఆధ్యాత్మికత, ఆరోగ్యం, కళాత్మకత రంగాల్లో ఎంపిక
- దేశవ్యాప్తంగా 36గ్రామాల గుర్తింపు
- ఢిల్లీలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖర్ చేతుల మీదుగా అవార్డుల స్వీకరణ





అవార్డు అందుకుంటున్న నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక అభివృద్ధి అధ్యక్షుడు నర్సింహ

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి రెండు జాతీయ అవార్డులు వరించాయి. ఉత్తమ పర్యాటక గ్రామాలుగా సోమశిల, నిర్మల్ ఎంపికయ్యాయి. 2024 సంవత్సరానికి కేంద్ర పర్యాటకశాఖ ఉత్తమ పర్యాటక గ్రామాలను శుక్రవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 8 క్యాటగిరీల్లో 36 గ్రామాలను ఎంపిక చేయగా, కళాకృతుల విభాగంలో నిర్మల్, ఆధ్యాత్మిక, ఆరోగ్య విభాగంలో నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలంలోని సోమశిల అవార్డులు సాధించాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖర్ అవార్డులను ప్రదానం చేశారు. నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్ టాయ్స్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు ఎస్ పెంటయ్య, నాగర్‌కర్నూలు జిల్లా పర్యాటకశాఖ అధికారి టీ నరసింహ అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు. గత ఏడాది ఉత్తమ పర్యాటక గ్రామాలుగా సిద్దిపేట జిల్లాలోని చంద్లాపూర్, జనగామ జిల్లాలోని పెంబర్తి గుర్తింపు పొందిన విషయం తెల్సిందే.

'నీట్' స్థానికతపై విచారణ 30కి వాయిదా

సుప్రీంకోర్టు ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): నీట్ కౌన్సెలింగ్‌లో స్థానికతకు సంబంధించిన అంశంపై సుప్రీంకోర్టులో విచారణ సోమవారానికి వాయిదా పడింది. మెడికల్ అడ్మిషన్లకు ముందు వరుసగా నాలుగేండ్లు తెలంగాణలో చదివినవారిని లేదా స్థానికంగా ఉన్నవారినే స్థానికులుగా పరిగణిస్తామని గతంలో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడంపై కొందరు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించడంతో వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనిపై ఈ నెల 11న సుప్రీంకోర్టును ఆశ్రయించిన రాష్ట్ర ప్రభుత్వం.. హైకోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అంగీకరించింది. దీంతో ఆ 135 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు సుప్రీంకోర్టు అవకాశం కల్పించడంతోపాటు హైకోర్టు తీర్పుపై తాత్కాలికంగా స్టే విధించింది. ఆ మేరకు మధ్యంతర ఉత్తర్వులను వెలువరించి, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం శుక్రవారం మరోసారి ఈ అంశంపై విచారణ చేపట్టడంతో.. హైకోర్టులో కేసు వేసిన 135 మంది విద్యార్థులకు మాత్రమే కౌన్సెలింగ్‌కు వీలు కల్పించడం అన్యాయమని, దీని వల్ల తెలంగాణ స్థానికతతో మెడికల్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఇతర విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని ప్రతివాదులు తెలిపారు. గత విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను విద్యార్థులందరికీ వర్తింపజేయాలని కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. మధ్యంతర ఉత్తర్వులను సవరించాలంటే ఆనాటి ధర్మాసనంలోని ముగ్గురు న్యాయమూర్తులు విచారణ జరపాల్సి ఉంటుందని పేర్కొన్నది. ఆ ధర్మాసనంలో సభ్యుడైన జస్టిస్ జేబీ పార్థీవాలా ప్రస్తుతం అందుబాటులో లేనందున ఈ అంశంపై ఈ నెల 30న విచారణ చేపడతామని ప్రకటించింది.

గురుకులంలో విద్యార్థి మృతి

- జ్వరంతో చికిత్స పొందుతూ కన్నుమూత
- సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటున్న తండ్రి

ములుగు రూరల్, సెప్టెంబర్ 27: గురుకులం విద్యార్థి అనారోగ్యానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన ములుగు మండలం ఇంచర్ల శివారులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో చోటుచేసుకున్నది. విద్యార్థి తండ్రి బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాయిగూడెం మండలం రాజన్నపేటకు చెందిన కోరం చరణ్ (15) గురుకులంలో పదోతరగతి చదువుతున్నాడు. గురువారం గురుకులం నుంచి ఫోన్ చేసి.. చరణ్ జ్వరంతో బాధపడుతున్నాడని, తీసుకెళ్లాలని చెప్పారు. చరణ్‌ను ములుగు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా వైద్యులు చికిత్స ప్రారంభించారు. శుక్రవారం ఉదయం విద్యార్థికి మూత్రం బంద్ కావడంతో వైద్యుల సూచన మేరకు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారం నుంచి జ్వరంతో పాటు మూడు రోజులుగా మూత్రం రావడం లేదని వైద్యులు తెలిపినట్టు విద్యార్థి తండ్రి పేర్కొన్నారు. చరణ్ మృతికి గురుకుల సిబ్బందే కారణమని ఆరోపించాడు. ఈ విషయమై ప్రిన్సిపాల్ ఝాన్సీని వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ఆర్సీవో హరిసింగ్‌ను సంప్రదించగా విద్యార్థి గురుకులంలో మృతి చెందలేదని, జ్వరం తగ్గిన తర్వాత అతడిని సోదరి ఇంటికి తీసుకెళ్లిందని తెలిపారు. శుక్రవారం జ్వరం ఎక్కువ కావడంతో చరణ్ మృతి చెందినట్టు పేర్కొన్నారు.

మరో రెండు రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రేపటి నుంచి 2,3 రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, కొమురం భీమ్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.



స్వైప్-స్పెండ్-డిఫాల్ట్

తీద్దాం..వాడుదాం..ఎగ్గొడుదాం అన్న రీతిలో క్రెడిట్ కార్డు యూజర్లు

మిల్లేనియల్స్‌లో ఓ అలవాటుగా మారిన వైనం • సిబిల్ తాజా రిపోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27: యువతలో పెరుగుతున్న క్రెడిట్ కార్డుల వినియోగం పెడదారి పడుతున్నది. ఓ వైపు క్రెడిట్ స్కోర్లపై అవగాహనను పెంచుకుంటూనే.. మరోవైపు క్రెడిట్ కార్డులను విచ్చలవిడితనంతో వాడేస్తున్నారు. స్వైప్ చేద్దాం, ఎడాపెడా ఖర్చు పెడదాం, ఆ మొత్తాలను తిరిగి చెల్లించకుండా ఎగవేద్దాం.. అన్న రీతిలో చాలామంది క్రెడిట్ కార్డు యూజర్లు, ముఖ్యంగా మిల్లేనియల్స్ (1981-1996 మధ్య జన్మించినవారు) ఉండటం ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నది మరి. ప్రముఖ క్రెడిట్ రేటింగ్ సమాచార సంస్థ, ట్రాన్స్‌యూనియన్ సిబిల్ తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో ఒకింత విస్తుపోయే నిజాలే వెలుగుచూశాయి. బై నౌ, పే లేటర్ (ఇప్పుడు కొనండి, తర్వాత తీరిగ్గా చెల్లించండి) సంస్కృతికి యంగ్ మిల్లేనియల్స్ అలవాటు పడిపోయిన తీరు స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ-కామర్స్ వేదికలపై చేసే ఆన్‌లైన్ షాపింగ్‌ల్లో ఈఎంఐలతో జరుగుతున్న కొనుగోళ్లే ఎక్కువగా ఉండటాన్నిబట్టి పరిస్థితుల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

రూ.2.7 లక్షల కోట్లకు

క్రెడిట్ కార్డులను సక్రమంగా వినియోగించుకుంటే ఎన్ని లాభాలున్నాయో.. దారితప్పితే అన్ని నష్టాలూ ఉన్నాయి. సిబిల్ వివరాల ప్రకారం క్రెడిట్ కార్డ్ డిఫాల్ట్స్ ఈ ఏడాది జూన్ నాటికి 1.8 శాతానికి పెరిగాయి. 6 నెలల క్రితం ఇది 1.7 శాతంగా ఉండగా, గత ఏడాది మార్చిలో 1.6 శాతంగా ఉన్నది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే క్రెడిట్ కార్డుల బకాయిలు ఈ జూన్‌దాకా రూ.2.7 లక్షల కోట్లుగా ఉన్నాయి. మార్చిలో రూ.2.6 లక్షల కోట్లుగా ఉన్నట్టు సిబిల్ తెలియజేసింది. నిరుడు మార్చిలో రూ.2 లక్షల కోట్లే. నిజానికి కరోనాకు ముందు 2019 మార్చిలో మొత్తం బకాయిలు రూ.87,686 కోట్లుగానే ఉన్నాయి. కానీ ఆ తర్వాతి ఐదేండ్లలో మూడింతలు ఎగిశాయి. చక్ర వార్షిక వృద్ధిరేటు (సీఏజీఆర్) 24 శాతంగా నమోదైంది. కాగా, 1-2 నెలలపాటు చెల్లించకపోతే బ్యాంకులు బకాయిలుగా భావిస్తాయి. ఆపై 6 నెలలపాటు చెల్లించకపోతే దాన్ని డిఫాల్ట్‌గా పరిగణిస్తాయి.

క్రెడిట్ కార్డుపైనున్న మొత్తం నగదు పరిమితిని యువత వాడేస్తున్నది. ఆన్‌లైన్ షాపింగ్‌లలో స్మార్ట్‌ఫోన్లు, బట్టలు, షూస్ కొనుగోళ్ల కోసం ఎక్కువగా క్రెడిట్ కార్డులనే యంగ్ మిల్లేనియల్స్ ఆశ్రయిస్తున్నారు. అనవసరపు ఖర్చులకు దిగుతూ.. తిరిగి వాటిని చెల్లించలేక చేతులెత్తేస్తున్నారు. చివరకు అవి మొండి బకాయిలుగా మారుతున్నాయి. దీనివల్ల భవిష్యత్తులో గృహ రుణాల వంటి కీలకమైన ఆర్థిక సాయాన్ని పొందలేని పరిస్థితి వస్తున్నది. కాబట్టి క్రెడిట్ కార్డులు ఇస్తున్నారు కదా అని తీసుకోవద్దు. అవసరం ఉంటేనే తీసుకోవాలి. లేకపోతే వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిది.

-సురేశ్ గణపతి, ఫైనాన్షియల్ రిసెర్చ్ అనలిస్ట్

డిఫాల్టర్లపై చర్యలు ఇలా..

క్రెడిట్ కార్డు బకాయిల ఎగవేతదారులపై బ్యాంకులు తీసుకునే చర్యలను పరిశీలిస్తే..

1. న్యాయపరంగా

క్రెడిట్ కార్డును వాడుకుని, ఆ మొత్తాలను చెల్లించకపోతే బ్యాంకులు లీగల్ యాక్షన్స్ తీసుకోవడానికి అవకాశాలున్నాయి. సివిల్ స్యూట్ లేదా క్రిమినల్ కేసునూ పెట్టడానికి వీలున్నది. దీనివల్ల ఆర్థిక నష్టమేగాక, డిఫాల్టర్ ముద్ర అధికారికంగా పడుతుంది. చెల్లింపులు జరుపకపోతే జైలు శిక్షలకూ ఆస్కారం ఉన్నది.

2. డెట్ కలెక్షన్ ఏజెన్సీలకు

తమ సొమ్మును తిరిగి వసూలు చేసుకోవడంలో భాగంగా డిఫాల్టర్ల వివరాలను డెట్ కలెక్షన్ ఏజెన్సీ (రుణ వసూలు సంస్థ)లకు బ్యాంకులు అప్పగించే వీలున్నది. బకాయిల వసూళ్లలో ఈ ఏజెన్సీలు ఎటువంటి కఠిన చర్యలకు దిగుతాయో చూస్తూనే ఉన్నాం. డిఫాల్టర్లు ఒకవేళ పారిపోతే వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, పరిచయస్తులకూ తిప్పలు తప్పవు.

3. క్రెడిట్ స్కోర్ డౌన్

రుణగ్రహీతలు తమ అప్పులను సకాలంలో చెల్లించకపోతే వారి క్రెడిట్ స్కోర్ పడిపోతుంది. ఈ క్రెడిట్ స్కోర్ ఆధారంగానే బ్యాంకులు, ఇతరత్రా నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు రుణాల మంజూరు, వడ్డీరేట్లపై నిర్ణయం వంటివి చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఒక్కసారి ఎగవేతదారు ముద్రపడితే భవిష్యత్తులో మరే రకమైన రుణాలైనా అందుకోవడం చాలాకష్టతరం.

4. తక్కువ రుణ పరిమితి

ఒక బ్యాంక్‌లో క్రెడిట్ కార్డు బకాయిల ఎగవేతలకు పాల్పడినవారికి ఇతర బ్యాంకుల్లోనూ ఇబ్బందులు తప్పవు. క్రెడిట్ కార్డ్‌పై నుండే నగదు పరిమితి తగ్గిపోతుంది. ఆఫర్లూ పెద్దగా ఉండవు. ఇంకొన్ని బ్యాంకులైతే క్రెడిట్ కార్డులను ఇచ్చేందుకూ ముందుకు రావు.



రోల్స్-రాయిస్ కల్లినన్-2

ప్రారంభ ధర రూ.10.50 కోట్లు

చెన్నై, సెప్టెంబర్ 27: బ్రిటన్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ రోల్స్-రాయిస్ కార్స్..దేశీయ మార్కెట్లోకి అల్ట్రా-లగ్జరీ కల్లినన్ సిరీస్-2 మాడల్‌ను పరిచయం చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.10.50 కోట్లు. అలాగే బ్లాక్ బ్యాడ్జ్ మాడల్ రూ.12.25 కోట్ల ప్రారంభ ధరతో లభించనున్నాయి. ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి.

రికార్డుల నుంచి వెనక్కి

264 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ • 37 పాయింట్లు దిగిన నిఫ్టీ

ముంబై, సెప్టెంబర్ 27: స్టాక్ మార్కెట్ల ర్యాలీకి బ్రేక్ పడింది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకున్న సూచీల జోరుకు ఎట్టకేలకు బ్రేక్‌పడింది. మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో వారాంతం ట్రేడింగ్‌లో సూచీలకు నష్టాలే మిగిలాయి. ఒక దశలో 86 వేల పాయింట్లకు చేరువైన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్.. బ్లూచిప్ సంస్థల షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో భారీగా నష్టపోయింది. ఇంట్రాడేలో 85,978.25 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సెన్సెక్స్ చివరకు 264.27 పాయింట్లు నష్టపోయి 85,571.85 వద్ద ముగిసింది. బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ రంగ షేర్లు ఒత్తిడికి లోనుకావడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. మరోవైపు వరుసగా ఆరు రోజులుగా పెరుగుతూ వచ్చిన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ సైతం 37.10 పాయింట్లు కోల్పోయి 26,178.95 వద్ద స్థిరపడింది. ఈ భారీ నష్టాలను రిలయన్స్ షేరు కొంతమేర నిలువరించింది. ఈవారంలో సెన్సెక్స్ 1,027.54 పాయింట్లు(1.21 శాతం), నిఫ్టీ 388 పాయింట్లు(1.50 శాతం) చొప్పున లాభపడ్డాయి.

టాప్‌లూజర్‌గా పవర్‌గ్రిడ్

విద్యుత్ సంస్థ పవర్‌గ్రిడ్ షేరు భారీగా నష్టపోయింది. కంపెనీ షేరు 3 శాతం నష్టపోవడంతో టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతో



పాటు భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌యూఎల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, యాక్సిస్ బ్యాంక్, నెస్లె, టాటా మోటర్స్‌లు నష్టపోయాయి. కానీ సన్‌ఫార్మా, రిలయన్స్, టైటాన్, హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్, మారుతి, ఎన్‌టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఎస్బీఐ, మహీంద్రా, ఐటీసీలు లాభాల్లో ముగిశాయి.



వరద బాధితుల సహాయార్థం నీతా అంబానీ తరపున సీఎం రేవంత్ రెడ్డిని కలుసుకొని ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.20 కోట్ల విరాళానికి సంబంధించిన చెక్కును అందజేస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు. అలాగే భారత్ బయోటెక్ కూడా కోటి రూపాయల విరాళాన్ని అందించింది.

సెయిల్‌లో వైజాగ్ స్టీల్ విలీనం!

కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27: ఆర్థిక నష్టాల్లో కొనసాగుతున్న ప్రభుత్వరంగ స్టీల్ ఉత్పత్తి సంస్థ రాష్ట్రీయా ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్(వైజాగ్ స్టీల్) విక్రయ ప్రతిపాదనపై కేంద్ర సర్కార్ వెనక్కి తగ్గింది. కార్మికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో మోదీ సర్కార్ మరో ఆఫర్‌ను తెరపైకి తీసుకొచ్చింది. ఈ వైజాగ్ స్టీల్‌ను మరో ప్రభుత్వరంగ సంస్థయైన సెయిల్‌లో విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కించడానికి సెయిల్‌లో విలీన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా భావిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. అలాగే వైజాగ్ స్టీల్‌కు ఉన్న 2వేల ఎకరాల భూములను సైతం ఎన్‌ఎండీసీకి విక్రయించడంతోపాటు సంస్థకు ఉన్న బ్యాంక్ రుణాలకు శాశ్వత పరిష్కారం సూచించబోతున్నట్లు చెప్పారు. దీంట్లో భాగంగా డీఎఫ్‌ఎస్ కార్యదర్శి, స్టీల్ సెక్రటరీతోపాటు బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వైజాగ్ స్టీల్‌కు అత్యధికంగా రుణం ఇచ్చింది ఎస్బీఐ కావడం విశేషం. విశాఖపట్నంలో సంస్థకు 75 లక్షల టన్నుల స్టీల్ ఉత్పత్తి కలిగిన ప్లాంట్ ఉన్నది. ఉక్కు పరిశ్రమకు సొంతంగా గనులు లేకపోవడం వల్లనే నష్టాలు వస్తున్నాయని కార్మిక సంఘాలు ప్రధానంగా ఆరోపిస్తున్నాయి.

మారిన మార్కెట్ ఫీజులు

స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అక్టోబర్ 1 నుంచి అమల్లోకి

ముంబై, సెప్టెంబర్ 27: క్యాష్ మార్కెట్, ఈక్విటీ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ సెగ్మెంట్లలో లావాదేవీ ఫీజులను బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ)లు శుక్రవారం సవరిస్తున్నట్టు ప్రకటించాయి. ఈ మార్పులు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ఆదేశానుసారం స్టాక్ ఎక్స్ఛేంజీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఎన్‌ఎస్‌ఈ వివరాల ప్రకారం క్యాష్ మార్కెట్‌లో లావాదేవీ ఫీజు ట్రేడెడ్ వాల్యూలో లక్షకు రూ.2.97 చొప్పున ఉంటుంది. ఇక ఈక్విటీ డెరివేటివ్స్‌లోనైతే ఫ్యూచర్స్ సెగ్మెంట్‌కు ట్రాన్జాక్షన్ ఫీ.. ట్రేడెడ్ వాల్యూలో లక్షకు రూ.1.73గా ఉన్నది. అదే ఆప్షన్స్ సెగ్మెంట్‌కు ప్రీమియం వాల్యూలో లక్షకు రూ.35.03గా ఉన్నట్టు ఎన్‌ఎస్‌ఈ తెలిపింది. అలాగే కరెన్సీ డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో ఫ్యూచర్స్ కోసం లావాదేవీ ఫీజును ట్రేడెడ్ వాల్యూలో లక్షకు 35 పైసలుగా నిర్ణయించినట్టు పేర్కొన్నది. ఆప్షన్స్-ఇంట్రెస్ట్ రేట్ ఆప్షన్స్‌లోనైతే ప్రీమియం వాల్యూలో లక్షకు ఈ ఫీజు రూ.31.1గా ఉన్నది. బీఎస్‌ఈ వివరాల ప్రకారం కరెన్సీ డెరివేటివ్స్ సెగ్మెంట్, ఫ్యూచర్స్ కాంట్రాక్ట్స్ (క్రాస్-కరెన్సీ ఫ్యూచర్స్ సహా)ల్లో టర్నోవర్ వాల్యూలో కోటికి రూ.45గా చార్జీని నిర్ణయించారు. ఆప్షన్స్ (క్రాస్-కరెన్సీ ఆప్షన్స్‌సహా)ల్లో ప్రీమియం టర్నోవర్ వాల్యూలో కోటికి రూ.100గా ఫీజు ఉంటుంది. ఈక్విటీ డెరివేటివ్స్ సెగ్మెంట్ కోసం సెన్సెక్స్, బ్యాంకింగ్ ఆప్షన్స్ కాంట్రాక్ట్స్‌కూ సవరించిన ఫీజులే వర్తిస్తాయి.

హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టండి

మైన్‌ఎక్స్‌పో ఇంటర్నేషనల్ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): ఐటీ, పునరుత్పాక విద్యుత్, వస్తు ఉత్పత్తిలో పురోగమిస్తున్న హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలని అమెరికన్ కంపెనీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. అమెరికాలో గురువారం జరిగిన మైన్‌ఎక్స్‌పో సదస్సులో ఆయన అంతర్జాతీయ, అమెరికన్ కంపెనీ ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఫేస్‌బుక్, యాపిల్ లాంటి దిగ్గజ సంస్థల పెట్టుబడులతో హైదరాబాద్ గ్లోబల్‌సిటీగా, ఇన్నోవేషన్ సెంటర్‌గా రూపుదిద్దుకున్నదని, తమ ప్రభుత్వం వ్యాపార అనుకూల విధానాలను అవలంభిస్తున్న నేపథ్యంలో విరివిగా పెట్టుబడులు పెట్టాలని కోరారు. కొత్తగా నిర్మించనున్న ఫ్యూచర్‌సిటీలో ఐటీ, కృత్రిమ మేధస్సు, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు విరివిగా నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నదన్నారు. ఈ అవకాశాన్ని ఇంటర్నేషనల్ కంపెనీలు వినియోగించుకోవాలని సూచించారు.

థామ్సన్ పండుగ ఆఫర్లు



హైదరాబాద్, సెప్టెంబర్ 27: ఫ్రెంచ్‌నకు చెందిన గృహోపకరణాల తయారీ సంస్థ థామ్సన్..పండుగ ఆఫర్లను ప్రకటించింది. స్మార్ట్ టీవీలు, వాషింగ్‌మెషిన్లు, స్పీకర్లను తగ్గింపు ధరకే అందిస్తున్నట్లు ప్రకటించింది. రూ.5,999 ప్రారంభ ధరకే స్మార్ట్ టీవీని అందిస్తున్న సంస్థ..రూ.12,999 ప్రారంభ ధరతో వాషింగ్‌మెషిన్లను విక్రయిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుత పండుగసీజన్‌లో ఈ-కామర్స్ దిగ్గజాలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు ప్రత్యేకంగా బిగ్ బిలియన్ డేస్‌లను దృష్టిలో పెట్టుకొని ప్రకటించిన ఈ ఆఫర్లు వచ్చే పది రోజుల వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. అలాగే థామ్సన్ ఆండ్రాయిడ్ టీవీలను కొనుగోలు చేసిన వారికి మూడు నెలలపాటు ఓటీటీ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపింది.



అర్జున్, హారికకు నజరానా

25 లక్షలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో పసిడి పతకాలతో కొత్త చరిత్ర లిఖించిన తెలంగాణ యువ గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేసి అర్జున్, ద్రోణవల్లి హారిక ప్రతిభకు తగిన గుర్తింపు లభించింది. అంతర్జాతీయ వేదికపై రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసిన అర్జున్, హారికకు ప్రభుత్వం రూ.25లక్షల చొప్పున నగదు ప్రోత్సాహం ప్రకటించింది. శుక్రవారం జూబ్లిహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి..అర్జున్‌తో పాటు హారికను శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్జున్, హారిక కుటుంబసభ్యులతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌కు త్రిసా, గాయత్రి జోడీ

మకావు (చైనా): భారత స్టార్ షట్లర్ ద్వయం పుల్లెల గాయత్రి, త్రిసా జాలీ జోడీ మకావు ఓపెన్ సూపర్– 300 బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో 23వ ర్యాంకు భారత జోడీ.. 21–12, 21–17తో ఆరో సీడ్ చైనీస్ తైపీ అమ్మాయిలు హ్సు యిన్–హుయ్, లాన్ జి యున్‌ను చిత్తు చేసింది. ఆట ఆరంభం నుంచే ఆధిక్యంలో నిలిచిన భారత జంట.. వరుస సెట్లలో ప్రత్యర్థిని ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లింది. నాలుగు నెలల విరామం తర్వాత మళ్లీ రాకెట్ పట్టిన కిడాంబి శ్రీకాంత్ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో శ్రీకాంత్ 16–21, 12–21తో కా లంగ్ అంగుస్ (హాంకాంగ్) చేతిలో నిష్క్రమించాడు.

లంక 602/5 డిక్లేర్డ్

కమిందు మెండిస్ రికార్డు శతకం



కమిందు (182*)

గాలె: శ్రీలంక బ్యాటర్లు శతకాల పండుగ చేసుకోవడంతో న్యూజిలాండ్‌తో గాలె వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో ఆ జట్టు భారీ స్కోరు చేసింది. ఆట రెండో రోజు కమిందు మెండిస్ (250 బంతుల్లో182 నాటౌట్, 16 ఫోర్లు, 4 సిక్సర్లు), కుశాల్ మెండిస్ (149 బంతుల్లో 106 నాటౌట్, 6 ఫోర్లు, 3 సిక్సర్లు) శతకాలతో కదం తొక్కగా ఏంజెలో మాథ్యూస్ (88) తృటిలో సెంచరీ కోల్పోయాడు. ఆట తొలి రోజు చండీమాల్ (116) శతకంతో రెచ్చిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆ జట్టు 602/5 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన న్యూజిలాండ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో 22 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది.

డాన్ సరసన మెండిస్:

ఈ టెస్టులో వంద పరుగులు చేయడంతో మెండిస్ పలు రికార్డులు నెలకొల్పాడు. టెస్టులలో అతి తక్కువ (13) ఇన్నింగ్స్‌లో వెయ్యి పరుగులు పూర్తి చేసిన వారిలో మెండిస్ నాలుగో స్థానంలో (హెర్బర్ట్ సట్‌క్లిఫ్–12, ఎవర్టన్ వీక్స్–12, డాన్ బ్రాడ్‌మన్–13 ముందున్నారు) నిలిచాడు. మ్యాచ్‌ల పరంగా మెండిస్ –8 (బ్రాడ్‌మన్ 7 మ్యాచ్‌లు) రెండో స్థానంలో ఉన్నాడు. అంతేగాక టెస్టులలో అతడికి ఇది ఐదో శతకం కావడం గమనార్హం. 13 టెస్టు ఇన్నింగ్స్ తర్వాత ఐదు సెంచరీలు చేసిన వారిలో మెండిస్ ఆరో స్థానంలో నిలిచాడు.

కాన్పూర్ టెస్టుకు వర్షం అడ్డంకి


వరుణుడి ఆట

తొలి రోజు 35 ఓవర్లే సాగిన మ్యాచ్ • ముగ్గురు సీమర్లతో బరిలోకి భారత్ • రాణించిన ఆకాశ్ దీప్

భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టుకు వరుణుడు ఆటంకంగా మారాడు. మ్యాచ్ గెలిచి సిరీస్ క్లీన్‌స్వీప్ చేద్దామనుకున్న టీమ్‌ఇండియా ఆశలపై నీళ్లు చల్లేలా కనిపిస్తున్నాడు. వర్షంతో గంటన్నర ఆలస్యంగా మొదలైన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ మూడు వికెట్లు చేజార్చుకుని 107 పరుగులు చేసింది. యువ పేసర్ ఆకాశ్‌దీప్ ధాటికి బంగ్లా బ్యాటర్లు తేలిపోయారు. వరుస విరామాల్లో వర్షం ఎడతెరిపి లేకుండా కురువడంతో మైదానం చిత్తడిగా మారింది. దీంతో మొదటి రోజు ఆట 35 ఓవర్లకే పరిమితమైంది.



ఆకాశ్‌దీప్ (2/34)



కాన్పూర్: సొంతగడ్డపై బంగ్లాదేశ్‌ను రెండో టెస్టులోనూ ఆదిలోనే దెబ్బకొట్టి ఆధిపత్యం చెలాయించాలని చూసిన భారత క్రికెట్ జట్టు ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్ స్టేడియం వేదికగా శుక్రవారం మొదలైన రెండో టెస్టుకు వరుణుడు పదే పదే అంతరాయం కల్పించాడు. వెలుతురు లేకపోవడం, వర్షం కారణంగా తొలి రోజు 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యపడింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేస్తున్న బంగ్లాదేశ్.. 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. మోమినుల్ హక్ (40 బ్యాటింగ్, 7 ఫోర్లు), ముష్ఫికర్ రహీమ్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్‌దీప్ (2/34) రాణించాడు.

గంటన్నర ఆలస్యంగా..

కాన్పూర్‌లో గురువారం రాత్రి వర్షం కురవడంతో గ్రీన్ పార్క్ మైదానం ఔట్ ఫీల్డ్ చిత్తడిగా మారింది. దీంతో మ్యాచ్ నిర్ణీత సమయాని కంటే గంట (ఉదయం 10:30 గంటలకు) ఆలస్యంగా ప్రారంభమైంది. టాస్ గెలిచిన రోహిత్.. ఆశ్చర్యకరంగా ఫీల్డింగ్ (స్వదేశంలో టెస్టు ఆడుతూ టాస్ గెలిచి భారత్ ఫీల్డింగ్ చేయడం 2015 తర్వాత ఇదే మొదటిసారి) ఎంచుకోవడంతో పాటు ముగ్గురు సీమర్లతో బరిలోకి దిగింది. కాన్పూర్ పిచ్ మ్యాచ్ సాగుతున్న కొద్దీ స్పిన్నర్లకు అనుకూలిస్తుందని భావించినా రోహిత్ మాత్రం తొలి టెస్టులో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగాడు. ఆట ఆరంభమయ్యాక బుమ్రా, సిరాజ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌కు బంగ్లా ఆచితూచి ఆడింది. ఓపెనర్లు షద్మాన్ ఇస్లాం (24), జకీర్ హసన్ (0) డిఫెన్స్‌కే ప్రాధాన్యమిచ్చారు. జకీర్ అయితే వికెట్ కాపాడుకోవడానికి నానా తంటాలు పడ్డాడు.

బ్రేక్ ఇచ్చిన ఆకాశ్..

బంగ్లా ఇన్నింగ్స్ 9వ ఓవర్‌లో బంతిని ఆకాశ్‌దీప్‌నకు అందించిన రోహిత్ నమ్మకాన్ని అతడు వమ్ము చేయలేదు. తన తొలి ఓవర్ మూడో బంతికే అతడు.. జకీర్‌ను పెవిలియన్‌కు పంపి భారత్‌కు తొలి బ్రేక్ ఇచ్చాడు. జకీర్ ఇచ్చిన క్యాచ్‌ను గల్లీలో జైస్వాల్ ముందుకు డైవ్ చేస్తూ అద్భుతంగా అందుకున్నాడు. తన మూడో ఓవర్‌లో ఆకాశ్.. మరో ఓపెనర్ షద్మాన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లా సారథి నజ్ముల్ హొసెన్ శాంతో (31, 6 ఫోర్లు) ఆరంభంలో రెండు ఫోర్లు కొట్టి తన ఉద్దేశాన్ని చాటాడు. లంచ్ సమయానికి ఆ జట్టు స్కోరు 74/2గా ఉంది. ఆటగాళ్లు లంచ్‌కు వెళ్తున్న సమయంలోనే వర్షం రావడంతో రెండో సెషన్ 20 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. వర్షం తగ్గాక బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లా.. లంచ్ తర్వాత మూడో ఓవర్లో శాంతో వికెట్‌ను కోల్పోయింది. క్రీజులో కుదురుకుంటున్న శాంతోను అశ్విన్ వికెట్ల ముందు బలిగొన్నాడు.

మళ్లీ వర్షం..

శాంతో నిష్క్రమించిన తర్వాత ఐదు ఓవర్లకు వెలుతురు సరిగ్గా లేకపోవడంతో అంపైర్లు కొద్దిసేపు ఆటను నిలిపేశారు. అదే సమయంలో మొదలైన వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో తొలి రోజు ఆటను నిలిపేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు.

2 — **శాంతోను ఔట్ చేయడం ద్వారా ఆసియాలో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ (420)గా అశ్విన్ నిలిచాడు. ఈ క్రమంలో అతడు కుంబ్లే (419)ను దాటేశాడు. మురళీధరన్ (612) అగ్రస్థానంలో ఉన్నాడు.**

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 107/3 (మోమినుల్ 40 నాటౌట్, శాంతో 31, ఆకాశ్ 2/34)

ఆస్పత్రి పాలైన బంగ్లా 'సూపర్ ఫ్యాన్'



బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్తూ ఒళ్లంతా పులిచారలు, చేతిలో ఆ దేశ జెండాను పట్టుకుని కనబడే సూపర్ ఫ్యాన్ 'టైగర్ రాబీ' శుక్రవారం దవాఖాన పాలయ్యాడు. రెండో టెస్టు సందర్భంగా స్టాండ్ 'సీ'లో ఉన్న అతడు ఉన్నట్టుండి అస్వస్థతకు గురవడంతో అక్కడే ఉన్న పోలీసులు వెంటనే రాబీని స్థానిక ఆస్పత్రికి తరలించారు. 'మ్యాచ్ జరుగుతుండగా అతడు అస్వస్థతకు గురయ్యాడు. దీంతో వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించాం. ప్రస్తుతం అతడి పరిస్థితి మెరుగ్గా ఉంది' అని కాన్పూర్ అడిషనల్ కమిషనర్ హరీష్ చందర్ తెలిపారు. కానీ అంతకుముందు రాబీ అతడిపై ఎవరో దాడి చేశారని.. తన వీపుతో పాటు పక్కటెముకల మీద ఎవరో బలంగా కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయానని చెప్పడం గమనార్హం.

కోహ్లీ కోసం 58 కి.మీలు

భారత్‌లో క్రికెట్‌కు క్రేజ్ మామూలుగా ఉండదు. తమ ఆరాధ్య ప్లేయర్ల ఆటను ఒక్కసారైనా దగ్గర్నుంచి చూడాలని అనుకుంటారు. ఇప్పుడు ఇదే కోవలో ఉన్నావ్‌కు చెందిన 15 ఏండ్ల కార్తీకేయ్ అనే కుర్రాడు..కోహ్లీ ఆట చూసేందుకు ఏకంగా 58కి.మీలు సైకిల్ మీద మ్యాచ్ వేదికైన కాన్పూర్‌కు వచ్చాడు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న కార్తీకేయ్..తాను అభిమానించే కోహ్లీ కోసం ఇంత దూరం ఒంటరిగా వచ్చినట్లు మీడియాతో పేర్కొన్నాడు. కార్తీకేయకు క్రికెట్‌పై ఉన్న ఇష్టానికి అందరూ ఫిదా అవుతున్నారు.

చాయ్‌వాలాతో సెల్ఫీలు.. మమ్మల్ని పట్టించుకోలే!

• **భారత హాకీ ప్లేయర్ హార్దిక్ ఆవేదన**

ఢిల్లీ: ఒలింపిక్స్‌లో వరుసగా రెండో కాంస్యం గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్న హాకీ ప్లేయర్ హార్దిక్‌సింగ్ తమకు రావాల్సిన గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంటర్నెట్ సంచలనం 'డాలీ చాయ్‌వాలా'కు ఉన్న గుర్తింపు సైతం తమకు లేదని, జాతీయ జట్టుకు ఏండ్లుగా ఆడుతున్నా అభిమానులు తమను కనీసం పట్టించుకోలేదని తెలిపాడు. ఓ పాడ్‌కాస్ట్‌లో హార్దిక్ మాట్లాడుతూ.. 'నేను నా సొంత కళ్లతో చూసిన విషయాన్ని మీకు




చెబుతున్నాను. పారిస్‌లో కాంస్య పతకం గెలిచి స్వదేశానికి తిరిగొచ్చిన మా బృందంలో నేను, హర్మన్‌ప్రీత్ సింగ్, మన్‌దీప్‌సింగ్‌తో పాటు ఐదారుగురం ఒకేచోట ఉన్నాం. మాతో పాటు డాలీ చాయ్‌వాలా కూడా అక్కడే ఉన్నాడు. అక్కడికి వచ్చిన ప్రజలు అతడితో సెల్ఫీలు తీసుకోవడానికి ఎగబడుతున్నారు. కనీసం మమ్మల్ని పట్టించుకునే నాథుడే కనిపించలేదు. ఇది చూసి మాకు ఒకింత ఇబ్బందిగా అనిపించింది. ఒక అథ్లెట్‌కు పేరు, డబ్బు కంటే అభిమానుల నుంచి గుర్తింపు దక్కినప్పుడు ఆ ఆనందాన్ని మాటల్లో వ్యక్తపరచలేము. ఏ అవార్డూ దానికి సరితూగదు' అంటూ ఆవేదన చెందాడు.

ఐటా అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానం!



ఢిల్లీ: భారత టెన్నిస్ సమాఖ్య (ఐటా) అధ్యక్షుడు అనిల్ జైన్‌పై 8 రాష్ట్రాల టెన్నిస్ అసోసియేషన్స్ అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాయి. ఈ మేరకు శనివారం (సెప్టెంబర్ 28) ఎక్స్‌ట్రా ఆర్డినరీ జనరల్ మీటింగ్ (ఈజీఎం)ను నిర్వహించేందుకు ఈ రాష్ట్రాల టెన్నిస్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. అసోం, జమ్మూ కాశ్మీర్, హర్యానా, మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడు, గుజరాత్, త్రిపుర రాష్ట్రాల ప్రతినిధులు అనిల్ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. వాస్తవానికి శనివారం ఐటా కూడా వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) జరిపించాల్సి ఉండగా అనిల్ వ్యతిరేక వర్గం కూడా ఇదే రోజు ఈజీఎంకు పిలుపునివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఐటా నిధులను అనిల్ పక్కదారి మళ్లిస్తున్నారని, ఆయన తన కుటుంబంతో కలిసి విహారయాత్రలకూ ఈ నిధులనే వినియోగిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

కేకేఆర్ మెంటార్‌గా బ్రావో



కోల్‌కతా: వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్, దిగ్గజ ఆటగాడు డ్వేన్ బ్రావో త్వరలో కొత్త బాధ్యతలు నిర్వర్తించబోతున్నాడు. ఐపీఎల్ గత సీజన్ విజేత కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)కు అతడు వచ్చే ఎడిషన్ నుంచి మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. ఈ మేరకు కేకేఆర్ ఈ విషయాన్ని శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. 2024 సీజన్‌లో కేకేఆర్‌కు గౌతం గంభీర్ మెంటార్‌గా వ్యవహరించగా బ్రావో.. చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్ కోచ్‌గా పనిచేశాడు.

ఆసీస్‌కు భారీ షాక్

లండన్: ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న ఆస్ట్రేలియాకు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ వెన్ను గాయం కారణంగా వన్డే సిరీస్ నుంచి అర్ధాంతరంగా తప్పుకున్నాడు. నాలుగో వన్డేకు ముందు నిర్వహించిన వైద్య పరీక్షలలో అతడి వెన్నుకు గాయమైనట్టు తేలడంతో గ్రీన్.. సిరీస్ నుంచి తప్పుకున్నాడు. గాయం తీవ్రత ఎక్కువైతే నవంబర్ నుంచి జరిగే భారత్, ఆసీస్ సిరీస్‌లో అతడు ఆడేది అనుమానమేనని క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) వర్గాల సమాచారం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.